ప్రతి నిత్యం తాజా వార్తలతో నిజాలు నిగ్గు తేలుస్తూ, సమకాలీన అంశాలను విశ్లేషిస్తూ మిస్తాబయి మీ ముందుకు వస్తున్న అక్షరం తెలుగు దినపత్రిక
సుఫల అక్షరం
తెలుగు దినపత్రిక సామాన్యుడి అస్త్రం
Your Ad Here.
ప్రకటనలకు (అడ్వర్టైస్‌మెంట్) కొరకు సంప్రదించండి
EDITOR & PUBLISHER: 9391690609, OFFICE: 7893003409.
aksharamtsnews@gmail.com .... www.aksharamtelugudaily.com

www.aksharamtelugudaily.com
RNI NO: TELTEL/2018/75419

# సుఫల అక్షరం

సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక

SUPHALA AKSHARAM

WEDNUSDAY 20TH MAY 2026 EDITOR : SHAIK YACOOB PASHA PAGES : 12 VOLUME : 09 ISSUE : 63 COST : 3\- KHAMMAM, TELANGANA

బుధవారం 20 మే 2026 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 09 సంచిక : 63 వెల : రూ.3/- ఖమ్మం, తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## ఉద్యోగులు, పెన్షనర్ల కోసం హెల్త్ కేర్ ట్రస్ట్ ఏర్పాటు

హైదరాబాద్,మే19 తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రత కోసం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కొత్తగా ఎంపాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసింది. ఈ కొత్త హెల్త్ స్కీమ్ అమల్లో భాగంగా రాష్ట్ర ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ అన్ని ప్రభుత్వ శాఖలకు అత్యవసర ఆదేశాలు జారీ చేసింది. ఈ పథకం ద్వారా ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు వైద్య భద్రత కల్పించడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యంగా తెలుస్తోంది.

# తెలంగాణ కేబినేట్ భేటీ 23కు వాయిదా ?

- సరస్వతీ పుష్కరాల నేపథ్యంలో నిర్ణయం
- 23న యాదగిరిగుట్టలో నిర్వహించే యోచన
- అధికారికంగా ప్రకటించడమే తరువాయి



హైదరాబాద్,మే19 రాజధాని వెలుపల మరోమారు తెలంగాణ కేబినేట్ సమావేశం జరగనుందని సమాచారం. గతంలో మేడారంలో కేబినేట్ నిర్వహించిన సిఎం రేవంత్ రెడ్డి తాజాగా ఇప్పుడు యాదగిరిగుట్టలో కేబినేట్ నిర్వహించేందుకు ఆదేశంచినట్లు తెలుస్తోంది. ఈ నెల 21 జరగాల్సిన కేబినేట్ సమావేశాన్ని 23న నిర్వహించాలని, అదికూడా యాదాద్రిలో నిర్వహించనున్నట్లు సమాచారం. 21 నుంచి సరస్వతీ అంత్య పుష్కరాల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ రాజకీయాలు, పాలనా నిర్ణయాల్లో ప్రస్తుతం రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్వహణ అత్యంత ఆసక్తికరంగా మారింది. ముందుగా అనుకున్న షెడ్యూల్ ప్రకారం కాకుండా, కేబినెట్ సమావేశాన్ని వాయిదా వేసే యోచనలో రేవంత్‌రెడ్డి సర్కార్ ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి ప్రధాన కారణం ప్రముఖ పుణ్యక్షేత్రమైన బాసరలో ప్రారంభం కానున్న 'సరస్వతి అంత్య పుష్కరాలు' కావడం గమనార్హం. అదే సమయంలో, ఈ కేబినెట్ భేటీని కేవలం వాయిదా వేయడమే కాకుండా, హైదరాబాద్ వెలుపల మరో ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్టలో నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు సమాచారం. 'బాసర సరస్వతి అంత్య పుష్కరాలు' ఈ నెల 21వ తేదీన ప్రారంభం కానున్నాయి. గోదావరి నది తీరాన వెలసిన బాసర క్షేత్రంలో జరిగే ఈ అంత్య పుష్కరాలకు తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లు చేస్తోంది. ఈ చరిత్రాత్మక వేడుకకు రాష్ట్ర మంత్రివర్గంలోని మెజార్టీ మంత్రులు హాజరు కానున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటం, పుష్కరాల పనులను పర్యవేక్షించడం మంత్రులకు విధిగా మారింది. మంత్రులంతా పుష్కరాల పనుల్లో, అధికారిక పర్యటనల్లో నిమగ్నమవ్వడం, బాసరకు వెళ్లనుండటంతో.. అదే రోజు నిర్వహించాలనుకున్న కేబినెట్ సమావేశాన్ని వాయిదా వేయడమే ఉత్తమమని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. దీంతో ఈ నెల 23వ తేదీన ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట లో కేబినెట్ సమావేశాన్ని నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి యోచిస్తున్నారు. రాజధాని హైదరాబాద్‌లోని సచివాలయానికే పరిమితం కాకుండా, ప్రజలకు, పుణ్యక్షేత్రాలకు దగ్గరగా పాలనను తీసుకెళ్లాలనే ఆలోచనలో భాగంగానే ఈ వ్యూహాన్ని రచిస్తున్నారు. యాదగిరి లక్ష్మీనరసింహస్వామి కొలువై ఉన్న ఈ పవిత్ర క్షేత్రంలో కేబినెట్ భేటీ నిర్వహించడం ద్వారా ఆధ్యాత్మిక, రాజకీయ సందేశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లవచ్చని సీఎం భావిస్తున్నారు. గతంలో ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన సమ్మక్క - సారలమ్మ జాతర సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన మంత్రివర్గ సహచరులతో కలిసి మేడారంలో కేబినెట్ సమావేశాన్ని నిర్వహించారు. అక్కడికక్కడే జాతర ఏర్పాట్లు, భక్తుల సౌకర్యాలు, నిధుల విడుదలపై కీలక నిర్ణయాలు తీసుకుని రికార్డు

మిగతా 2వ పేజిలో..



# యుద్ధప్రాతిపదికన పాలమూరు-రంగారెడ్డి భూసేకరణ

- వీలైనంత త్వరగా సేకరణ జరగాలని ఆదేశం
- ప్రజాప్రతినిధులతో ప్రాజెక్టులపై సిఎం రేవంత్ సమీక్ష

హైదరాబాద్,మే19 పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ పక్రియను దగ్గరుండి యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయించాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులు, ప్రజా ప్రతినిధులను ఆదేశించారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి వీలైనంత త్వరగా భూసేకరణ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. భూసేకరణ నిధుల విషయంలో జాప్యం జరగకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చూస్తామని సీఎం చెప్పారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్‌సీఆర్‌హెచ్‌ఆర్డీలో సమావేశమయ్యారు. ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి సీఎం కీలక సూచనలు చేశారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై జిల్లా మంత్రులు సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఎం రేవంత్ రెడ్డి

మిగతా 2వ పేజిలో..

# శాస్త్రీయంగా వ్యర్థాల నిర్వహణ

- సుస్థిర పట్టణాభివృద్ధి, సర్క్యులర్ ఎకానమీ దిశగా చర్యలు
- పక్కాగా ఘన వ్యర్థాల నిర్వహణ కార్యక్రమం
- బయో ఎరువులు, విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యం
- స్వచ్ఛ భారత్ మిషన్ జాతీయ సమీక్ష సమావేశంలో భట్టి

న్యూఢిల్లీ,మే19: తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన తెలంగాణ విజన్-2047 లక్ష్యాలకు అనుగుణంగా భవిష్యత్ అవసరాలకు సరిపోయే విధంగా, సుస్థిరంగా, సమగ్రంగా, పర్యావరణహితంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి దిశగా ప్రభుత్వం క్యూర్, ప్యూర్, రేర్ అభివృద్ధి విధానాన్ని అనుసరిస్తోందని, ఇందులో

మిగతా 2వ పేజిలో..

## యూజిసి నెట్ దరఖాస్తులకు నేడే చివరి రోజు

- దరఖాస్తు చేయని వారు ఆన్‌లైన్‌లో చేసుకునే అవకాశం

న్యూఢిల్లీ,మే19 యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ 2026 పరీక్షలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కీలక హెచ్చరిక జారీ చేసింది. జూన్ 2026 సెషన్‌కు సంబంధించిన ఆన్‌లైన్ అప్లికేషన్ పక్రియ మే 20తో ముగియనున్నట్లు వెల్లడించింది. ఇంకా దరఖాస్తు చేయని అభ్యర్థులు వెంటనే అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లి అప్లై చేయాలని సూచించింది.యూజీసీ నెట్ 2026 పరీక్షలు జూన్ 22 నుంచి 30 వరకు కంప్యూటర్- బేస్డ్ టెస్ట్ మోడ్‌లో జరగనున్నాయి. మొత్తం 85 సబ్జెక్టులకు ఈ పరీక్ష జరుగుతుంది. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, అసిస్టెంట్ ప్రొఫెసర్ అర్హత, అలాగే పీహెచ్‌డీ అడ్మిషన్లకు ఈ పరీక్ష ద్వారా ఎంపిక జరుగుతుంది. అభ్యర్థులు దరఖాస్తు నింపి, ఫీజు చెల్లించిన తర్వాత తప్పనిసరిగా కన్ఫర్మేషన్ పేజ్‌ను డౌన్‌లోడ్ చేసుకుని భద్రపరచుకోవాలని ఎన్‌టీఏ సూచించింది. ఫీజు చెల్లింపు తర్వాత మాత్రమే దరఖాస్తు పూర్తి అయినట్లుగా పరిగణిస్తామని స్పష్టం చేసింది.

మిగతా 2వ పేజిలో..




## పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయడమే లక్ష్యం

- కెసిఆర్ హయాంలో జరిగిన తప్పలను సరిదిద్దుతాం
- అధికారులతో సమీక్షించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్,మే19 పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. దేవాదుల, ఎస్‌ఎల్‌బీసీ, సీతారామ ప్రాజెక్టులతో సమాన ప్రాధాన్యం ఇస్తామని వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో పాలమూరు - రంగారెడ్డి పనులు 90శాతం పూర్తి అయ్యాయన్నది అసత్యమని అన్నారు. బీఆర్‌ఎస్ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. భూసేకరణ లేకుండానే టెండర్లు పిలిచారని విమర్శించారు. మంగళవారం సచివాలయంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా

మిగతా 2వ పేజిలో..



# జలమండలిలో భారీ తిమింగలం

- జనరల్ మేనేజర్ కుమార్ ఇళ్లపై ఎసిబి దాడులు
- సోదాల్లో కుప్పలు తెప్పలుగా నగదు, నగలు స్వాధీనం

హైదరాబాద్,మే19 హైదరాబాద్ జలమండలిలో భారీ తిమింగలం పట్టుబడింది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన జనరల్ మేనేజర్ కుమార్ నివాసంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించగా భారీ ఎత్తున నగదు,

మిగతా 2వ పేజిలో..

# పాలమూరు ప్రాజెక్టులపై బిఆర్ఎస్ మోసం

- 90శాతం పూర్తి చేశామని అబద్దాల ప్రచారం
- గత ప్రభుత్వ నిర్లక్ష్యం అంతాఇంతా కాదు
- మండిపడ్డ మంత్రి జూపల్లి కృష్ణారావు

2

# భూసార ఆరోగ్య పరిరక్షణలో శ్రద్ధ అవసరం

2వ పేజిలో..

## ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాట్లు
- అధికారులతో సమీక్షించిన ప్రత్యేక ప్రధానకార్యదర్శి

హైదరాబాద్,మే19 జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు తగు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ ఉన్నతాధికారులను ఆదేశించారు. మంగళవారం డా.బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సంబంధిత అధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి ముందుగా గన్ పార్క్ ను సందర్శించి తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు నివాళులర్పించిన అనంతరం పరేడ్ గ్రౌండ్ వేడుకల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా పరేడ్ గ్రౌండ్,

మిగతా 2వ పేజిలో..

## శాస్త్రీయంగా వ్యర్థాల నిర్వహణ

➢ మొదటి పేజి తరువాయి



కోర్ అర్బన్ రీజియన్, పెరి అర్బన్ రీజియన్, రూరల్ అగ్రికల్చరల్ రీజియన్‌ల సమతుల్య అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. ఘన వ్యర్థాల నిర్వహణ అనేది ఇకపై కేవలం చెత్త సేకరణకు పరిమితం కాదని, అది వాతావరణ మార్పులకు ప్రతిస్పందన, పర్యావరణ సుస్థిరత, సర్క్యులర్ ఎకానమీ, ఉపాధి కల్పన, ఆర్థిక ఉత్పాదకతలతో నేరుగా అనుసంధానమై ఉందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా పట్టణ పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో మంగళవారం కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అధ్యక్షతన ప్రారంభమైన రెండు రోజుల 'స్వచ్ఛ భారత్ మిషన్–అర్బన్ 2.0' జాతీయ సమీక్ష సమావేశానికి తెలంగాణ రాష్ట్రం తరఫున ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు హాజరయ్యారు. మొదటి రోజు సమావేశంలో దేశంలోని పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, ఇంటింటి చెత్త సేకరణ, వ్యర్థాల శాస్త్రీయ ప్రాసెసింగ్, పాత చెత్త కుప్పల తొలగింపు, వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి, పీపీపీ విధానాలు, కొత్త ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనల అమలు వంటి అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. రాష్ట్రాలు, నగరాలు అమలు చేస్తున్న అనుభవాలు, ఉత్తమ విధానాలను పరస్పరం పంచుకోవడంపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ విధానాలు, సుస్థిర పట్టణాభివృద్ధి చర్యలు, స్వచ్ఛత కార్యక్రమాలు, సర్క్యులర్ ఎకానమీ దిశగా చేపడుతున్న కార్యక్రమాలను ఉప ముఖ్యమంత్రి సమావేశంలో వివరించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకు వచ్చిన ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు–2026 దేశంలో వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలో కీలక మార్పుకు దారితీస్తున్నాయని తెలిపారు. కొత్త నిబంధనలు సంప్రదాయ చెత్త సేకరణ, డంపింగ్ విధానాలకే పరిమితం కాకుండా, 4–వే సోర్స్ సెగ్రిగేషన్, వికేంద్రీకృత వ్యర్థాల ప్రాసెసింగ్, పాత డంప్‌యార్డుల శాస్త్రీయ శుద్ధి, వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి, సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ, సర్క్యులర్ ఎకానమీ, వార్డు స్థాయి బాధ్యత, ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఈ దిశగా నిబంధనలు అమలులోకి రాకముందే పలు చర్యలు ప్రారంభించిందని వివరించారు. రాష్ట్రంలోని కోర్ అర్బన్ ప్రాంతాల్లో దాదాపు 9,596 ఎలక్ట్రిక్ స్వచ్ఛ ఆటో టిప్పర్లను ప్రవేశపెట్టే ప్రక్రియను తెలంగాణ ప్రభుత్వం చేపడుతోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఈ వాహనాల ద్వారా మున్సిపల్ కార్యకలాపాల్లో కార్బన్ ఉద్గారాలు తగ్గడంతో పాటు, శుభ్రమైన రవాణా విధానానికి మార్గం సుగమం అవుతుందని అన్నారు. వీటిని 4–వే సోర్స్ సెగ్రిగేషన్‌కు అనుగుణంగా విభజిత చెత్త నిల్వ స్థలాలతో రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఖీఖీ కోడ్ ఆధారిత పర్యవేక్షణ ద్వారా ఇంటింటి చెత్త సేకరణను మరింత సమర్థవంతంగా అమలు చేయనున్నట్లు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం వికేంద్రీకృత, పంపిణీ ఆధారిత వ్యర్థాల ప్రాసెసింగ్ వ్యవస్థలకు ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తడి చెత్తను ఉత్పత్తి అయిన ప్రాంతాల సమీపంలోనే ప్రాసెస్ చేయడం, పొడి చెత్తను శాస్త్రీయంగా వేరు చేసి రీసైక్లింగ్ మరియు సర్క్యులర్ ఎకానమీ వ్యవస్థల్లోకి తీసుకురావడం, ల్యాండ్‌ఫిల్ ప్రాంతాలకు కనిష్ట వ్యర్థాలు మాత్రమే చేరేలా చేయడం ప్రభుత్వ విధానమని వివరించారు. తడి చెత్తను నగరాల్లో దూర ప్రాంతాలకు తరలించడం వ్యయభారంతో కూడుకున్నదిగా ఉండటమే కాకుండా, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా కూడా సుస్థిర విధానం కాదని ఉప ముఖ్యమంత్రి తెలిపారు.అందుకే వికేంద్రీకృత తడి చెత్త ప్రాసెసింగ్ కేంద్రాల ద్వారా స్థానిక స్థాయిలోనే వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. డంప్‌యార్డుల శాస్త్రీయ శుద్ధి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిన అంశమని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. హైదరాబాద్‌లోని జవహర్‌నగర్ డంప్ యార్డ్ విషయంలో ఐఐటీ బాంబే సాంకేతిక సహకారం, సలహా సేవలను పొందుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. దీని లక్ష్యం మొక్కుబడి చర్యలకే పరిమితం కాకుండా, దీర్ఘకాలిక పర్యావరణ నిర్వహణ వ్యూహాన్ని రూపొందించడం, నిరంతర పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయడమని పేర్కొన్నారు. అలాగే ఆటోనగర్ డంప్ సైట్‌లో సుమారు 40 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 22 లక్షల మెట్రిక్ టన్నుల వ్యర్థాలను బయోమైనింగ్ ద్వారా ప్రాసెస్ చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు దాదాపు 30 శాతం వ్యర్థాలు ప్రాసెస్ అయ్యాయని వివరించారు. స్వాధీనం చేసుకున్న భూమిని మళ్లీ డంపింగ్ కోసం కాకుండా, భవిష్యత్తులో పార్కులు, క్రీడా సదుపాయాలు, ప్రజా వినియోగ మౌలిక సదుపాయాలుగా అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోందని తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన?ప్రగతి ప్రణాళిక కింద పట్టణ స్థానిక సంస్థలు, జిల్లా యంత్రాంగాలు రాష్ట్రవ్యాప్తంగా విస్తృత స్థాయిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాయని ఉప ముఖ్యమంత్రి తెలిపారు.

కార్యక్రమాలు విడివిడిగా చేపట్టిన పారిశుద్ధ్య చర్యలు కాదని, తెలంగాణ విజన్?2047కు అనుగుణంగా పట్టణాల సమ్మిళిత అభివృద్ధికి దోహదపడే సమగ్ర కార్యాచరణలో భాగమని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. జపాన్ దేశంలో ని కిటాక్యుషు నగర అభివృద్ధి మోడల్ ఆధారంగా బండరావిర్యాల, సిద్దాపూర్ ప్రాంతాల్లో ప్రతిపాదించిన ఎకో టౌన్ తెలంగాణ సర్క్యులర్ ఎకానమీ ప్రయాణంలో ముఖ్యమైన ముందడుగని ఆయన పేర్కొన్నారు. 2047 నాటికి భారత్‌ను 30?35 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్య సాధనలో, తెలంగాణ రాష్ట్రం తన 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంతో కీలక పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ సహా జాతీయ పరిశుభ్రత, పట్టణ పారిశుద్ధ్య ర్యాంకింగ్స్‌లో తెలంగాణ రాష్ట్రం నిరంతరం మెరుగైన ప్రదర్శన కనబరుస్తోందని, ఇది పౌరులు, పారిశుద్ధ్య కార్మికులు, స్థానిక సంస్థలు, ప్రభుత్వం కలిసి చేస్తున్న కృషికి నిదర్శనమని తెలిపారు. పరిశుభ్రత అనేది కేవలం నగరాల రూపురేఖలకు సంబంధించిన విషయం మాత్రమే కాదని, అది ప్రజారోగ్యం, మానవ గౌరవం, జీవన ప్రమాణాలతో ముడిపడి ఉందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. వ్యర్థాల నిర్వహణను పారిశుద్ధ్య కార్యక్రమంగా మాత్రమే కాకుండా, ఆర్థిక విలువ సృష్టించే ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. పరిశుభ్రత ప్రజల జీవనశైలిలో భాగం కావాలంటే చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జపాన్ తరహాలో మొదటి తరగతి నుంచే పాఠశాలల్లో పరిశుభ్రత, వ్యర్థాల వేర్పాటు,

పర్యావరణ బాధ్యత వంటి అంశాలను ఆచరణాత్మకంగా బోధించే అంశాన్ని అన్ని రాష్ట్రాలు పరిశీలించాలని ఆయన సూచించారు. ప్రజలు, స్థానిక సంస్థలు, పారిశుద్ధ్య కార్మికులు, పరిశ్రమ భాగస్వాములు, వివిధ సంస్థల సహకారంతో తెలంగాణ సుస్థిర పట్టణ నిర్వహణ, శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ, సర్క్యులర్ ఎకానమీ అభివృద్ధిలో దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విశ్వాసం వ్యక్తం చేశారు. సమావేశంలో పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి తోఖన్ సాహు, కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శి శ్రీనివాస్ కటికితల,స్వచ్ఛ భారత్ మిషన్ డైరెక్టర్ రూపా మిశ్రా లతో సహా సంబంధిత కేంద్ర ప్రభుత్వ అధికారులు, తెలంగాణ రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ముఖ్యమంత్రి కార్యదర్శి మానిక్ రాజ్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌తో పాటు వివిధ రాష్ట్రాల పట్టణాభివృద్ధి శాఖ మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# జలమండలిలో భారీ తిమింగలం

➢ మొదటి పేజి తరువాయి

నగలు, ఆస్తుల చిట్టాలు బయటపడ్డాయి. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఈ తనిఖీలు చేపట్టారు. మంగళవారం తెల్లవారుజాము నుంచే ఏసీబీ అధికారులు బృందాలుగా ఏర్పడి.. హైదరాబాద్‌తో పాటు మొత్తం 8 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. మల్లాపూర్‌లోని కుమార్ ఇంట్లో ఏసీబీ డీఎస్పీ మజీద్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో తనిఖీలు ప్రారంభించారు. జీఎం కుమార్ బంధువుల ఇళ్లలోనూ సోదాలు కొనసాగాయి. ఈ తనిఖీల్లో భారీగా నగదును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కుప్పలుగా ఉన్న నోట్ల కట్టలు చూసి అధికారులు ఆశ్చర్యానికి గురయ్యారు. ఇంట్లో ఎక్కడ చూసినా నోట్ల కట్టలే దర్శనమివ్వడంతో.. ఆ నగదు లెక్కింపునకు కౌంటింగ్ మెషీన్లను అధికారులు వినియోగించారు. దాదాపు రూ.1.20 కోట్ల నగదు,1.5 కిలోల బంగారు ఆభరణాలు, 2.5 కిలోల వెండిని స్వాధీనం చేసుకున్నారు. నిజామాబాద్‌లో 3 ఎకరాల వ్యవసాయ భూమి, హైదరాబాద్‌లోని ఓ గేటెడ్ కమ్యూనిటీలో మూడు ప్లాట్‌లు, 6 ఓపెన్ ప్లాట్‌లను అధికారులు గుర్తించారు. బ్యాంకు లాకర్లను ఓపెన్ చేసి మరిన్ని ఆస్తులను గుర్తించేందుకు ఏసీబీ అధికారులు సిద్ధమయ్యారు. మల్లాపూర్‌లోని కుమార్ నివాసంలో 2 కార్లను సీజ్ చేశారు. మార్కెట్ విలువ ప్రకారం ప్రాథమికంగా 100 కోట్ల రూపాయల ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. గత నెలలో తన కుమార్తె వివాహాన్ని కుమార్ అంగరంగ వైభవంగా ఎంతో డబ్బులు వెచ్చించి మరీ జరిపించాడు. వివాహం కోసం కొన్ని కోట్లు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. ఆ డబ్బులు ఎలా సంపాదించారనే దానిపై కుమార్ వద్ద నుంచి ఏసీబీ అధికారులు వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం.

## పాలమూరు ప్రాజెక్టులపై బిఆర్ఎస్ మోసం



హైదరాబాద్,మే19 బీఆర్ఎస్ నేతలకు పాలమూరు ప్రాజెక్టుల గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. 2015లో అప్పటి సీఎం కేసీఆర్ పాలమూరు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని... రెండేళ్లలో పూర్తి చేస్తామన్నారని గుర్తు చేశారు. లక్ష కోట్ల ప్రాజెక్టును పదేళ్లలో రూ.25 వేల కోట్లు మాత్రమే ఖర్చు పెడితే 90 శాతం ఎలా పూర్తి అయినట్లు అని ప్రశ్నించారు. పాలమూరు ప్రాజెక్టు తర్వాత మొదలుపెట్టిన కాళేశ్వరం ప్రాజెక్టును లక్ష కోట్లు ఖర్చు చేసి ఎలా పూర్తి చేశారని నిలదీశారు. పాలమూరు ప్రాజెక్టులపై గత ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం వహించిందని విమర్శించారు. గట్టు, కల్వకుర్తి, జూరాల, కోయిల్ సాగర్, భీమా అన్ని ప్రాజెక్టుల విషయంలో పక్షపాతం చూపారని మంత్రి మండిపడ్డారు. కల్వకుర్తి పంపులు బాగు చేయలేకపోయారన్నారు. పాలమూరు ప్రాజెక్టు నీటి కేటాయింపులు సాధించలేకపోయారని తెలిపారు. కృష్ణా నీటిని పదేళ్లు ఏపీకి తాకట్టు పెట్టారని ఆరోపించారు. రాయలసీమను రతనాల సీమ చేస్తామని చెప్పింది బీఆర్ఎస్ కాదా అని ప్రశ్నించారు. గద్వాల్‌లోని ర్యాలంపాడు రిజర్వాయర్‌ను పదేళ్లలో రిస్టోర్ చేయలేదన్నారు. పాలమూరు ప్రాజెక్టుల విషయంలో సీఎం రేవంత్ రెడ్డితో స్వయంగా ఎమ్మెల్యేలు, మంత్రులు కలిసి చర్చించామని చెప్పారు. సీఎం కూడా పాలమూరు వాసి కాబట్టి.. ప్రాజెక్టుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టామని, పనులను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. కల్వకుర్తి కింద చేపట్టనున్న గొల్లపల్లి రిజర్వాయర్‌ను చేపట్టవద్దని బీఆర్ఎస్ నేతలు ఆందోళనలు చేస్తున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు.

## యుద్ధప్రాతిపదికన పాలమూరు-రంగారెడ్డి భూసేకరణ

➢ మొదటి పేజి తరువాయి

ఆదేశించారు. ఈ భేటీలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, మేఘా రెడ్డి, రాకేశ్ రెడ్డి, వంశీకృష్ణ, వీర్లపల్లి శంకరయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పాల్గొన్నారు.

## తెలంగాణ కేబినేట్ భేటీ 23కు వాయిదా ?

➢ మొదటి పేజి తరువాయి

సృష్టించారు. ఇప్పుడు అదే తరహా వ్యూహాన్ని యాదగిరిగుట్ట లోనూ అమలు చేయాలని చూస్తున్నారు. దీనివల్ల స్థానిక సమస్యలపై తక్షణమే స్పందించే అవకాశం లభిస్తుందని నమ్ముతున్నారు. బాసర అంత్య పుష్కరాల కారణంగా ఈ నెల 21న జరగాల్సిన కేబినెట్ వాయిదా పడటం, దానిని ఈ నెల 23న యాదగిరిగుట్టకు మార్చాలని యోచించడం అందులో భాగమే. అయితే ఈ మార్పుపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయడమే లక్ష్యం

➢ మొదటి పేజి తరువాయి

అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. పాలమూరుకు కేసీఆర్ హయాంలో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుతామని చెప్పుకొచ్చారు. జూరాల ప్రాజెక్టులో పూడిక తొలగించి నిల్వ సామర్థ్యం పెంచుతున్నట్లు తెలిపారు. జూరాల అభివృద్ధికి ప్రతిపాదనలు చేశామని వివరించారు. వర్షాకాలానికి ముందే చెరువుల్లో పూడికతీత పనులు చేపడతామని స్పష్టం చేశారు. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేస్తామని తెలిపారు. 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. 1226 గ్రామాలకు తాగునీరు అందిస్తామని తెలిపారు. 15 రోజుల్లో మరోసారి ప్రగతి సమీక్ష నిర్వహిస్తామని చెప్పుకొచ్చారు. ఆయా ప్రాజెక్టుల పురోగతిపై సమగ్ర నివేదికలు ఇవ్వాలని అధికారులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు.

## ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

గన్ పార్కు వద్ద చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ వేడుకల ఏర్పాట్లపై ప్రతి శాఖ నుంచి ఒక నోడల్ అధికారి నియమించి సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రముఖులు ప్రయాణించే మార్గాలలో అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా పరేడ్ గ్రౌండ్ కు వచ్చే వాహనాలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేసి ట్రాఫిక్ రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసి ట్రాఫిక్ కు అంతరాయం కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు శాఖను ఆదేశించారు.వాటర్ ప్రూఫ్ షామియానాలు, బారికేడింగ్ ఏర్పాటు చేయాలని ఆర్‌అండ్‌బీ శాఖను ఆదేశించారు. సభా ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణ తోపాటు తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పండుగ వాతావరణాన్ని తలపించేలా కళాకారులతో ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సాంస్కృతిక శాఖను ఆయన ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరా, జనరేటర్ , నగరంలోని ప్రముఖ ప్రదేశాలైన అసెంబ్లీ, రాష్ట్ర సచివాలయం, చార్మినార్, ప్రజాభవన్, ఇతర ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విస్తృతంగా ప్రచారం చేసేందుకు లైవ్ టెలికాస్ట్ ఏర్పాట్లు చేయాలని సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఈ నెల 25వ తేదీ నుంచి పరేడ్ గ్రౌండ్ వద్ద అన్ని విభాగాలు సంయుక్తంగా రిహార్సల్స్ చేపట్టాలని ఆదేశించారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు నవీన్ మిట్టల్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్, కార్యదర్శి రఘునందన్ రావు, డిజిపి మహేశ్ భగవత్, ఎడిజి(ఇంటలిజెన్స్) విజయ్ కుమార్, టిజి జెన్కో సిఎండి హరీష్, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి, జలమండలి ఎండి అశోక్ రెడ్డి, ఇతర పోలీసు ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# డిజిటలైజేషన్‌తో మారుతున్న జర్నలిజం

- ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి
- ఆధునికి సాంకేతికతపై జర్నలిస్టులకు శిక్షణ
- మీడియా అకాడమీ చర్చలో సీనియర్ జర్నలిస్టుల వెల్లడి

హైదరాబాద్,మే19 నేటి డిజిటల్ యుగంలో జర్నలిజం రంగం వేగంగా మారుతున్న నేపథ్యంలో మీడియా వృత్తిదారులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ముందుకు సాగాలని పలువురు సీనియర్ జర్నలిస్టులు అభిప్రాయపడ్డారు. తెలంగాణ, మీడియా అకాడమీ, చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన నాంపల్లిలోని మీడియా అకాడమీ భవనంలో మంగళవారం నిర్వహించిన జర్నలిస్టుల చర్చా కార్యక్రమంలో పలువురు సీనియర్ జర్నలిస్టులు, అకాడమీకి అనుబంధ సభ్యులు పాల్గొని మీడియా రంగ భవిష్యత్ దిశ, డిజిటలైజేషన్, మీడియా చట్టాలు, శిక్షణ కార్యక్రమాలు, జర్నలిస్టుల సంక్షేమ అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సమాచార,పౌర సంబంధాల శాఖ ప్రత్యేక ప్రధాన కమిషనర్ జి. ముకుంద్ రెడ్డి, కార్యక్రమంలో పాల్గొని జర్నలిస్టులను అభినందించారు. జర్నలిజం డిగ్రీ చదివే రోజుల్లో పత్రికల ఎడిటోరియల్స్ చదవడం ద్వారా సివిల్ సర్వీసులపై ఆసక్తి పెరిగిందని, అదే తన విజయానికి పునాది అయిందని తెలిపారు. నేడు మీ అందరి ముందుకు రావడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. సమావేశంలో ఐ. వెంకట్ రావు మాట్లాడుతూ మీడియా అకాడమీ చేపడుతున్న కార్యక్రమాలను అభినందిస్తూ మరిన్ని పుస్తకాలను అకాడమీకి అందజేస్తానని తెలిపారు.మాజీ ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్ మాట్లాడుతూ జర్నలిజం తనకు ధైర్యం, గుర్తింపు ఇచ్చిందని పేర్కొంటూ అకాడమీకి కృతజ్ఞతలు తెలిపారు. ఉడుముల సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఆధునిక జర్నలిజానికి అనుగుణంగా అకాడమీ డిజిటల్ క్లాసులు, ఇంక్యూబేటర్ ఏర్పాటు చేయాలని, గ్యాగ్ ఆర్డర్ వంటి అంశాలపై చర్చలు నిర్వహించాలని సూచించారు. దేవులపల్లి అమర్ మాట్లాడుతూ 16 మంది వెటరన్ జర్నలిస్టుల వీడియోలను పుస్తకాల రూపంలో తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు సభ్యులు మీడియా రంగంలో కృత్రిమ మేధస్సు ప్రభావం పెరుగుతోందని, జర్నలిస్టులు నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మీడియా అకాడమీ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ఆధునిక శిక్షణా కార్యక్రమాలు, ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాములు, డెస్క్ జర్నలిస్టులకు ప్రత్యేక శిక్షణలు నిర్వహించాల్సిన అవసరం ఉందని సూచించారు. అకాడమీ భవనంలోని డిజిటల్ సదుపాయాలు, ఆధునిక ఆడిటోరియం, బోర్డు రూమ్, లైబ్రరీ, కంప్యూటర్ రూమ్ వంటి వసతులను మరింత సమర్థవంతంగా వినియోగించి జర్నలిస్టులకు ప్రయోజనం కలిగించాలని అభిప్రాయపడ్డారు. పాత పత్రికలు, అరుదైన పుస్తకాలు, నిజాం కాలం నాటి ప్రచురణలు, తెలుగు గ్రంథాలు తదితరాలను డిజిటలైజ్ చేసి భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. పలువురు సీనియర్ జర్నలిస్టులు తమ వద్దనున్న విలువైన పుస్తకాలను మీడియా అకాడమీ లైబ్రరీకి విరాళంగా అందిస్తామని తెలిపారు. సీనియర్ జర్నలిస్టులు మాట్లాడుతూ మీడియా చట్టాలలో కాలానుగుణ మార్పులు అవసరమని, సోషల్ మీడియాకు ప్రత్యేక ప్రవర్తనా నియమావళి తీసుకురావాలని పేర్కొన్నారు. మహిళా జర్నలిస్టులు మరియు గ్రామీణ ప్రాంత జర్నలిస్టుల కోసం ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జర్నలిజం అనేది సమాజానికి అద్దం పట్టే వృత్తి అని, భయపడకుండా నిజాయితీతో వార్తలను ప్రజలకు అందించాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. మీడియా అకాడమీ 1996 నుండి జర్నలిస్టుల అభివృద్ధికి విశేష సేవలు అందిస్తోందని, పుస్తక ప్రచురణలు, మోనోగ్రాఫ్‌లు, శిక్షణా కార్యక్రమాలు మీడియా రంగానికి ఎంతో ఉపయోగపడుతున్నాయని అభినందించారు. చర్చా కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు శ్రీ కె. రాంచందర్ మూర్తి, కేశవరావు దాసు, ఎస్. నాగేష్ కుమార్, డి. అమర్, బండారు శ్రీనివాస్ రావు, రవీందర్ ఎం.పీ., దిలీప్ రెడ్డి, మాదభూషి శ్రీధర్, ఎం. సుబ్బారావు, జగన్, ఆర్.వి. రామారావు, ఎస్. వినయ్ కుమార్, వై. నరేందర్ రెడ్డి, విరాహత్ అలీ తదితరులు పాల్గొని మీడియా రంగంలో వస్తున్న మార్పులు, డిజిటలైజేషన్, జర్నలిస్టుల శిక్షణ, మీడియా చట్టాలు, సోషల్ మీడియా ప్రభావం, పుస్తక ప్రచురణలు, అకాడమీ భవిష్యత్ కార్యాచరణపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మీడియా అకాడమీ చేపడుతున్న కార్యక్రమాలను పలువురు ప్రశంసించారు. జర్నలిస్టుల సంక్షేమం, శిక్షణ, డిజిటలైజేషన్, మీడియా ఆధునీకరణ దిశగా అకాడమీ మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన ప్రముఖులందరిని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు శాలువాలతో సీనియర్ జర్నలిస్టులను సత్కరించారు.

# పెన్షన్ పొందేందుకు ఆధార్ నమోదు ప్రక్రియకు సహకరించండి..

- ఎంపీడీవో ఏ శ్రీధర్ రాజు
- ప్రభుత్వం అందిస్తున్న ఆసరా పెన్షన్ పొందాలంటే ఆధార్ నమోదు చేయించుకోవాలి..
- మల్లారం సర్పంచ్ కటిక కిరణ్ కుమార్
- పంచాయతీ కార్యదర్శి ఎస్ కె సిద్ధిక్ మియా





ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 19 (అక్షరం న్యూస్)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆసరా, వికలాంగులు, పెన్షన్ లబ్ధిదారులు , ఆధార్ కార్డు తీసుకుని, తల్లాడ మండల పరిధిలోని మల్లవరం గ్రామపంచాయతీ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని ఎంపీడీవో శ్రీధర్ రాజు, సర్పంచ్ కటిక కిరణ్ కుమార్ , పంచాయతీ కార్యదర్శి ఎస్ కె సిద్ధిక్ మియా సూచించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రభుత్వ పెన్షన్లు పొందేవారు తమ ఆధార్ కార్డు తీసుకుని గ్రామపంచాయతీ కార్యాలయంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని, ఈ ప్రక్రియ ఈ నెల 15 నుండి, జూన్ నెల 5 వరకు నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని స్వదియోగం చేసుకోవాలని, ఎవరైతే గ్రామపంచాయతీ కార్యాలయానికి రాలేని వారు తమకు సమాచారం అందిస్తే ఇంటి వద్దకే వచ్చి నిర్ధారణ చేసుకుంటామన్నారు. ఆధార్ కార్డు వెరిఫికేషన్ చేయించుకుని వారి పెన్షన్లు నిలిపివేయబడతాయి అన్నారు. పెన్షన్ లబ్ధిదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

# రైతులకు 50 శాతం సబ్సిడీపై పవర్ స్ప్రేయర్లు వ్యవసాయ యంత్రాలును పంపిణీ చేసిన వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 19 (అక్షరం న్యూస్)

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులు సంక్షేమ మే ధ్యేయంగా పనిచేస్తున్నారని ఎమ్మెల్యే మాలోత్ రాందాసు నాయక్ అన్నారు.ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు 50 శాతం సబ్సిడీపై పవర్ స్ప్రేయర్లు వ్యవసాయ యంత్రాలును ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల సంక్షేమ మే ధ్యేయంగా పనిచేస్తున్నారని అన్నారు. రైతుల సంక్షేమం కోసం 2 లక్షల రూపాయల రుణమాఫీ రైతుబంధు రైతు బీమా సబ్సిడీపై యంత్ర పరికరాలు ఉచిత విద్యుత్తు అందించారని తెలిపారు గత టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు ఎలాంటి మేలు జరగలేదని అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేసిందని పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని అన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైరా నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ మట్టూరు వెంకటేశ్వరరావు మార్కెట్ చైర్మన్ గంగారావు మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శీలం వెంకట నర్సిరెడ్డి ఏదునూరు సీతారాములు సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి దొడ్డ పుల్లయ్య వ్యవసాయ శాఖ ఏడిఏ కరుణశ్రీ మండల వ్యవసాయ శాఖ అధికారి మయన్ మంజుఖన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులు పాల్గొన్నారు.

# శీలం చిన్నమ్మకు నివాళులర్పించిన సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 19( అక్షరం న్యూస్)

తల్లాడ మండల పరిధిలోని కుర్నవల్లి గ్రామానికి చెందిన సిపిఎం పార్టీ సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి మాతృమూర్తి, సేలం చిన్నమ్మ మంగళవారం ఉదయం వృద్ధాప్యం అనారోగ్య సమస్యలతో మృతి చెందారు, విషయం తెలుసుకున్న సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు మృతదేహాన్ని సందర్శించి పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు, కార్యక్రమంలో మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, నల్లమోతు మోహన్ రావు, కళ్యాణ పు కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

# కాసిపేట - 2 గనిపై మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశం

మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ మే 19/ అక్షరం న్యూస్ -:

సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సిఅండ్ఎండి) డా. బుద్ధ ప్రకాష్ జ్యోతి ఆదేశాల మేరకు, సంస్థ వ్యాప్తంగా అన్ని ఏరియాలలో మల్టీ డిపార్ట్మెంటల్ సమీక్ష సమావేశాలను నిర్వహించారు. మంగళవారం మందమర్రి ఏరియా పరిధిలోని కాసిపేట -2 గని మొదటి, రెండవ, మూడవ షిఫ్ట్ లలో ఉద్యోగులతో ప్రత్యేక మల్టీ డిపార్ట్మెంటల్ సమీక్షా సమావేశాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధకృష్ణ మార్గదర్శకత్వంలో అధికారులు హాజరై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశాలలో కంపెనీ నిర్దేశించుకున్న ఉత్పత్తి మరియు ఉత్పాదకత లక్ష్యాల సాధనపై సుదీర్ఘంగా చర్చించారు. భూగర్భ మరియు ఓపెన్ కాస్ట్ గనులలో అత్యాధునిక యంత్రాల సరైన వినియోగం, ఉత్పాదకత పెంపుదల, సింగరేణి యాజమాన్యం ఉద్యోగుల కొరకు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు మరియు ఆర్థిక (ఫైనాన్స్) సంబంధిత విషయాలను అధికారులు కార్మికులకు విపులంగా వివరించారు. అదేవిధంగా కంపెనీ భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు, రాబోయే రోజుల్లో




ఎదుర్కోబోయే సవాళ్లు మరియు వాటిని అధిగమించి నిర్దేశిత లక్ష్యాలను ఎలా చేరుకోవాలో చర్చించారు. గని ఉద్యోగులు యాజమాన్యం సూచించిన సలహాలు, సూచనలను నిరంతరం పాటించడం ద్వారా ఉత్పత్తి, ఉత్పాదకతను మరింత పెంచవచ్చని అధికారులు పేర్కొన్నారు. ఉద్యోగులందరూ పూర్తి నిబద్ధతతో, క్రమశిక్షణతో తమకు కేటాయించిన విధులను సకాలంలో నిర్వర్తించడం మరియు పనితనాన్ని మెరుగుపరుచుకోవడం ద్వారా అనుకున్న లక్ష్యాలను సులభంగా సాధించగలమని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. సింగరేణి సంస్థ తమ భూగర్భ గనుల నుండి వెలికితీసే బొగ్గు నాణ్యతను మరింత మెరుగుపరచడానికి సమగ్ర నాణ్యతా నియంత్రణ చర్యలను చేపట్టి వినియోగదారులకు అత్యుత్తమ శ్రేణి బొగ్గును అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషిచేయాలని అన్నారు. బొగ్గును వెలికితీసే క్రమంలో దానితో పాటు రాయి, మట్టి కలవకుండా గని లోపలే వద్ద జాగ్రత్త వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఓ టు జీ.ఎం జి.ఎల్. కాసిపేట -- 02 గని ఏ.ఐ.టీ.యూ.సీ పిట్ సెక్రటరీ గొల్ల శ్రీనివాస్, ఏరియా ఇంజనీర్ (ఈ అండ్ ఎం) బాలాజీ భగవతి జ, ఆర్.వి.ఎస్.ఆర్.కే ప్రసాద్ (ఏజీఎం - ఎఫ్అండ్ఎ), సిహెచ్. అశోక్ (డీ.జీ.ఎం పర్సనల్), కె.కిరణ్ కుమార్ (డీ.జీ.ఎం - ఐఈడీ), రవి (ఐ.టీ డిప్యూటీ మేనేజర్), ప్రదీప్ (క్వాలిటీ ఇంచార్జ్), కాసిపేట -02 గని మేనేజర్ లక్ష్మీనారాయణ, సంక్షేమ అధికారి భార్గవ్, ఐ.ఈ.డీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్యామ్, మరియు కాసిపేట -02 గని ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అర్హులైన జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు కేటాయించాలి..

- హౌసింగ్ సొసైటీ కి 23 ఎకరాల స్థలాన్ని అప్పగించాలి..
- జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్న జర్నలిస్టులకు తీరని అన్యాయం..
- రాష్ట్ర క్యాబినెట్ లో ఇళ్లస్థలాలపై వెంటనే ఆమోదం తెలపాలి..
- టి యు డబ్ల్యూ జే టిజేఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ..
- ఖమ్మంలో జర్నలిస్టుల నిరసన ప్రదర్శన..

ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 19 (అక్షరం న్యూస్)

జర్నలిస్టుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న నిర్లక్ష్య ధోరణి జర్నలిస్టు వ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా ఉన్నాయని, గత ప్రభుత్వం క్యాబినెట్ లో 23.2 ఎకరాల భూమిని ఖమ్మం జర్నలిస్టులకు కేటాయిస్తూ జీవో జారీ చేశారని , కానీ వాటిని అమలు చేయడంలో నేటి పాలక పక్షాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ టీజేఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ ఆవేదన వ్యక్తం చేశారు.జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఖమ్మం ప్రెస్ క్లబ్ నుంచి మయూరి సెంటర్ మీదుగా అమరవీరుల స్తూపం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అమరవీరుల స్థూపం వద్ద జర్నలిస్టులు నివాళులు అర్పించిన అనంతరం జరిగిన సభలో టి యు డబ్ల్యూ జె (టి జె ఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి మాట్లాడుతూ... జర్నలిస్టుల సమస్యలు పరిశీలిస్తామని అనేక వాగ్దానాలు చేసిన నేటి పాలకులు అధికారంలోకి వచ్చాక జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో ద్వంద వైఖరి అవలంబించడం బాధాకరం అన్నారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండి కూడా జర్నలిస్టులకు కేటాయించిన 23.2 ఎకరాల భూమిని హౌసింగ్ సొసైటీ ద్వారా






జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించడంలో కాలయాపన చేయడం మంచిది కాదన్నారు. ఈనెల 21న జరిగే క్యాబినెట్ సమావేశంలో సరైన నిర్ణయం తీసుకొని జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు వచ్చే విధంగా ఆమోదం తెలపాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అనేక చీకటి జీవోలు జారీ చేస్తూ కోత విధించే విధంగా వ్యవహరించడం సరైంది కాదు అన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు రామిశెట్టి విజేత, జిల్లా ఉపాధ్యక్షులు మంజుల ఉపేందర్, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, కోశాధికారి బిక్కీ గోపి, నగర ప్రధాన కార్యదర్శి అమరవరపు కోటేశ్వరరావు, ఎలక్ట్రానిక్ మీడియా వీడియో గ్రాఫర్స్ అధ్యక్షులు నాగరాజు,ఎలక్ట్రానిక్ మీడియా నగర కార్యదర్శి కె .అశోక్, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు పానకాలరావు, ముత్యాల కోటేశ్వరరావు, రేపాక యాదగిరి, పులి శ్రీను ,మూల జీవన్ రెడ్డి, నాయకులు మురళి, నరేష్, నల్లమోతు శ్రీను, ఉల్లోజు రమేష్, జక్కుల వెంకటరమణ, హుస్సేన్, ఈసంపల్లి వెంకటేశ్వర్లు, అప్పారావు, శ్రీధర్, ఎన్ రమేష్, సాయి, రామకృష్ణ, తోట గణేష్, పెంటి వెంకటేశ్వర్లు, ఉత్కంఠం శ్రీనివాస్, మహిళ జర్నలిస్ట్ రోజా, రవీందర్ ,నాయుడు, వేణుగోపాల్, శేఖర్, మధు, సుధాకర్, బాబు, లింగయ్య, సతీష్ ,మహేష్, నరసింహారావు, నాగేశ్వరరావు, గుండు శ్రీను, వెంకటేష్ ,తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ బిసి ఎస్సి ఎస్టీ మైనారిటీ కాంట్రాక్టర్స్ జెఎసి ఖమ్మం జిల్లా

# కన్వీనర్ గా వైరా మండలనికి చెందిన నారపోగు ఉదయ్ నీ నియమించిన రాష్ట్ర కమిటీ....

ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 19( అక్షరం న్యూస్)

ప్రభుత్వ గురుకుల, వసతి గృహాల్లో కాంట్రాక్ట్ వ్యవస్థలో జిఓ నెంబర్ 17 రద్దు చేసి బిసి ఎస్సి ఎస్టీ మైనారిటీ కాంట్రాక్టర్స్ హక్కుల పరిరక్షణనే ప్రధాన లక్ష్యాలు... తెలంగాణ బిసి, యస్సి యస్టి మైనారిటీ కాంట్రాక్టర్స్ హక్కుల పరిరక్షణ కొరకై రాష్ట్ర స్థాయిలో ఈ సంఘం ఏర్పాటు చేయ్యడం జరిగినది....

రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు తెలంగాణ బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ కాంట్రాక్టర్లు జేఏసీ చైర్మన్ మంద శ్యామ్ సుందర్ అ సంఘుం ఖమ్మం జిల్లా కన్వినర్ గా వైరా మండాలనికి చెందిన యన్.ఉదయ్ ని నియామించడం జరిగింది....ఉదయ్ మాట్లాడుతూ ప్రభుత్వ గురుకుల వసతి గృహాల్లో కాంట్రాక్ట్ వ్యవస్థలో జరుగుతున్న అన్యాయాలపై మరి ముఖ్యంగా జీవో నెంబర్ 17 ద్వారా ఈ వర్గాలకు చెందిన ఔత్సాహిక కాంట్రాక్టర్లను అవకాశాలు తగ్గుతున్నా నేపద్యంలో వారి పక్షాన సంఘటితం చేసేందుకు ప్రభుత్వం పరిష్కరించే విధంగా ఈ సంఘం అన్ని జిల్లాలలో పనిచేయడం జరుగుతున్నది ఈ జిల్లాలో ఉన్నటువంటి అన్ని శాఖల యొక్క గురుకులాలు, వసతి గృహాలను కాంట్రాక్టు వ్యవస్థను ఈ వర్గాలకు అన్యాయం జరగకుండా



చూడడమే లక్ష్యంగా ఈ సంఘం పనిచేస్తుందని తెలియజేశారు..అదేవిధంగా గతంలో తెలంగాణ బిసి ఎస్సి, ఎస్టీ మైనార్టీ కాంటాక్ట్ లో దాదాపు 20 వేల కుటుంబాలకు పైచిలుకు చిన్న చిన్న కాంట్రాక్టులు చేస్తూ ఆధారపడే ఉన్నారు కానీ జీవో నెంబర్ 17 ను తీసుకు రావడం వలన ఈ కుటుంబాలన్నీ రోడ్డున పడాల్సిన పరిస్థితి అవుతుంది. కావున జీవో నెంబర్ 17 రద్దుచేసి ఈ 1. జీవో నెంబర్ 17 వెంటనే రద్దు చేయాలి ,2. ప్రభుత్వ కాంట్రాక్టర్లు బిసి ఎస్సి ఎస్టి మైనార్టీ వర్కర్లకు న్యాయమైన వాటా కల్పించాలి ,3. చేవెళ్ల మరియు కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలి ,4. జనాభా ప్రాతిపదికన కాంట్రాక్టర్లు రిజర్వేషన్లు అమలు చేయాలి,5. తెలంగాణ రాష్ట్ర కాంట్రాక్టర్లను తెలంగాణ చెందిన కాంట్రాక్టర్లకే ఇవ్వాలి,6. సూక్ష్మ చిన్న మధ్య తరహా (మీావీజు) మరియు కుటీర పరిశ్రమలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలి,7. బిసి, ఎస్సీ ఎస్టీ మైనారిటీ కాంట్రాక్టర్లకు జువీణ మరియు సెక్యూరిటీ డిపాజిట్ (ఎస్ డి) నుండి మినహాయింపు ఇవ్వాలి ,8. టెండర్ నిబంధనలు సులభతరం చేసి చిన్న కాంట్రాక్టర్లు కూడా పాల్గొనేలా చేయాలి, 9. ప్రి-బిడ్డింగ్ మీటింగ్ ఎంట్రీ ఫీజులను రద్దు చేయాలి,10. స్థానిక కాంట్రాక్టర్లకు ప్రాధాన్యం ఇచ్చే నిబంధనలు రూపొందించాలి.11. ప్రభుత్వ కాంట్రాక్టుల్లో పారదర్శకత మరియు సమాన అవకాశాలు కల్పించాలి ,12. బిసి ఎస్సీ ఎస్టీ మైనారిటీ కొఆపరేటివ్ సంస్థల ద్వారా కాంట్రాక్టులు ఇవ్వాలి అనే ప్రధాన లక్ష్యాలు స్థానికంగా ఈ వర్గాల కాంట్రాక్టర్లు హక్కులకై ఈ సంఘం పనిచేస్తుందని మీడియా ద్వారా తెలియజేశారు.....


## బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో ప్రవేశం కొరకు దరఖాస్తుల ఆహ్వానం...

- జ్యోతి, డిడి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ
- దరఖాస్తుల సమర్పణకు జూన్ 6 చివరి తేదీ..
- 1వ, 5వ తరగతుల్లో ప్రవేశం కొరకు ఖమ్మం జిల్లాలోని ఎస్సీ విద్యార్థినీ, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి..

ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 19 (అక్షరం న్యూస్)

2026-27 విద్యా సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ (రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్) పాఠశాలల్లో 1వ తరగతి, 5వ తరగతుల్లో ప్రవేశం కొరకు జిల్లాకు చెందిన అర్హులైన షెడ్యూల్డ్ కులాల విద్యార్థినీ, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు జి.జ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.బెస్ట్ అవైలబుల్ స్కూల్ నందు 1వ తరగతి (నాన్ రెసిడెన్షియల్ / డే స్కాలర్స్) లో 128 సీట్లు, 5వ తరగతి (రెసిడెన్షియల్) లో 131 సీట్లు కేటాయించడం జరిగిందని తెలిపారు.కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి లక్షా 50 వేలు లోపు, పట్టణ ప్రాంతాల వారికి 2 లక్షల లోపు ఉండాలని, తల్లిదండ్రులు డిగ్రీ లేదా అంత కంటే ఎక్కువ చదువుకుని ఉంటే అనర్హులని స్పష్టం చేశారు. 1వ తరగతి ప్రవేశం కోరే విద్యార్థులు 2020 జూన్ 1 నుండి 2021 మే 31 మధ్య జన్మించి ఉండాలని (5 నుండి 6 సంవత్సరాల లోపు), ఒక కుటుంబం నుండి ఒకరికి మాత్రమే ప్రవేశానికి అర్హత ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ నూతన మార్గదర్శకాల ప్రకారం ఎస్సీ ఉపకులాల వారీగా (కేటగిరి-1 కు 1 శాతం, కేటగిరి-2 కు 9శాతం, కేటగిరి-3 కు 5 శాతం) సీట్లు కేటాయించబడతాయని వివరించారు.ఆసక్తి గల వారు దరఖాస్తు ఫారాలను మే 20 నుండి జూన్ 06 వరకు ఖమ్మం కలెక్టరేట్ (వెంకటాయపాలెం) లోని రూమ్ నెంబర్ ఎస్-34 లో గల షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకుల వారి కార్యాలయం నుండి పొంది, పూర్తి చేసిన దరఖాస్తులను తగిన ధృవీకరణ పత్రాలతో (మీ-సేవ ద్వారా పొందిన లేటెస్ట్ కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాలు, ఆధార్/రేషన్ కార్డు, మార్కుల మెమో లేదా బర్త్ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలు) జతపరిచి జూన్ 6వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు తిరిగి అదే కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.ఇతర వివరాల కొరకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకుల (డిడి-ఎస్సీడిడి) కార్యాలయంలో సంప్రదించాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## యువత కోసం ప్రత్యేక ఆన్‌లైన్ అవగాహన కార్యక్రమం విజయవంతంగా నిర్వహణ...




ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 19 (అక్షరం న్యూస్)

ఖమ్మం: "ప్రజా పాలన - 99 రోజుల ప్రగతి ప్రణాళిక" మరియు యువజన క్రీడా వారోత్సవాలలో భాగంగా యువత కోసం నిర్వహించిన ప్రత్యేక ఆన్‌లైన్ అవగాహన కార్యక్రమం విజయవంతంగా పూర్తైనట్లు జిల్లా యువజన మరియు క్రీడల అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో యువత పెద్ద సంఖ్యలో పాల్గొని వివిధ ఉపాధి, నైపుణ్యాభివృద్ధి అవకాశాలపై అవగాహన పొందారు. కార్యక్రమంలో 1) వివిధ రకాల నైపుణ్య శిక్షణ కోర్సులు:- 2)క్రీడా విశ్వవిద్యాలయం (రాజూశీతీం ఖఅఱఙవతీంఱఎ), 3)నైపుణ్య విశ్వవిద్యాలయం (రాఎఱశ్రీశ్రీ ఖఅఱఙవతీంఱఎ) మరియు 4)భారత ఆర్మీ అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియపై నిపుణులు సమగ్రంగా వివరించారు.యువత తమ భవిష్యత్తు లక్ష్యాలను సాధించేందుకు నైపుణ్యాభివృద్ధి ఎంతో అవసరమని, ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని వక్తలు సూచించారు.కార్యక్రమాన్ని యూట్యూబ్ లైవ్ ద్వారా జిల్లా యువత ఆసక్తిగా వీక్షించారు.

## సిపిఎం ఆధ్వర్యంలో ఘనంగా పుచ్చలపల్లి సుందరయ్య 41 వర్ధంతి వేడుకలు



జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 19 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత , తెలంగాణ రైతాంగ, సాయుధ పోరాట రథసారథి కమ్యూనిస్ట్ యోధుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య గారి 41వర్ధంతి వేడుకలను మంగళవారం సిపిఎం పార్టీ ఎన్టిపిసి రామగుండం ఏరియా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సీపీఎం పార్టీ ఎన్టీపీసీ పరిధిలోని 1వ డివిజన్ ఇందిరమ్మ కాలనీలో టీ రవీందర్,,3వ డివిజన్ మల్కాపూర్‌లో శాఖ కార్యదర్శి దండ రాఘవరెడ్డి మరియుఅన్నపూర్ణ కాలనీలో రామగుండం ఇండస్ట్రియల్ వర్కర్స్‌యూనియన్ శాఖ కార్యదర్శి కాదాసీ మల్లేష్ పార్టీ జెండాలను ఆవిష్కరించారు.అనంతరం సిపిఎం పార్టీ ఎన్టిపిసి రామగుండం ఏరియా కార్యదర్శి ఎం రామాచారి, గీట్ల లక్ష్మారెడ్డి, దండ రాఘవరెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ సాయుధ పోరాటంలో సుందరయ్య పోషించిన పాత్ర అద్వితీయమైనదన్నారు. పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుడిగా ఉండి కూడా ఎంతో సామాన్యమైన జీవితాన్ని గడిపి, 'ఆదర్శ రాజకీయాలకు' ఆయన మారుపేరుగా నిలిచారని కొనియాడారు. కార్మిక, విద్యార్థి, సంఘాల నిర్మాణశీలో కీలక పాత్ర పోషించారు. నిరింతరం పెదప్రజల పక్షాన పోరాడిన మహోన్నత వ్యక్తి, ఈదేశం లో దోపిడీ రహిత సమాజం నిర్మించాలనే లక్షంగా పనుచేశారు నేటి సమాజంలో పాలకుల ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడతూ, వారి ఆశయాలను ముందుకు తీసుకు పోవడమే సుందరయ్యకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు ఎం రామాచారి, గీట్ల లక్ష్మారెడ్డి, దండ రాఘవ రెడ్డి,కాదసి మల్లేష్ టీ. రవీందర్,కే రాజ్ కుమార్, ఎండి షమీం, టి నారాయణ రెడ్డి, ఏ చంద్రమౌళి, ఏ రమేష్, నాగరాజు,మహిపాల్ రెడ్డి, భాస్కర్, ఏం. కనకయ్య,దర్ని రాజయ్య, రాజమల్లుకార్యకర్తలు, ప్రజాసంఘాల ప్రతినిధులు మరియు కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నకిలీ వరి విత్తనాల అంతరాష్ట్ర ముఠా పట్టివేత

- మహారాష్ట్ర నుంచి తెలంగాణకు అక్రమ రవాణా.
- నలుగురిపై కేసు నమోదు.
- లారీ, 30.7 టన్నుల విత్తనాలు స్వాధీనం.
- వివరాలు వెల్లడించిన జైపూర్ ఏసీపీ ఏ. వెంకటేశ్వర్లు

మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ మే 19/ అక్షరం న్యూస్ -:

రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించి నిలువునా ముంచేందుకు యత్నిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టును కోటపల్లి పోలీసులు రట్టు చేశారు. సరైన అనుమతులు, బిల్లులు లేకుండా మహారాష్ట్ర నుంచి లారీలో అక్రమంగా తరలిస్తున్న సుమారు 30,700 కిలోల (30.7 టన్నులు) వరి విత్తనాలను రాపన్‌పల్లి అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద పట్టుకున్నారు. వీటి విలువ సుమారు రూ.21,49,000 ఉంటుందని జైపూర్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ) ఏ. వెంకటేశ్వర్లు వెల్లడించారు. మంగళవారం ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఆయన ఈ కేసుకు సంబంధించిన వివరాలను మీడియాకు వివరించారు.కోటపల్లి మండల వ్యవసాయ అధికారి (ఏఓ) సాయి కృష్ణ రెడ్డి ఇచ్చిన ముందస్తు సమాచారం, ఫిర్యాదు మేరకు కోటపల్లి ఎస్సై ఆధ్వర్యంలో రాపన్‌పల్లి చెక్‌పోస్ట్ వద్ద విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో మహారాష్ట్రలోని సిరోంచ ప్రాంతం నుండి తెలంగాణలోని మానకొండూర్ వైపు వెళ్తున్న టి.ఎస్-29 టి.బి -6555 నంబర్ గల లారీని ఆపి తనిఖీ చేశారు.



లారీలో లోడ్ చేసి ఉన్న భారీ వరి విత్తనాల బస్తాలకు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు, అధికారిక లేబుల్స్, ధృవీకరణ పత్రాలు (సర్టిఫికెట్లు), బిల్లులు లేవని గుర్తించారు. విత్తనాల ప్యాకింగ్ కూడా చట్టబద్ధంగా లేకపోవడంతో, వాటిని సీడ్స్ యాక్ట్-1966, సీడ్ కంట్రోల్ ఆర్డర్-1983 నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్నట్లు నిర్ధారించి సీజ్ చేశారు. విత్తనాల నాణ్యతను పరిశీలించేందుకు నమూనాలను (శాంపిల్స్) హైదరాబాద్‌లోని ప్రభుత్వ అనుమతి పొందిన డీఎన్‌ఏ ఎఫ్‌పీ అండ్ టీసీఎం ల్యాబ్ కు పంపినట్లు ఏసీపీ తెలిపారు.ఈ అక్రమ రవాణా ఉదంతంలో నిబంధనలు ఉల్లంఘించిన క్రింది నలుగురు వ్యక్తులపై కోటపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ పేర్కొన్నారు. కట్ల భద్రయ్య -- లారీ డ్రైవర్, నిమ్మటి సతీష్-- సీడ్ ఆర్గనైజర్, జీఎన్‌వీ రామకృష్ణ-- మేనేజింగ్ డైరెక్టర్, సోనం సీడ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, పోలవేని రాజేష్ -- లారీ యజమాని లను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. లాభార్జనే ధ్యేయంగా నకిలీ, అనుమతులు లేని విత్తనాలను రైతులకు విక్రయించి మోసం చేయాలని చూస్తే కఠిన చర్యలు తప్పవు. ఇలాంటి విత్తనాల వల్ల పంటలు పండక రైతులు తీవ్ర ఆర్థిక నష్టాల్లో కూరుకుపోయి, చివరకు ఆత్మహత్యలకు పాల్పడే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి రైతులు విత్తనాలు కొనేటప్పుడు జాగ్రత్తగా ఉండాలనీ కేవలం ప్రభుత్వ గుర్తింపు పొందిన డీలర్ల వద్ద, ధృవీకరించబడిన (సర్టిఫైడ్) విత్తనాలను మాత్రమే కొనుగోలు చేసి, తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలి." అని ఏసీపీ ఏ. వెంకటేశ్వర్లు రైతులకు సూచించారు. ఈ పత్రికా సమావేశంలో ఏసీపీతో పాటు చెన్నూర్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆర్. కృష్ణ , కోటపల్లి సబ్ ఇన్స్పెక్టర్ శివనీతి రాజశేఖర్, మండల వ్యవసాయ అధికారి (ఏఓ) సాయి కృష్ణ రెడ్డి మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### రామగుండం పవర్ హౌస్ నుండి మజీద్

# టర్నింగ్ వరకు కోటి 80 లక్షలతో కొత్త పైపులైను ప్రారంభం

జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 19 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

నగరం అభివృద్ధి చెందుతున్న క్రమంలో ఇక్కడి నుండి ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళిన వారంతా మళ్ళీ తిరిగి రావాలని రామగుండం ఎంఎల్ఏ ఎం ఎస్. రాజ్ ఠాకూర్ పిలుపు నిచ్చారు . డి ఎం ఎఫ్ టి నిధులు రూ 1.80 కోట్లతో రామగుండం 30 వ డివిజన్ లో పవర్ హౌజ్ నుండి మజీద్ టర్నింగ్ వరకు పాత ఎ .సి. పైప్ లైన్ తొలగించి కొత్త పైప్ లైన్ వేసే పనులకు మేయర్ మహంకాళి స్వామితో కలిసి ఆయన మంగళ వారం మజీద్ కార్నర్ వద్ద శంఖుస్థాపన చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ మౌళిక వసతుల కల్పన , ఇంటి గ్రేటెడ్ స్కూల్ , ప్రభుత్వ పాటశాల నూతన భవనం , గ్రంధాలయం తదితర అభివృద్ధి పనులు సుమారు వెయ్యి కోట్ల రూపాయలతో పాటు పదహారు వేల కోట్ల రూపాయలతో విద్యుత్ కర్మాగారం నిర్మాణ పనులు కూడా త్వరలో ప్రారంభం కానున్న దృష్ట్యా రామగుండం ప్రాంతం భవిష్యత్తులో ప్రదాన కేంద్రం అవుతుందని అన్నారు. ఉపాధి అవకాశాలు కల్పించి పది మందికి అన్నం పెట్టిన ఈ ప్రాంతాన్ని మళ్ళీ ఆ వైభవం వచ్చేలా చేసి పుట్టిన ఊరు రుణం తీర్చుకుంటానని అన్నారు. భవిష్యత్ పట్టణ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రదాన రహదారులు వెడల్పు చేయడం జరుగుతున్నదని అన్నారు. రోడ్డు వెడల్పు లో భాగంగా దుకాణాలు కోల్పోయిన వారు ఎవరూ చింతించ వలసిన అవసరం లేదని వారు పక్కా భవనం నిర్మించుకోవడానికి [illegible] అందజేస్తామని అన్నారు.



అన్ని ప్రాంతాల నుండి రామగుండం కు సులభమైన రవాణా సౌకర్యం ఏర్పడితే క్రమేపీ అభివృద్ధి చెందుతుందని అన్నారు. రాబోయే రెండేళ్ల కాలంలో అనుకున్న పనులు అన్నీ పూర్తి చేసి రామగుండం నగరాన్ని అద్భుత నగరం గా తీర్చిదిద్దుతామని అన్నారు.

నగర మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ ఎం ఎల్ ఎ తనకు జన్మ నిచ్చిన ఊరును అభివృద్ధి చేసుకోవాలనే తలంపుతో రామగుండం కు ఇతర డివిజన్ ల కంటే ఎక్కువగా ప్రత్యేకంగా నిధులు కేటాయించారని అన్నారు. తద్వారా గత రెండేళ్ల కాలంలో రామగుండం రూపు రేఖలు మారిపోయాయని అన్నారు. దూర దృష్టితో , ప్రణాళికా బద్దంగా రామగుండం అభివృద్ధికి ఒక కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని పని చేయడం జరుగుతుందని అన్నారు. బి పవర్ హౌజ్ నుండి రామగుండం పట్టణానికి విశాలమైన రోడ్లు , స్టార్మ్ వాటర్ డ్రెయిన్ , రైల్వే స్టేషన్ ఎదుట షాపింగ్ కాంప్లెక్స్ ఇందుకు నిదర్శనమని అన్నారు. రామగుండం ప్రాంత అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న ఆయనను కడుపులో పెట్టి చూసుకోవల్సిన భాద్యత ఇక్కడి ప్రజలపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పాత పెల్లి ఎల్లయ్య , స్థానిక కార్పొరేటర్ ఇసంపెల్లి అంజయ్య , అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు , రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె, అరుణ శ్రీ , ఎస్ ఇ గురువీర పాటు కార్పొరేటర్లు సిరెశెట్టి సతీష్ , వడ్లూరి రవి , చిదురాల నాగరాజు , నాయకులు సలీం , మహమ్మద్ , వాజీద్ ఖాన్ , ఎం ఆర్ ఓ రవీందర్ , వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

### ఎన్ టి పి సి మేడిపల్లి సెంటర్ రోడ్లో

# 7.30 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 19 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం నగరం విద్య, వైద్య,ఉపాధి కల్పనా కేంద్రం గా అభివృద్ధి చెందుతున్నదని శాసన సభ్యులు ఎం. ఎస్. రాజ్ ఠాకూర్ అన్నారు. రామగుండం నగర పాలక సంస్థ ఆద్వర్యంలో 31, 32 , 33, 35,36,37,38,39,40,43,44,45, 50,53,55,60 తదితర డివిజన్ లలో డి. ఎం.ఎఫ్.టి నిధులు రూ 7.30 కోట్లతో ప్రతిపాదించిన పలు అభివృద్ధి పనులకు మేడిపల్లి రోడ్ లో మంగళ వారం నిర్వహించిన కార్యక్రమశీలో మేయర్ మహంకాళి స్వామి తో కలిసి శిలా ఫలకం ఆవిష్కరించి ఆయన శంఖుస్థాపన చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండం తెలంగాణ రాష్ట్రంలోనే ఒక అద్భుత నగరం గా రూపు దిద్దుకుంటున్నదని అన్నారు. ఓపెన్ కాస్ట్ కారణంగా మేడిపల్లి ప్రాంతశీ కోల్పోయిన వైభవాన్ని తిరిగి తేవడానికి ప్రయత్నం చేస్తున్నామని అన్నారు , సువిశాలమైన రహదారులు , అన్ని మౌళిక వసతుల కల్పన తో పాటు మూత పడిన ఓపెన్ కాస్ట్ లో పంపింగ్ స్టోరేజ్ తో విద్యుత్ తయారు చేసే పరిశ్రమ సింగరేణి ద్వారా స్థాపించనున్నామని అన్నారు . భవిష్యత్తులో ఈ ప్రాంత భూములకు మరింత డిమాండ్ పెరగడంతో పాటు ఉపాధి కల్పన లభిస్తుందని అన్నారు. డబల్ బెడ్ రూమ్ లకు పది కోట్ల రూపాయలు వెచ్చించి సకల సదుపాయాలు కల్పించి ఉపయోగంలోకి తీసుకురావడం జరిగిందని అన్నారు. పి , కె. రామయ్య కాలనీ లో కూడా రెండేళ్ల కాలంలో విశాల రహదారులతో పాటు సకల సౌకర్యాలు కల్పించామని అన్నారు . ఈ ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధిపై పై ప్రత్యేక దృష్టి సారించాలనే ఉద్దేశ్యంతో ఇరవై డివిజన్ లకు చెందిన కార్యక్రమానికి మేడిపల్లి గ్రామశీలో వేదిక ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. రామగుండం నగరాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు మంత్రులు , అధికారులు సహకరిస్తున్నారని అన్నారు. ఆరు గ్యారంటీలతో పాటు త్వరలోనే ప్రతి కుటుంబానికి ఐదు లక్షల రూపాయల బీమా పథకం కూడా అమలు చేయనున్నారని అన్నారు. అర్హులందరికీ చేయూత ఫించన్లు అందుతాయని అన్నారు. ఇల్లు లేని ప్రతి పేద కుటుంబానికి స్వంత ఇంటి కల నెరవేరుస్తామని అన్నారు.

రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ ఎన్ టి సి సి సంస్థ ప్రభావిత ప్రాంతం లో ఖర్చు పెట్టాల్సిన సి ఎస్ ఆర్ నిధులు ఇతర ప్రాంతాలకు తరలి పోతుంటే గతంలో ఉన్న ప్రజా ప్రతినిధులు పట్టించుకోలేదని అన్నారు. రాజ్ ఠాకూర్ ఎం ఎల్ ఎ అయిన తరువాత సి ఎస్ ఆర్ నిధులతో



పాటు అనేక నిధులు వెచ్చించి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. భూ నిర్వాసితులు , పేదలకు న్యాయం జరగాలని ఎం ఎల్ ఎ ఎప్పుడూ ఆలోచిస్తూ ఉంటారని అన్నారు. ఎన్ టి పి సి లో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ ఎం ఎల్ ఎ గా రాజ్ ఠాకూర్ ఎన్నికయిన తరువాతనే ప్రారంభం అయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య , అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ), నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ , ఎస్ ఇ గురువీర , కార్పొరేటర్లు సాహెదా ఆసిఫ్ పాషా , మీర్జా ఫజల్ బేగ్ , వెంగళ బాపు , మెరుగు భూ లక్ష్మీ , కొలని కవిత , కంకణాల మౌనిక , స్వప్న ప్రియ , మానస , ధూళి కట్ట సతీశ్ , ముస్తఫా , తాళ్ల పెల్లి యుగంధర్ , ఎం ఆర్ ఓ రవీందర్ , వివిధ విభాగాల అధికారులు , తదితరులు పాల్గొన్నారు.

# 90 వేల మెగావాట్ల స్థాపిత సామర్థ్యం దాటిన
# ఎన్టిపిసి లిమిటెడ్.. మరో మూడు ఏళ్ల లో లక్ష మెగావాట్లు

జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 19 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

ఎన్టిపిసి లిమిటెడ్ గ్రూప్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 90 వేల మెగావాట్ల మార్కును మంగళవారం దాటింది. గుజరాత్‌లోని ఖవడా సోలార్ ప్రాజెక్టులో అదనంగా 110.25 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించడంతో ఎన్టిపిసి గ్రూప్ మొత్తం స్థాపిత విద్యుత్ సామర్థ్యం 90,025 మెగావాట్లకు చేరుకుంది. దీంతో దేశంలోనే అతిపెద్ద సమీకృత విద్యుత్ ఉత్పత్తి సంస్థగా ఎన్టిపిసి తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంది. గడిచిన ఐదు సంవత్సరాలలో 25 వేల మెగావాట్లకు పైగా సామర్థ్యాన్ని జోడించడం కొత్త చరిత్రను లిఖించింది. ఎన్టిపిసి లిమిటెడ్ 1975లో కేంద్ర ప్రభుత్వ సంస్థగా ఏర్పడింది. అయితే సంస్థ యొక్క మొదటి విద్యుత్ ఉత్పత్తి యూనిట్ 1982–83 ప్రాంతంలో సింగ్రౌలి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ ద్వారా ప్రారంభమైంది. అప్పటి నుంచి దేశంలో విద్యుత్ రంగ అభివృద్ధిలో ఎన్టిపిసి కీలక పాత్ర పోషిస్తోంది. 1983లో కేవలం 200 మెగావాట్ల స్థాయిలో ప్రారంభమైన ఎన్టిపిసి, 1990 నాటికి దాదాపు 15 వేల మెగావాట్లకు చేరుకుంది. ఆ తర్వాత రామగుండం, కోర్బా, ఫరక్కా, వింధ్యాచల్, రిహాండ్, కహల్‌గ వంటి భారీ థర్మల్ ప్రాజెక్టుల ద్వారా వేగంగా విస్తరించింది.

2000 సంవత్సరం నాటికి ఎన్టిపిసి స్థాపిత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం సుమారు 19 వేల నుంచి 20 వేల మెగావాట్ల మధ్యకు చేరుకుంది. అప్పటికి సంస్థ ప్రధానంగా బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ ఉత్పత్తిపైనే దృష్టి పెట్టింది. దేశ మొత్తం విద్యుత్ ఉత్పత్తిలో ఎన్టిపిసి వాటా గణనీయంగా పెరిగింది. 2000 తర్వాత సంస్థ మరింత విస్తరణ చేపట్టింది. సూపర్ థర్మల్ పవర్ స్టేషన్లు, గ్యాస్ ఆధారిత యూనిట్లు, హైడ్రో ప్రాజెక్టులు, తదుపరి దశలో సోలార్ మరియు విండ్ ప్రాజెక్టులను కూడా ప్రారంభించింది.



2010 ప్రాంతానికి ఎన్టిపిసి సామర్థ్యం సుమారు 32 వేల మెగావాట్లకు చేరుకుంది. 2020 నాటికి ఎన్టిపిసి గ్రూప్ మొత్తం విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 62 వేల మెగావాట్లను దాటింది. మార్చి 2020లో నీప్కో, టి హెచ్ డి సి వంటి సంస్థల కొనుగోలు తర్వాత ఈ సామర్థ్యం 62,110 మెగావాట్లకు పెరిగింది. అదే ఏడాది జూలైలో లారా సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ యూనిట్ ప్రారంభంతో మొత్తం సామర్థ్యం 62,910 మెగావాట్లకు చేరుకుంది. అంటే 1983లో కొన్ని వందల మెగావాట్లతో ప్రారంభమైన ఎన్టిపిసి, 2000 నాటికి దాదాపు 20 వేల మెగావాట్లు, 2010 నాటికి 32 వేల మెగావాట్లు, 2020 నాటికి 62 వేల మెగావాట్లు, ప్రస్తుతం 2026లో 90 వేల మెగావాట్ల మార్కును దాటింది. గత ఐదు సంవత్సరాల కాలంలో ఎన్టిపిసి గ్రూప్ వేగంగా సామర్థ్యాన్ని పెంచుకుంది. 2021 ప్రాంతంలో సంస్థ స్థాపిత సామర్థ్యం సుమారు 65 వేల మెగావాట్ల పరిధిలో ఉండగా, ప్రస్తుతం అది 90 వేల మెగావాట్లను దాటింది. అంటే ఐదు సంవత్సరాల్లో సుమారు 25 వేల మెగావాట్లకు పైగా కొత్త సామర్థ్యాన్ని జోడించినట్లైంది. ఇందులో ముఖ్యంగా సౌర, పవన, హైడ్రో మరియు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల వాటా గణనీయంగా పెరిగింది.



అంతకుముందు 2016 నుంచి 2021 మధ్య కాలంలో ఎన్టిపిసి సుమారు 15 వేల నుంచి 18 వేల మెగావాట్ల వరకు సామర్థ్యాన్ని పెంచినట్లు రంగ విశ్లేషణలు చెబుతున్నాయి. అయితే 2021 తర్వాత పునరుత్పాదక ఇంధనంపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో సామర్థ్య విస్తరణ వేగం మరింత పెరిగింది. ప్రస్తుతం ఎన్టిపిసి వద్ద మరో 32 గిగావాట్లకు పైగా ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయి. 2032 నాటికి మొత్తం 149 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని చేరుకోవాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో 60 గిగావాట్లు పునరుత్పాదక ఇంధన వనరుల నుంచే ఉండనున్నాయి. సౌర, పవన విద్యుత్‌తో పాటు గ్రీన్ హైడ్రోజన్, బ్యాటరీ స్టోరేజ్, పంప్డ్ హైడ్రో స్టోరేజ్, అణు విద్యుత్ రంగాల్లో కూడా ఎన్టిపిసి పెట్టుబడులు పెంచుతోంది. ఇటీవల రాజస్థాన్‌లో భారీ అణు విద్యుత్ ప్రాజెక్టు పనులకు కూడా సంస్థ సిద్ధమవుతోందిదేశంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, కేంద్ర ప్రభుత్వ గ్రీన్ ఎనర్జీ ప్రోత్సాహకాలు, శిలాజ ఇంధనాలపై ఆధారాన్ని తగ్గించే లక్ష్యాలతో భారీ స్థాయిలో పునరుత్పాదక ప్రాజెక్టులు అమలవుతున్నాయి. భారతదేశాన్ని తక్కువ కార్బన్ ఉద్గారాల దిశగా తీసుకెళ్లడంలో ప్రభుత్వ రంగ సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఈ తాజా మైలురాయి మరోసారి స్పష్టం చేసింది.

## అర్బన్ హెల్త్ సెంటర్లో ఉచిత వైద్య పరీక్షల శిబిరం




జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 19 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

లక్ష్మీపురం పట్టణ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం 21,22వ డివిజన్ లో వైద్య పరీక్షల శిబిరం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డివిజన్ కార్పొరేటర్ కందుల స్వరూప సతీష్ మరియు యూ పి హెచ్ సి మెడికల్ ఆఫీసర్ మానికేశ్వర్ రెడ్డి పాల్గొని ఉన్న ఎస్ హెచ్ జి సభ్యుల ఆడపిల్లలకు (కౌమారదశ 15 సంవత్సరం నుండి 18 సంవత్సరాలు వరకు ) బిఎంఐ హిమోగ్లోబిన్ మరియు గ్లూకోజ్ పరీక్షలు చేయడం జరిగినది. మరియు పోషకాహారం గురించి, వ్యక్తిగత పరిశుభ్రత గురించి, అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్స్ పారిజాతం, తిరుపతి, వేణుగోపాల్ లాబ్ టెక్నీషియన్ సురేష్ నాయక్, ఫార్మసిస్ట్ శ్రావణ్ కుమార్ ఏఎన్ఎంలు, ఆశాలు, ఆర్పీలు పాల్గొన్నారు

## ఎగ్లాస్‌పూర్‌లో ఆర్టీసీ బస్ ప్రారంభించిన ఎమ్మెల్యే



జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 19 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గంలోని అంతర్గాం మండలం ఎగ్లాస్‌పూర్ గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్ కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆర్టీసీ బస్ సేవను ప్రారంభించారు. గ్రామ ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించడంలో ఇది ఉపయోగకరమని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వయంగా ఆర్టీసీ బస్సును నడిపి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఉపాధి కూలీలు, రైతులను కలిసి వారి సమస్యలు తెలుసుకుని ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు, రైతులకు ఈ బస్ సర్వీస్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు

## సమత గ్రంథాలయానికి కవి లక్ష్మయ్య పుస్తక విరాళం



జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 19 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

పుస్తక పఠనం పట్ల ఆసక్తిని పెంపొందించడం, జ్ఞానాన్ని విస్తరించడమే లక్ష్యంగా పనిచేస్తున్న స్థానిక 'సమత గ్రంథాలయానికి' ప్రముఖ కవి, ఉపాధ్యాయులు లక్ష్మయ్య దంపతులు విశేష సహకారం అందించారు. ?ఈ సందర్భంగా గ్రంథాలయ నిర్వాహకులు దుర్గం ప్రమీల నగేష్ మాట్లాడుతూ, "సాహిత్యం పట్ల ఎంతో అనురక్తి కలిగిన లక్ష్మయ్య తమ వ్యక్తిగత సేకరణలో ఉన్న విలువైన పుస్తకాలను గ్రంథాలయానికి విరాళంగా ఇచ్చారు. ఇందులో విజ్ఞానదాయకమైన పుస్తకాలతో పాటు, తెలుగు వారి సంస్కృతిని ప్రతిబింబించే 'పెద్ద బాలశిక్ష' వంటి ఎన్నో అరుదైన గ్రంథాలు ఉన్నాయి. ఒక కవిగా, విద్యావేత్తగా వారి ఉదారత అభినందనీయం" అని కొనియాడారు.. స్థానికులందరూ గ్రంథాలయానికి వచ్చి, ఈ పుస్తకాలను చదివి తమ మేధస్సును మరింతగా పెంపొందించుకోవాలని నిర్వాహకురాలు పిలుపునిచ్చారు. పుస్తకాలను చదవడం ద్వారా సంస్కృతి, సంప్రదాయాలు మరియు ఆధునిక విజ్ఞాన విషయాలను అర్థం చేసుకోవచ్చని తెలిపారు. స్థానిక ఉపాధ్యాయులు, సాహిత్యాభిమానులు తమ వద్ద ఉన్న పుస్తకాలను గ్రంథాలయానికి విరాళంగా అందిస్తున్నారని, ఎవరైనా కొత్తవారు పుస్తకాలను విరాళంగా ఇవ్వాలనుకుంటే సంతోషంగా స్వీకరిస్తామని ప్రమీల నగేష్ పేర్కొన్నారు.

## అంతర్గాం లో పుచ్చలపల్లి వర్ధంతి వేడుకలు




జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 19 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

పుచ్చల పల్లి సుందరయ్య 41 వ వర్ధంతి సందర్భంగా అంతర్గాం మండలం కేంద్రంలో సిపిఎం జెండాను మండలం కార్యదర్శి ఆడారి నర్సింగరావు ఎగుర వేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతు, దక్షిణభారత కమ్యూనిస్ట్ పార్టీ ఉద్యమ నిర్మాత, తెలంగాణ రైతంగ సాయిధ పోరాట రథసారథి, నిరంతరం పేద ప్రజల పక్షాన పోరాడిన గొప్ప నాయకుడు. నిరాడంబరత, ఆదర్శవశీత మైన కమ్యూనిస్టు మేధావి. కమ్యూనిస్ట్ ఎలా ఉండాలో ఆచరణలో చూపిన గోప్ప కమ్యూనిస్ట్ నాయకుడు, ఈ దేశంలో దోపిడీ లేని సమాజం స్థాపించాలని అలుపెరుగనిపోరాటం చేసిన, ఆదర్శ మూర్తి, వారి ఆశయాలను ముందుకు తీసుకొని వెళ్లడమే మనం వారికిచ్చే నివాళి అన్నారు. ఈ కార్యక్రమం లో, ఆడారి నర్సింగాపూర్, దొంతుల పోచం, తమ్మానవేణి శంకర్, కండ్లే శంకర్, కండ్లే శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా కందుల సంధ్యారాణికి ఘన సన్మానం...!



జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 19 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

బీజేపీ రామగుండం ఇంచార్జ్ కందుల సంధ్యారాణి గారు ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా నియమితులైన సందర్భంగా లక్ష్మీనగర్ మండల అధ్యక్షురాలు ఊరగొండ అపర్ణ గారి ఆధ్వర్యంలో మంగళవారం బీజేపీ పార్టీ శ్రేణులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని పూలమాలలు, శాలువాలతో అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ రామగుండం ఇంచార్జ్ కందుల సంధ్యారాణి మాట్లాడుతూ తనపై పార్టీ అధిష్టానం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఓబీసీ వర్గాల అభ్యున్నతికి మరింత కృషి చేస్తానని తెలిపారు. అలాగే తనకు ఘన స్వాగతం పలికి సన్మానించిన లక్ష్మీనగర్ మండల అధ్యక్షురాలు ఊరగొండ అపర్ణ గారికి, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి అందరూ సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ముసుకుల భాస్కర్ రెడ్డి, తడగొండ నరసయ్య ,సులువ లక్ష్మీనారాయణ, కోడూరు రమేష్, బియ్యాల మహేందర్, మాదరబోయిన రాకేష్, అందే రాజ్ కుమార్ చారి, సిలారపు కళ్యాణ్, మీస వికాస్, నగునూరి లక్ష్మీనారాయణ, కొమ్మ స్వామి, తడగొండ కార్తీక్, జనగామ సాగర్, వీరబోయిన శ్రీనివాస్, వంశీ ,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇకముందు ఎవరూ అధిగమించలేని సరికొత్త రికార్డు సృష్టించిన ఎన్టిపిసి సీఎండి గురుదీప్



జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 19 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

1975లో స్థాపించబడిన ఎన్టిపిసి లిమిటెడ్ దేశ విద్యుత్ రంగ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ ముందుకు సాగుతోంది. 1983లో స్వంత విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించిన ఈ సంస్థ, కేవలం కొన్ని వందల మెగావాట్ల స్థాయి నుంచి నేడు 90 వేల మెగావాట్లకు పైగా స్థాపిత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని చేరుకోవడం భారత పారిశ్రామిక చరిత్రలో ఒక గొప్ప మైలురాయిగా నిలిచింది. 2014 ఫిబ్రవరిలో ఎన్టిపిసి చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్‌గా గురుదీప్ సింగ్ బాధ్యతలు చేపట్టిన సమయంలో సంస్థ సామర్థ్యం సుమారు 44 వేల మెగావాట్ల పరిధిలో ఉండేది. ఆయన దూరదృష్టి, సమర్థ నాయకత్వం, వేగవంతమైన నిర్ణయాలు, పారదర్శక పరిపాలనతో కేవలం 12 సంవత్సరాల వ్యవధిలోనే ఎన్టిపిసి సామర్థ్యాన్ని 90 వేల మెగావాట్లకు పైగా తీసుకెళ్లడం విశేషంగా చెప్పుకోవాల్సిన విషయం. ఇకముందు ఎవరు అధిగమించలేని సరికొత్త రికార్డు ఆయన నెలకొల్పారు. దేశ అవసరాలకు అనుగుణంగా సాంకేతిక నైపుణ్యాన్ని, ప్రభుత్వ విధానాలను అనుసరించి ముందడుగు వేస్తున్నారు. అంటే గురుదీప్ సింగ్ నాయకత్వంలోనే దాదాపు 46 వేల మెగావాట్లకు పైగా కొత్త విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం జోడించబడింది. దేశంలోనే అతిపెద్ద విద్యుత్ ఉత్పత్తి సంస్థగా ఎన్టిపిసిని మరింత బలోపేతం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు.

ప్రత్యేకంగా పునరుత్పాదక ఇంధన రంగంలో ఎన్టిపిసి వేగంగా ముందుకు సాగడానికి గురుదీప్ సింగ్ తీసుకున్న నిర్ణయాలు ప్రధాన కారణంగా నిలిచాయి. సౌర విద్యుత్, పవన విద్యుత్, గ్రీన్ హైడ్రోజన్, పంప్డ్ స్టోరేజ్, బ్యాటరీ నిల్వ ప్రాజెక్టులు, అణు విద్యుత్ వంటి భవిష్యత్ ఇంధన రంగాలపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. గుజరాత్‌లో నిర్మితమవుతున్న ఖవడా భారీ సౌర విద్యుత్ పార్క్, దేశవ్యాప్తంగా అమలవుతున్న పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు, గ్రీన్ ఎనర్జీ రంగంలో ఎన్టిపిసి వేగవంతమైన విస్తరణ--- ఇవి గురుదీప్ సింగ్ పరిపాలనా దక్షతకు నిదర్శనాలుగా నిలుస్తున్నాయి. సంస్థను కేవలం లాభాల దిశలోనే కాకుండా, దేశ భవిష్యత్ ఇంధన భద్రత వైపు తీసుకెళ్లడంలో ఆయన చూపుతున్న కృషి విద్యుత్ రంగంలో ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది. ఉద్యోగుల సంక్షేమం, సాంకేతిక ఆధునీకరణ, పర్యావరణ పరిరక్షణ అంశాలను సమతుల్యంగా ముందుకు తీసుకెళ్తూ ఎన్టిపిసిని ప్రపంచ స్థాయి విద్యుత్ సంస్థగా తీర్చిదిద్దడంలో గురుదీప్ సింగ్ సేవలు విశేషమైనవిగా భావిస్తున్నారు.

## మజ్జిగ పంపిణీ చేసినఆది జాంబవ సంఘం




మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ మే 19/ అక్షరం న్యూస్ –:

మందమర్రి పట్టణంలో ఆది జాంబవ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మార్కెట్ సెంటర్ లో మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఆది జాంబవ సంఘం సభ్యుడైన ఆసం కొమురయ్య సహకారంతో మజ్జిగ పంపిణీ చేసినట్లు ఆది జాంబవ సంఘం అధ్యక్షులు కంబాల రాజనర్సు, ప్రధాన కార్యదర్శి దాసరి రాజనర్సు లు తెలిపారు. వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకొని తమ సంఘం ఆధ్వర్యంలో పలువురు దాతల సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టినట్టు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో అరెంద కరుణాకర్, దాసరి ఎల్లారం, తుంగపిండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ 21 వ డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశం...

- డివిజన్ల వారీగా నూతన కమిటీలు ..
- రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి
- తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నాగా సీతారాములు పిలుపు ..




ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 19 (అక్షరం న్యూస్)

సుజాతనగర్ : కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని 21 వ డివిజన్ లో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పిలుపుమేరకు డివిజన్ కమిటీలను ఎన్నుకునే దానిలో భాగంగా 21 డివిజన్ నందు ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ముఖ్యఅతిథిగా టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగాసీతారాములు పాల్గొని ఆయన మాట్లాడుతూ 2029 ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా పనిచేస్తూ , కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను , ప్రభుత్వం చేస్తున్న పలు సంక్షేమం,అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ , పార్టీ పటిష్ట నిర్మాణం కొరకు కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని,కమిటీ సభ్యులు క్రమశిక్షణతో మెలుగుతూ పార్టీ పురోభివృద్ధికి కృషి చేయాలని ఆయన వారికి సూచించారు . ఈ కార్యక్రమంలో కొత్తగూడెం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత, కొత్తగూడెం సొసైటీ చైర్మన్ మండే వీరహనుమంతరావు, 28వ డివిజన్ కార్పొరేటర్ శ్రీలక్ష్మీ,కాంగ్రెస్ 25వ డివిజన్ కార్పొరేటర్ కే కే,పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆళ్ల మురళి,బత్తుల కేశవరావు,బత్తుల వీరయ్య మరియు 21వ డివిజన్ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతుల దాహార్తి తీర్చిన డాక్టర్ కాపా మురళీకృష్ణ దంపతులు..

- రైతుల పొలాల్లో మంచినీటి బోరేయించిన వైరా లైన్స్ క్లబ్..



ధర్మఘంట మే 19 ఖమ్మం

వైరా మండల పరిధిలోని పుణ్యపురం గ్రామంలో ముద్దనూరు వెళ్లే దారిలో నిత్యం రైతులు వ్యవసాయకూలీలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు పశువుల సైతం ఎండ తీవ్రతకి నీటి కోసం అల్లాడుతున్నాయి. త్రాగునీటి అవసరాలను గుర్తించిన వైరా మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, మురళీకృష్ణ లైన్స్ క్లబ్ వారు మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ బోర్ ద్వారా పొలాలలో పనిచేసే రైతులకు శ్రామికులకు, పశువులకు సురక్షితమైన త్రాగునీరు అందుబాటులోకి వచ్చింది. పొలాలలో త్రాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతన్నల కష్టాలను గుర్తించిన గ్రామ సర్పంచ్ యంగల మరియమ్మ డాక్టర్ కాపా చంద్రకళ, మురళీకృష్ణ దృష్టికి తీసుకువెళ్లగా తక్షణమే వారు స్పందించి, స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కొత్త బోరును వేయించారు. ప్రస్తుత ఎండల దృష్ట్యా ఈ బోరు ఎంతోమందికి దాహార్తిని తీరుస్తుందని, స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సమాజ శ్రేయస్సు కోసం లైన్స్ క్లబ్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని గ్రామ ప్రజ లు కొనియాడారు. బోరు వేపించే కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యంగల మరియమ్మ, గ్రామ కార్యదర్శి గ్రామ పెద్దలు గ్రామ రైతులు, పలువురు ఉన్నారు.

# పుత్రవాత్సల్యం – రాజకీయ పతనం

- బాబూ జగ్జీవన్ రామ్ నుండి నేటి బండి సంజయ్ వరకు...
- తండ్రుల కెరీర్‌ను దెబ్బతీసిన కొడుకుల వివాదాలు

అక్షరం న్యూస్ ప్రతినిధి, సుల్తానాబాద్,పెద్దపల్లి జిల్లా, మే 19,

(మహమ్మద్ యూసుఫ్ అలీ )



రాజకీయ వారసత్వం ఒక వరమని భావించిన కొందరు రాజకీయ నాయకులకు, అదే వారసత్వం వారి కీర్తి ప్రతిష్టలను మంట గలిపే శాపంగా మారుతుందని చరిత్ర ఎన్నో సార్లు నిరూపించింది. భారతదేశ రాజకీయ నాయకులను స్వాతంత్ర్య సమరయోధుల నుండి నేటి తరం ప్రాంతీయ, జాతీయ నాయకుల వరకు కొడుకుల అనాలోచిత ప్రవర్తన, వివాదాలు తండ్రుల రాజకీయ జీవితాలను కుదిపేసిన ఎన్నో సంఘటనలు ఉన్నాయి. కొందరు ఈ విషయాల్లో నిలదొక్కుకుంటే మరికొందరు జీవిత కాల సంఘర్షణ ఫలాలను కోల్పోయిన వారెందరో ఉన్నారు. భారతదేశ ఉప ప్రధానిగా, అణగారిన వర్గాల ఆశాజ్యోతిగా వెలుగొందిన బాబూ జగ్జీవన్ రామ్ రాజకీయ జీవితం ఒకానొక దశలో ప్రధానమంత్రి పదవికి అత్యంత సమీపంలోకి వెళ్లింది. కానీ, 1978లో ఆయనకు ఒక్కగానొక్క కుమారుడైన సురేష్ రామ్ చుట్టూ ముసురుకున్న ఒక వ్యక్తిగత వివాదం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆ కాలంలో ఆ వివాదాన్ని ప్రతిపక్షాలు జగ్జీవన్ రామ్‌కు వ్యతిరేకంగా ,రాజకీయ ఆయుధంగా వాడుకున్నాయి. దీనివల్ల ఆయనకు దక్కాల్సిన ప్రధానమంత్రి పదవి చేజారిపోవడమే కాకుండా, ఆయన రాజకీయ ప్రతిష్టకు కోలుకోలేని దెబ్బ తగిలింది.ఇదే తరహాలో, ఇందిరా గాంధీ హయాంలో ఆమె చిన్న కుమారుడు సంజయ్ గాంధీ రాజ్యాంగేతర శక్తిగా ఎదిగారు. ముఖ్యంగా 1975 ఎమర్జెన్సీ సమయంలో ఆయన తీసుకున్న కొన్ని వివాదాస్పద నిర్ణయాలు దేశాన్ని కుదిపేశాయి. ఢిల్లీ తో పాటు ఉత్తరాది రాష్ట్రాల్లో సంజయ్ గాంధీ నేతృత్వంలో జరిగిన బలవంతపు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, మురికివాడల తొలగింపు పేరుతో తుర్క్‌మన్ గేట్ వద్ద పేదల ఇళ్లను ధ్వంసం చేయడం ప్రజల్లో తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించాయి. ఈ అనాలోచిత, కఠిన నిర్ణయాల వల్ల ఇందిరా గాంధీ ఎన్నో రాజకీయ దాడులను ఎదుర్కొన్నారు. 1977 ఎన్నికల్లో ఇందిరా గాంధీ స్వయంగా ఓటమి చెందడం లో ఈ నిర్ణయాలు కూడ భాగమయ్యాయి. దేశానికి మార్గ దర్శనం చేసిన జాతిపిత మహాత్మా గాంధీ వ్యక్తిగత జీవితంలో కూడా ఆయన పెద్ద కుమారుడు హరిలాల్ గాంధీ ఒక తీరని వేదనగా మిగిలారు. గాంధీజీ నమ్మిన అహింస, సత్యం, ఆదర్శాలకు పూర్తి భిన్నంగా హరిలాల్ జీవితం సాగింది. ఆయన మద్యానికి బానిస కావడం, ఆ తర్వాత ఇస్లాం మతంలోకి మారి “అబ్దుల్లా గాంధీ”గా పేరు మార్చుకోవడం, ఆపై మళ్లీ ఆర్యసమాజ్ ద్వారా హిందూ మతంలోకి రావడం వంటి సంఘటనలు గాంధీజీని తీవ్రంగా కలచివేసాయి. తన సొంత కొడుకును సరైన మార్గంలో పెట్టలేకపోయారనే విమర్శలను గాంధీజీ ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇది ఆయన రాజకీయ కెరీర్‌ను దెబ్బతీయకపోయినా, ఆయన వ్యక్తిగత జీవితాన్ని, మానసిక ప్రశాంతతను చాలా ప్రభావితం చేసింది. ఇక మన తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే, వారసుల తొందరపాటు నిర్ణయాలు, వివాదాల వల్ల రాజకీయంగా తీవ్ర నష్టం మూటగట్టుకున్న ప్రముఖుల ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అత్యంత శక్తివంతమైన నాయకుడిగా, స్పీకర్‌గా,మంత్రిగా సేవలందించిన ఒక దిగ్గజ నేత కుమారుడు ఫ్యాక్షన్ రాజకీయాలు, హత్య కేసుల్లో చిక్కుకోవడం అప్పట్లో సంచలనం సృష్టించింది. ఆ వివాదాలు సదరు సీనియర్ నాయకుడి రాజకీయ జీవిత చరమాంకంలో పెద్ద మచ్చగా మిగిలాయి. అదేవిధంగా, రాయలసీమకు చెందిన మరికొందరు సీనియర్ మంత్రులు, నేతల కుమారులు భూదందాలు, సెటిల్మెంట్లు,హత్యా రాజకీయాల్లో ప్రమేయం కలిగి ఉండటం వల్ల ఆయా కుటుంబాలు ప్రజల్లో నమ్మకాన్ని కోల్పోయి, రాజకీయంగా కనుమరుగయ్యే పరిస్థితి తెచ్చుకున్నాయి. కీలక పారిశ్రామికవేత్తలు, మంత్రులుగా ఉన్న వారి కుమారులు డ్రగ్స్ కేస్ వివాదాలు ,రోడ్డు ప్రమాదాల కేసుల్లో చిక్కుకోవడం పార్టీల ప్రతిష్టను, తండ్రుల ఇమేజ్‌ను డిఫెన్స్‌లో పడేశాయి. ఇప్పుడు సీనియర్ నేతలు గా చెప్పుకుంటున్న వారందరూ రాజకీయంగా మౌన దారి ఎంచుకోవడం వెనుక ఉన్న అసలు కారణం పుత్ర కార్యాలే. ఇప్పటి ఆధునిక కాలపు సోషల్ మీడియా యుగంలో ఈ తరహా వివాదాలు మరింత వేగంగా నాయకుల ప్రతిష్టను దెబ్బతీస్తున్నాయి. క్లబ్బుల్లో,ఫామ్ హౌస్, లో కొందరు నాయకుల కుమారులు చేసిన హంగామా కారణంగా ఎన్నో సంచలన విషయాలు చర్చల్లోకి వచ్చాయి.ఈ మధ్య కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ చుట్టూ ముసురుకున్న తీవ్రమైన వివాదం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. గతంలో కాలేజీలో తోటి విద్యార్థిపై దాడి చేసిన వీడియోతో వివాదంలోకి వచ్చిన భగీరథ్‌పై, తాజాగా ఒక 17 ఏళ్ల మైనర్ బాలికను లైంగికంగా వేధించారనే ఆరోపణలతో పోలీసులు ‘పోక్సో’ చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ విషయం ప్రస్తావిస్తూ తాను తన కుమారుడికి సమయం ఇవ్వలేక పోయనే అంటూ కన్నీళ్లు పెట్టుకున్న వీడియో లు వార్తా మద్యమాల్లో మనం చూశాం. తండ్రి ఆవేదన కంటే ఎక్కువగా రాజకీయ అంశంగా ఈ విషయం చర్చల్లో ఉంది. ప్రతి పక్ష పార్టీ లు,సమాజ మేధావులు, ఎవరికి వారు రాజకీయ దాడులు చేస్తున్నారు. కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ రాజకీయ ప్రతిష్టకు, నైతికతకు ఈ సంఘటన పెద్ద ఎదురు దెబ్బగా మారింది. కేంద్ర మంత్రి బండి సంజయ్ రాజీనామా చేయాలని గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారాలను విశ్లేషిస్తే, ప్రధానంగా కొన్ని కారణాలు కనిపిస్తాయి. తండ్రి పడే కష్టం, త్యాగాలు కొడుకులకు తెలియకపోవడం వల్ల, ఆ అధికారం తమకు పుట్టుకతో వచ్చిన హక్కుగా భావించి కొందరు అధికార మదంతో ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తారు. ఎలాంటి పదవి, జవాబుదారీతనం లేకపోయినా తండ్రి పేరు వాడుకుని సెటిల్మెంట్లు, దందాలు చేస్తూ రాజ్యాంగేతర శక్తులుగా మారుతుంటారు. మరోవైపు, కొడుకులు తప్పు చేస్తున్నా రాజకీయ భవిష్యత్తు కోసం తండ్రులు మితిమీరిన పుత్రవాత్సల్యంతో మహాభారతంలోని ధృతరాష్ట్రుడిలా వాటిని కప్పిపుచ్చడానికి ప్రయత్నించడం కూడా ఒక కారణం. చరిత్ర మనకు నేర్పే పాఠం ఒక్కటే రాజకీయాల్లో ప్రజాదరణ అనేది వారసత్వంగా వచ్చే ఆస్తి కాదు. నాయకులు ఎంత గొప్ప వారైనా, వారి వారసులు ప్రజాస్వామ్య నిలువుటద్దంలో క్రమశిక్షణ తప్పితే, ఆ పాపం తండ్రుల ముప్పై నలభై ఏళ్ల రాజకీయ తపస్సును క్షణాల్లో బూడిద చేయగలదు. బాబూ జగ్జీవన్ రామ్ నుండి నేటి ఆధునిక రాజకీయ నాయకుల వరకు జరుగుతున్న సంఘటనలు రాబోయే తరాల యువ నాయకులు ఒక హెచ్చరిక లా తీసుకుని తమను తాము అలాంటి విషయాల కు దూరంగా ఉంచడం తోనే సక్సెస్ ఫుల్ పొలిటీషియన్ గా ఎదగవచ్చు. ప్రేమించి అందలం ఎక్కించిన జనాలు,వాటిని లాక్కోవడం లో జాప్యం చేయరు. చరిత్ర లో ఇధి ఎన్నో మార్లు రిపీట్ అయ్యింది.

# గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని విస్తృతంగా పెంచాలి...

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- అండర్‌గ్రౌండ్ విద్యుత్ లైన్ల పనులు నాణ్యతతో పూర్తి చేయాలి..
- మోడల్ సోలార్ విలేజ్‌లలో రెండు నెలల్లో సోలార్ ప్యానెల్‌ల ఏర్పాటు పూర్తి చేయాలి..
- సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను వేగవంతం చేసి గడువులోగా పూర్తి చేయాలి..
- గిరిజన ప్రాంతాలు, మిగిలిన హాబిటేషన్లకు వంద శాతం విద్యుత్ కనెక్టివిటీ కల్పించాలి..
- విద్యుత్ శాఖ పనులపై సమీక్షించిన జిల్లా కలెక్టర్..

ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 19 (అక్షరం న్యూస్)



జిల్లాలో గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని విస్తృతంగా పెంచాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్‌లో విద్యుత్ శాఖ పనుల పురోగతిపై టీజీఎన్‌పీడీసీఎల్, టీజీ రెడ్‌కో అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు.

జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ప్రత్యేకంగా గిరిజన గ్రామాల్లో విద్యుత్ సౌకర్యాలు పూర్తి స్థాయిలో అందుబాటు లోకి రావాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో సోలార్ ప్యానెల్‌ల ఏర్పాటు అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. మిగిలిన అన్ని హాబిటేషన్లు, గృహాలకు వంద శాతం విద్యుత్ కనెక్టివిటీ కల్పించాలని ఆదేశించారు.అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను ప్రత్యక్షంగా సందర్శించి విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయో లేదో పరిశీలించాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో 52 అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యుదీకరణ పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని అత్యంత త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ లైన్ల పనులను అత్యుత్తమ నాణ్యతతో చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి వంద మీటర్లను ఒక బ్లాక్‌గా గుర్తిస్తూ భవిష్యత్తులో నిర్వహణ, మరమ్మత్తులు అవసరమైన సమయంలో ఖచ్చితమైన ప్రాంతాన్ని సులభంగా గుర్తించే విధంగా వ్యవస్థ రూపొందించాలని సూచించారు. జిల్లాలో విద్యుత్ స్తంభాలపై కేబుల్, నెట్ లైన్లు ఉండటం వల్ల అంతరాయాలు కలగకుండా సంబంధిత శాఖల మధ్య సమన్వయంతో చర్యలు చేపట్టాలని తెలిపారు. మధిర పట్టణంలో అండర్‌గ్రౌండ్ విద్యుత్ లైన్ల ఏర్పాటులో భాగంగా కేబుల్, ఇంటర్నెట్ సేవల సంస్థలతో సమన్వయ సమావేశం నిర్వహించాలని సూచించారు. విద్యుత్ లైన్లతో పాటు కేబుల్, నెట్ లైన్లను కూడా భూగర్భంలో ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని ఆదేశించారు.భవిష్యత్తులో మున్సిపల్, త్రాగునీటి, తదితర శాఖల పనుల సమయంలో భూగర్భ విద్యుత్ లైన్లు దెబ్బతినకుండా స్పష్టమైన సూచికలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రత్యేక అండర్‌గ్రౌండ్ కంపార్ట్‌మెంట్ కేటాయింపు సాధ్యతను కూడా పరిశీలించాలని సూచించారు.జిల్లాలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా అన్ని రంగాలకు సరిపడేలా సబ్‌స్టేషన్ మౌలిక వసతులను నవీకరించాలని కలెక్టర్ ఆదేశించారు. సబ్‌స్టేషన్ నిర్మాణాలకు సంబంధించిన భూసమస్యలను అత్యంత త్వరగా పరిష్కరించాలని, ప్రతి సబ్‌స్టేషన్ పనిని వేగవంతం చేసి నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సూచించారు.సాంకేతికంగా అనుకూలమైన భూమి అందుబాటులో లేని ప్రాంతాల్లో భూసేకరణ ప్రక్రియ చేపట్టాలని, అవసరమైన అంచనాలు సక్రమంగా పూర్తి చేసి త్వరితగతిన సమర్పించాలని అధికారులకు సూచించారు.ఖమ్మం జిల్లాలో ఇందిరా మహిళా శక్తి పథకం క్రింద రెండు చోట్ల ఒక మెగావాట్ సోలార్ ప్రాజెక్టులు నిర్మిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో ఒక ప్రాజెక్టు పూర్తయిందని, రెండవ ప్రాజెక్టు పనులు ఈ నెలాఖరులోగా పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు.మోడల్ సోలార్ విలేజ్ పథకం క్రింద ఖమ్మం జిల్లాలో 27 గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇందులో బోనకల్ మండలంలోని 22 గ్రామాలు ఉన్నాయని చెప్పారు. గృహ జ్యోతి పథకం లబ్ధిదారుల ఇళ్లలో 2 కిలోవాట్ల సామర్థ్యంతో సోలార్ వ్యవస్థలు ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి ఇంటి ద్వారా సుమారు 240 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని తెలిపారు. అదనంగా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించడం ద్వారా ప్రజలకు నెలకు 300 నుండి 400 రూపాయల వరకు ఆదాయం లభించడంతో పాటు ఉచిత విద్యుత్ ప్రయోజనం కూడా అందుతుందని వివరించారు.మోడల్ సోలార్ విలేజ్‌లలో వ్యక్తిగత గృహాలు, ప్రభుత్వ సంస్థలు కలిపి మొత్తం 9 వేల 418 నిర్మాణాల్లో సోలార్ ప్యానెల్‌ల ఏర్పాటును వచ్చే రెండు నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. 27 గ్రామాల్లో మొత్తం 4,371 మంది రైతులకు సోలార్ పంప్‌సెట్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. టీజీ రెడ్‌కో పథకాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి, గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని మరింత పెంచాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ శ్రీనివాస చారి, టెక్నికల్ డిఈ బాబురావు, డిఈలు రామారావు, నాగేశ్వర రావు, రమేష్, భద్రుపవర్, శ్రీనివాస రావు, రెడ్కో జి.ఎం. అజయ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నేడు అన్ని ఫార్మసీ దుకాణాలు తెరిచే ఉంటాయి

•బంద్‌కు మద్దతు లేదు...ప్రజాసేవే మా లక్ష్యం.
•తెలంగాణ ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం



సూర్యాపేట మే 19(అక్షరం న్యూస్ ):
జిల్లా కేంద్రంలో నేడు అన్ని ఫార్మసీ దుకాణాలు యథావిధిగా తెరిచే ఉంటాయని తెలంగాణ ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి తన్నీరు రోజశ్రీ స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కూర్మ శంకర్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.పట్టణంలో ఫార్మసిస్టుల ఆధ్వర్యంలో నడుస్తున్న 20 మెడికల్ షాపులు ప్రజా సేవను ప్రధానంగా భావిస్తూ నిరంతరం పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న ప్రజలకు మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఫార్మసీ సేవలను ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేయబోమన్నారు.నేడు బుధవారం బంద్‌కు పిలుపునిచ్చిన కెమిస్టులు, డ్రగ్గిస్టుల సంఘానికి తమ ఫార్మసిస్టుల సంక్షేమ సంఘం ఎలాంటి మద్దతు ఇవ్వడం లేదని స్పష్టం చేశారు. ప్రజలకు సేవ చేయడమే తమ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.అర్హత కలిగిన ఫార్మసిస్టులు లేకుండా కొన్ని మెడికల్ షాపులు నడుస్తుండటంతో ప్రజల ఆరోగ్యానికి ప్రమాదం ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సూర్యాపేటలో 200కు పైగా మెడికల్ షాపులు ఉన్నప్పటికీ, ఫార్మసీ విద్య పూర్తి చేసి స్వయంగా దుకాణాలు నిర్వహిస్తున్న 20 మంది ఫార్మసిస్టులే నిబంధనలకు అనుగుణంగా సేవలు అందిస్తున్నారని ప్రజలు గ్రహించాలని కోరారు.ప్రజల ఆరోగ్య భద్రత కోసం అర్హత కలిగిన ఫార్మసిస్టుల ద్వారా మాత్రమే మెడికల్ షాపులు నిర్వహించాలనే నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గద్దల సైదులు, పట్టణ అధ్యక్షులు సుంకరబోయిన కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాల బస్సు డ్రైవర్లకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలి

•ప్రమాద బీమా, ఉచిత విద్య, వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ డిమాండ్..



సూర్యాపేట మే 19(అక్షరం న్యూస్ ):
జిల్లా లోని ప్రైవేట్ పాఠశాలల బస్సు డ్రైవర్ల సమస్యలపై సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో కార్మికుల సంక్షేమంపై పలు కీలక డిమాండ్లు వినిపించాయి. మంగళవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నాగేంద్ర బాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ప్రస్తుతం ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న బస్సు డ్రైవర్లు చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించలేని దుస్థితిలో ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చదువుకున్న నిరుద్యోగులు ఉపాధి లేక తక్కువ జీతాలతో డ్రైవర్లుగా పనిచేస్తున్నారని, పెరిగిన నిత్యావసర ధరలతో జీవనం మరింత భారంగా మారిందన్నారు. కనీస వేతనంగా నెలకు రూ.26 వేలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రోడ్డు రవాణా చట్టాల వల్ల ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో డ్రైవర్లపై కఠిన చర్యలు పడే అవకాశాలు ఉన్నాయని, అలాంటి పరిస్థితుల్లో కార్మికులకు రక్షణ కల్పించే విధంగా ప్రత్యేక విధానాలు తీసుకురావాలని కోరారు. ట్రాన్స్‌పోర్ట్ రంగంలో పనిచేస్తున్న కార్మికుల కోసం ప్రత్యేక వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని సూచించారు.డ్రైవర్లకు ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి వేతన సవరణ చేయాలని, సంవత్సరానికి రెండు జతల బట్టలు, చెప్పులు అందించాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా డ్రైవర్ల పిల్లలకు వారు పనిచేస్తున్న పాఠశాలల్లో ఉచిత విద్య అందించేలా యాజమాన్యాలు ముందుకు రావాలని కోరారు. ప్రతి నెల సమయానికి వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు సాయి కుమార్, సుందరయ్య, యూనియన్ అధ్యక్షుడు నాగేంద్ర బాబు, ప్రసాద్, మామిడి సైదులు, ఖాదర్, మచ్చ సైదులు, సతీశ్, గోపాల్ దాస్, వీరయ్య, చంద్ర మోహన్, అయోధ్య, కార్తీక్, గోపి, మోహన్, శ్రీనివాస్, వీరేశం, మురళీ తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్ లబ్ధిదారులు,ఆధార్‌తో పేర్లు నమోదు చేసుకోవాలి





•తల్లాడ పంచాయతి కార్యదర్శి ఆర్ శ్రీ హరికృష్ణ

ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 19 తల్లాడ (అక్షరం న్యూస్)
పెన్షన్ లబ్ధిదారులు,ఆధార్ తో పేర్లు నమోదు చేసుకోవాలని తల్లాడ పంచాయతి కార్యదర్శి ఆర్ శ్రీ హరికృష్ణ అన్నారు.మంగళవారం కార్యదర్శి విలేకరులతో మాట్లాడుతూ..తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోనిఆసరా, వికలాంగుల, పెన్షన్ లబ్ధిదారులు, ఆధార్ కార్డు తీసుకుని, తల్లాడ గ్రామపంచాయతీ కార్యాలయంలో నమోదు చేయించుకోవాలని, ఈవో ఆర్ శ్రీ హరికృష్ణ సూచించారు, ప్రభుత్వ పెన్షన్లు పొందేవారు తమ ఆధార్ కార్డులు తీసుకొని, గ్రామపంచాయతీ కార్యాలయంలో

తమ పేర్లు నమోదు చేయించుకోవాలని, ఈ ప్రక్రియ ఈ నెల 15 నుండి, జూన్ నెల 5 వరకు నిర్వహిస్తామన్నారు, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఎవరైతే గ్రామ పంచాయతీ కార్యాలయానికి రాలేని వారు తమకు సమాచారం అందిస్తే ఇంటి వద్దకే వచ్చి నిర్ధారణ చేసుకుంటామన్నారు, ఆధార్ కార్డ్ వెరిఫికేషన్ చేయించుకోని వారి పెన్షన్లు నిలిపివేయబడతాయన్నారు.ఇట్టి విషయాన్ని గమనించి పెన్షన్ దారులు సహకరించాలని కోరారు.

# బడుగులు ఇండ్ల నిర్మాణం చేయవద్దా



•ఇండ్ల నిర్మాణాన్ని అడ్డుకోవడం అన్యాయం ..
•టిఆర్పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్
•అన్ని రకాల అనుమతులతో బహిరంగ చర్చకు సిద్ధం

సూర్యాపేట మే 19(అక్షరం న్యూస్ ):
బడుగులు ఇండ్ల నిర్మాణం చేయవద్దా,ఇండ్ల నిర్మాణాన్ని అడ్డుకోవడం అన్యాయమని సూర్యాపేటలో జిల్లా కేంద్రంలోని వజ్ర టౌన్ షిప్ లో బడుగు బలహీన వర్గాలు ఇళ్ల నిర్మాణాన్ని అడ్డుకుంటే సహించేది లేదని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ అన్నారు. మంగళవారం సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూకబ్జాలు, అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.2024లో సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో నల్లు ఉమా జ్యోతి రెడ్డి, నల్లు చిత్తరంజన్ రెడ్డి పై కేసు నమోదైనప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు.మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి ప్రోద్బలంతో అక్రమాలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. బడుగు బలహీన వర్గాలు ఎదగకుండా అగ్రకులాలు ఆటంకం కలిగించడం ఆవేదన కలిగిస్తుందని అన్నారు. చట్టబద్ధంగా అనుమతులు తీసుకోని నిర్మాణ పనులు చేపడుతున్న బడుగు బలహీన వర్గాల ప్రజలను కొందరు కావాలనే ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. నిర్మాణ పనులకు ఉపయోగిస్తున్న ఇనుప సామగ్రి, రాడ్లు వంటి యంత్రాలను మున్సిపల్ సిబ్బంది బలవంతంగా తీసుకెళ్లి అక్కడ ఉన్న తమ వారిని పోలీసులు పోలీస్ స్టేషన్లో తీసుకెళ్ళి కూర్చోబెట్టడం ఎంతవరకు న్యాయమని అన్నారు. ఇది అధికార పార్టీ నాయకులు అండదండలతో పోలీసు వారు అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. లక్షల రూపాయల విలువైన సామగ్రిని అన్యాయంగా మున్సిపాలిటీ తీసుకపోవడం అన్యాయమన్నారు. సూర్యాపేట రూరల్ పోలీసులు సివిల్‌కు సంబంధించిన వ్యవహారాల్లో పోలీసులు జోక్యం చేసుకోవద్దని ఇదే విధంగా వ్యవహరిస్తే తదుపరి పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. చట్టపరమైన అంశాల్లో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. పోలీసులు, మున్సిపల్ అధికారులు పూర్తిస్థాయి విచారణ చేయకుండా వ్యవహరిస్తున్నారని విమర్శించిన ఆయన, పేద ప్రజలు కష్టపడి నిర్మించుకుంటున్న ఇళ్లపై పరోక్షంగా దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని, అవసరమైతే అన్ని పత్రాలతో ప్రజల ముందుకు వస్తామని స్పష్టం చేశారు.భూవివాదంలో సంబంధం ఉన్న వారందరిపై సమగ్ర విచారణ జరిపి తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వట్టే జానయ్య యాదవ్ డిమాండ్ చేశారు. వజ్రా టౌన్ షిప్ విషయంలో సర్వే నెంబర్లు, డిటిసిపి అన్ని రకాల అనుమతులు ఉన్నాయని మీడియా సమక్షంలో బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మీరు అక్బర్, పట్టణ అధ్యక్షుడు కుంభం నాగరాజు, ఆత్మకూరు మండల పార్టీ అధ్యక్షుడు బొల్లె సైదులు, నేలచర్ల మధు ప్రజాపతి, కుంభం వెంకన్న యాదవ్, వల్లాల సైదులు, మధు, చాప్లా, రాగం లింగయ్య, చింత సైదులు, లింగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# పంట మార్పిడితోనే అధిక దిగుబడి సాధ్యం

ప్రొఫెసర్ మాధవి



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /మే -19(అక్షరం న్యూస్ )
రైతులు భూసార పరీక్ష ఆధారంగా ఎరువుల యాజమాన్యం చేయడం, పప్పు జాతి పంటలతో పంట మార్పిడి, పచ్చిరొట్ట ఎరువుల సాగు ద్వారా అధిక దిగుబడితోపాటు నేల ఆరోగ్యాన్ని కూడా పెంచుకోవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం సిరిసిల్ల వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ పి మాధవి, రైతులకు సూచించారు.మంగళవారం గూడెం గ్రామం లో ఏర్పాటు చేసిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా, డాక్టర్ పి మాధవి మాట్లాడుతూ భూసార పరీక్షలు తోపాటు సాగు నీటి పరీక్ష ప్రతి రైతు చేసుకోవాలని, మట్టి నమూనా ఎలా తీసుకోవాలో వివరించారు. నేల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తూ, బావి తరాలకు సారవంతమైన నేలలను అందించాలని సూచించారు. రైతులకు రైతులు వరి పంటలో సన్న రకాలను సాగు చేయవచ్చని, ఆర్ఎన్ఆర్ 15048, కె ఎన్ ఎం -1638, హెచ్ఎంటి సోనా, జైశ్రీరామ్ వంటి రకాలను సాగు చేయవచ్చు అని రైతులకు డా. ప్రీతిక సూచించారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న వరి రకాలను పండించి అధిక ఆదాయం పొంద వచ్చున్నన్నారు . ఈ కార్యక్రమంలో ఏవో అనూష, ఏఈఓ సౌమ్య, కళాశాల విద్యార్థులు జెన్నీ, త్రిశూల్, మహిళ రైతులు, రైతులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ముస్తాబాద్‌లో ఘనంగా పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి వేడుకలు



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /మే -19(అక్షరం న్యూస్ )
ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, కమ్యూనిస్టు నేత పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి వేడుకలు ముస్తాబాద్ మండల కేంద్రం లో రాజీవ్ గాంధీ చౌక్ వద్ద ఘనంగా నిర్వహించారు.పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలు వేసి నివాళులు అర్పించారుమహిళలు, కార్మికులు పాల్గొని సుందరయ్య అమర్ రహే, ఆశయాలను సాధిద్దాం, పేదల పక్షాన, కార్మికుల పక్షాన వారి సమస్యలు పరిష్కారం కొరకు పోరాడుదాం అని నినాదాలు చేశారుకమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో ప్రధాన భూమిక పోషించిన సుందరయ్య తన జీవితాన్ని ప్రజలకు అంకితమిచ్చిన గొప్ప నాయకుడన్నారు.. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు గీసా బిక్షపతి, మాజీ సర్పంచ్ నల్ల నర్సయ్య, గ్రామపంచాయతీ మండల ప్రధాన కార్యదర్శి పల్నాటి బాబు, గ్రామపంచాయతీ ఇతర కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.


# రైలు నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్ )మే 19: రఘునాథపల్లి-ఇప్పగూడ రైల్వే స్టేషన్ల మధ్య రైలు నుంచి ప్రమాదవశాత్తు కింద పడి సుమారు( 38) సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. మృతదేహాన్ని జనగామ జిల్లా ఆస్పత్రి మార్చురీ లో భద్రపరిచారు. కాజీపేట జీఆర్పి ఎస్ఐ అభినవ్ కథనం ప్రకారం..రఘునాథపల్లి-ఇప్పగూడ రైల్వే స్టేషన్ల మధ్య కిమీ నెం.292/6-4 వద్ద డౌన్ ట్రాక్ లో గుర్తు తెలియని వ్యక్తి తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉన్నదని పాయింట్స్ మెన్ రాజేంద్రప్రసాద్ అధికారులకు సమాచారం ఇవ్వగా, 108లో జనగామ జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి వద్ద ఎటువంటి చిరునామాకు సంబంధించిన గుర్తింపు కార్డు కాని, సెల్ ఫోన్ గాని లభించ లేదు. అతని వద్ద సికింద్రాబాద్ నుండి విజయవాడ వెళ్ళుటకు జనరల్ టికెట్ నెంబర్ ఎపిఇ 66774678 తేది18-5-2026 టైమ్ 22.19 గం టలు అడల్ట్ 3 పేర్: రూ.450 కలదు. మృతుడు 5.6 అడుగుల ఎత్తు, చామన ఛాయ రంగులో ఉన్నాడని, కుడి వైపు మెడపై పుట్టుమచ్చ కలదని, కోల ముఖం, గడ్డం పెరిగి ఉన్నాడని లేత ఆకుపచ్చ గ్రే కలర్ టీ షర్టు. నీలి రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని జీఆర్పి ఎస్ఐ తెలిపారు. ఆచూకి తెలిసిన వారు 8712658609, 8712538630 నెంబర్లకు ఫోన్ చేయాలని కాజీపేట జీఆర్పి ఎస్ఐ అభినవ్ తెలిపారు.

# ఎండలు బాబోయ్

- దంచికొడుతున్న ఎండలు..



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /మే -19(అక్షరం న్యూస్ )

జిల్లాలో ఎండలు మండుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచే భానుడు ప్రతాపం చూపుతున్నాడు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. చాలా మండలాల్లో సోమవారం 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కొన్ని ప్రాంతాలలో రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. ఉదయం 11 గంటల నుంచి 4 వరకూ వ్యాపార సముదాయాలన్నీ మూతపడ్డాయి. ప్రధాన కూడళ్లు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీ లు దాటి నిప్పుల కొలిమిని తలపిస్తున్నాయి. తీవ్రమైన వడగాలులు (హీట్ వేవ్స్ ) వీస్తున్న నేపథ్యంలో వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని అధికారులు హెచ్చరిస్తున్నారువడదెబ్బ నుంచిరక్షణ పొందేందుకు తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించిందివేడిగాలుల ప్రభావం అధికంగా ఉండటంతో ప్రజలు తరచుగా నీరు తాగుతూ శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకోవాలని నిపుణులుసూచిస్తున్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు వచ్చే ఐదు రోజుల పాటు మరింత జాగ్రత్తగా ఉండాలని వైద్యులు చెబుతున్నారు

# మండలంలోని నేడు మెడికల్ షాపుల బంద్

- ఆన్‌లైన్ ఫార్మసీలకు వ్యతిరేకంగా కెమిస్టుల నిరసన..



హన్మకొండ జిల్లా / భీమదేవరపల్లి / మే 19/ అక్షరం న్యూస్ -:

ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ ఇచ్చిన దేశవ్యాప్త 24 గంటల బంద్ పిలుపుకు మద్దతుగా భీమదేవరపల్లి మండలంలోని ఔషధ దుకాణాలు బుధవారం స్వచ్ఛందంగా బంద్ నిర్వహించనున్నట్లు మండల కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న స్థాయి మెడికల్ షాపులు ప్రస్తుతం అనేక సమస్యలను ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ముఖ్యంగా ఆన్‌లైన్ ఫార్మసీల పెరుగుతున్న ప్రభావం మారుతున్న నిబంధనలు తీవ్ర వ్యాపార పోటీ కారణంగా చిన్న కెమిస్టుల జీవనోపాధి సంక్షోభంలో పడుతోందన్నారు. చిన్న వ్యాపారుల హక్కులను పరిరక్షించాలనే ఉద్దేశంతోనే ఈ బంద్‌కు మద్దతు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. మండల ప్రజలు బంద్‌కు సహకరించాలని, అత్యవసర మందులను ముందుగానే కొనుగోలు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బొజ్జపూరి మురళి, మామిడాల రవీందర్, ఉడుత శ్రీనాథ్, వనరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భద్రతే లక్ష్యంగా కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్.. వినోబా నగర్ లెనిన్ నగర్ లో తనిఖీలు





జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 19 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

సమాజంలో జరుగుతున్న నేరాల అదుపునకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నామని గోదావరిఖని 1 టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనా రెడ్డి అన్నారు.

గోదావరిఖని 1 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వినోబా నగర్,రెల్లివాడ,లెనిన్ నగర్ ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం 1 టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి, సరైన పత్రాలు లేని 40 ద్విచక్ర వాహనాల యజమానులకు జరిమానాలు విధించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఈ ప్రాంతంలో ఎక్కువ మంది యువత ఉన్నందున గంజాయి, డ్రగ్స్ మరియు ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు.అలాగే సైబర్ నేరాలు,సైబర్ మోసాలు,ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనుమానాస్పద లింకులను ఓపెన్ చేయవద్దని, ఓటీపీలు,బ్యాంక్ ఖాతా వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని సూచించారు.సోషల్ మీడియా వేదికగా అసభ్యకరమైన సందేశాలు పంపడం, ఫోటోలను మార్ఫింగ్ చేసి అసభ్యకర పోస్టులు పెట్టడం ద్వారా మహిళలు, బాలికలను వేధింపులకు గురి చేసే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.ఇటీవల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో వాటి నియంత్రణకు ప్రతి ఒక్కరూ భద్రతా చర్యలు పాటించాలని తెలిపారు.ప్రతి వాహనదారుడు తన వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపవద్దని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చి రోడ్డుపైకి పంపవద్దని హెచ్చరించారు.వేసవి సెలవుల సందర్భంగా ఊర్లకు వెళ్లే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, విలువైన వస్తువులను ఇంట్లో వదిలివెళ్లవద్దని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.ప్రజల సంరక్షణ,భద్రత కోసం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో గోదావరిఖని వన్‌టౌన్ ఎస్ఐలు రమేష్, మనోహర్,అనూష, ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్ కిరణ్, అంతర్గాం ఎస్ఐ వెంకట స్వామి, స్పెషల్ పార్టీ సిబ్బంది మరియు స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.




# మంచిర్యాల రాజకీయాల్లో ప్రేమ్‌సాగర్ ప్రత్యేక ముద్ర కార్యకర్తలే బలం అభివృద్ధే లక్ష్యం

మంచిర్యాల జిల్లా /మంచిర్యాల /మే 19 /అక్షరం న్యూస్

తెలంగాణ రాజకీయ యవనికపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఆ జిల్లా రాజకీయాలను శాసించగల సమర్థత, బలీయమైన ప్రజాదరణ ఉన్న అతికొద్ది మంది సీనియర్ నాయకులలో కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు ఒకరు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో మంచిర్యాల నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా సాధించిన ఘన విజయం కేవలం ఒక గెలుపు మాత్రమే కాదు... అది ఆయన దశాబ్దాల రాజకీయ పోరాటానికి, ప్రజాబలానికి నిదర్శనం. కాంగ్రెస్ పార్టీతోనే తన రాజకీయ ప్రస్థావన ప్రారంభించిన ప్రేమ్‌సాగర్ రావు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శాసనమండలి సభ్యుడిగా (మీజ) పనిచేసిన అనుభవంతో, జిల్లా వ్యాప్తంగా బలమైన క్యాడర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి సరైన క్యాడర్ లేక, పార్టీ తీవ్ర సంక్షోభంలో ఉన్న తరుణంలో ప్రేమ్‌సాగర్ రావు ఒంటిచేత్తో పార్టీని ముందుకు నడిపించారు. గతంలో జిల్లాలో కాంగ్రెస్‌కు దిక్కులేని పరిస్థితుల్లో భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రను సాగర్ రావు ముందుండి విజయవంతం చేశారు. ఆ సమయంలో జిల్లాలో కాంగ్రెస్ జెండాను మోయడానికి సరైన నాయకులే లేని తరుణంలో, ఉమ్మడి జిల్లాకు ఒకే ఒక్క నాయకుడిగా నిలబడి పార్టీ ఉనికిని కాపాడారు. ఇప్పుడున్న ఎంతో మంది నాయకులు మధ్యలో వచ్చినవారేనని, కష్టకాలంలో పార్టీని బతికించింది మాత్రం ప్రేమ్‌సాగర్ రావేనని జిల్లా కాంగ్రెస్ శ్రేణులు స్పష్టం చేస్తున్నాయి. తెలంగాణ ఏర్పాటు తర్వాత పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు కూడా అధైర్యపడకుండా, క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ జెండాను మోసిన నిరంతర శ్రమ, పట్టుదలకు ఫలితంగానే 2023 ఎన్నికల్లో మంచిర్యాల ప్రజలు ఆయనకు భారీ మెజార్టీతో విజయాన్ని అందించి, ప్రజా పురస్కారం కట్టబెట్టారు.

?అయితే, దశాబ్దాలుగా పార్టీని నమ్ముకుని, కష్టకాలంలో అండగా నిలిచిన ప్రేమ్‌సాగర్ రావు లాంటి సీనియర్, విధేయత కలిగిన నాయకుడిని కాంగ్రెస్ అధిష్టానం సరైన రీతిలో గుర్తించకపోవడంపై ఉమ్మడి జిల్లా కార్యకర్తల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. స్వార్థ ప్రయోజనాల కోసం గతంలో పార్టీలు మార్చి, అధికారంలోకి వచ్చే సమయంలో మధ్యలో చేరిన వారికి అయాచితంగా మంత్రి పదవులు కట్టబెట్టడంపై క్షేత్రస్థాయి క్యాడర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. మొదటి నుండి పార్టీని పట్టుకుని ఉన్న ప్రేమ్‌సాగర్ రావుకు క్యాబినెట్ ర్యాంక్ మంత్రి పదవి ఇవ్వకుండా, కేవలం రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ (ఝొతీవప్త్రశీబంఱఅస్త్ర జశీతీజూశీతీష్ఱశీఅ) చైర్మన్ పదవి ఇవ్వడం ఆయన సీనియారిటీని అవమానించడమేనని కార్యకర్తలు భావిస్తున్నారు. అందుకే తనను నమ్ముకున్న కార్యకర్తల ఆత్మగౌరవం కోసం, జిల్లా ప్రయోజనాల కోసం ఆయన ఆ గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ పదవిని సైతం నిరాకరించి, వదిలేసుకున్నారు. ప్రేమ్‌సాగర్ రావు కష్టాన్ని, జిల్లాలో ఆయనకున్న తిరుగులేని పట్టును గుర్తించి ఆయనకు తక్షణమే మంత్రి పదవి ఇవ్వాలని ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. ఒకవేళ అధిష్టానం ఇప్పటికైనా కళ్ళు తెరిచి సాగర్ రావుకు తగిన గుర్తింపు ఇవ్వకుంటే, రాబోయే రోజుల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి గడ్డుకాలం తప్పదని పలువురు రాజకీయ విశ్లేషకులు, సీనియర్ కార్యకర్తలు బహిరంగంగానే అభిప్రాయపడుతున్నారు.?ప్రేమ్‌సాగర్ రావు రాజకీయ శైలి ఎప్పుడూ నిఖార్సైన 'క్యాడర్-ఫస్ట్' సిద్ధాంతాన్ని నమ్మేలా ఉంటుంది. పార్టీల నుండి వలస వచ్చే నాయకుల కంటే, కష్టకాలంలో పార్టీని నమ్ముకుని జెండా మోసిన సామాన్య కార్యకర్తకే ప్రథమ ప్రాధాన్యత దక్కాలనేది ఆయన గట్టి నమ్మకం. "పార్టీ కోసం రక్తం, చెమట చిందించిన సామాన్య కార్యకర్తకు అన్యాయం జరిగితే సహించేది లేదు" అని అధిష్టానం ముందే కుండబద్దలు కొట్టిన చరిత్ర ఆయనది. ఈ గుణమే ఆయనను కార్యకర్తల గుండెల్లో 'అన్న'గా నిలిపింది. కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా, సమాజం నైతికంగా బలోపేతం కావాలనే ఉద్దేశంతో ఆయన మద్యపాన నియంత్రణపై కఠిన వైఖరిని ప్రదర్శిస్తున్నారు. మంచిర్యాల నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలు మద్యపానానికి దూరంగా ఉండాలని స్పష్టం చేస్తూ, అవసరమైతే మద్యం అలవాటు ఉన్నవారికి పదవులు, టికెట్లు కూడా నిరాకరిస్తామని హెచ్చరించి రాజకీయాల్లో సరికొత్త సంచలనం సృష్టించారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండి, సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలనేదే ఆయన తపన.



?ప్రస్తుతం మంచిర్యాల నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే ధ్యేయంగా ఆయన అహర్నిశలు శ్రమిస్తున్నారు. రోడ్ల విస్తరణ, మౌలిక వసతుల కల్పన, తాగునీటి సమస్యల పరిష్కారం, పట్టణాల సుందరీకరణపై అధికారులతో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ ప్రజా సమస్యల త్వరితగతిన పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ముఖ్యంగా లక్సెట్టిపేట మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి, నిధుల సాధన కోసం స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ప్రజల మధ్య నిత్యం ఉండే నాయకుడిగా గుర్తింపు పొందిన ప్రేమ్‌సాగర్ రావుకు, నియోజకవర్గ ప్రజలకు మధ్య ఎలాంటి దళారీ వ్యవస్థ ఉండదు. నియోజకవర్గంలో ఏ చిన్న సామాజిక కార్యక్రమం జరిగినా, సామాన్యుడి ఇంట్లో పెళ్లి జరిగినా ఆయన స్వయంగా హాజరవుతారు. ఆయన వాక్చాతుర్యం, సూటిగా మాట్లాడే తీరు, కార్యకర్త కష్టంలో ఉన్నప్పుడు కొండంత అండగా నిలబడే తత్వం ఆయనను లీడర్ల లీడర్‌గా మార్చాయి. మంచిర్యాల నియోజకవర్గ భవిష్యత్తును సరికొత్తగా లిఖిస్తూ, ప్రజాసేవలో సరికొత్త అధ్యాయాన్ని ఆవిష్కరిస్తున్న ప్రేమ్‌సాగర్ రావుకు దక్కాల్సిన అత్యున్నత గౌరవం దక్కినప్పుడే పార్టీకి శ్రీరామరక్ష అని క్యాడర్ గట్టిగా నమ్ముతోంది.

## అక్రమ పశువుల రవాణాపై ఉక్కుపాదం.. శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి: మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్



?మంచిర్యాల జిల్లా /మంచిర్యాల /మే 19 /అక్షరం న్యూస్–
అక్రమ పశువుల రవాణాపై ఉక్కుపాదం మోపుతామని మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ స్పష్టం చేశారు. మంగళవారం మంచిర్యాల డీసీపీ కార్యాలయంలో రాబోయే బక్రీద్ పండుగ నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ, అక్రమ పశువుల రవాణా నియంత్రణ మరియు ప్రభుత్వ నిబంధనల అమలుపై స్లాటర్ హౌస్ నిర్వాహకులతో ఆయన ఒక ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. బక్రీద్ పండుగను జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. పశువుల కొనుగోలు, రవాణా మరియు వధ ప్రక్రియల్లో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను, కోర్టు మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. రవాణా సమయంలో జంతువుల పట్ల క్రూరత్వంగా వ్యవహరించకుండా, వాటికి సరైన సంరక్షణ కల్పిస్తూ మానవత్వంతో వ్యవహరించాలని, వాహనాల్లో పరిమితికి మించి అధిక సంఖ్యలో పశువులను ఎక్కించరాదని నిర్వాహకులకు గట్టిగా సూచించారు. క్షేత్రస్థాయిలో తనిఖీల సమయంలో పోలీస్, వెటర్నరీ (పశువైద్య), రవాణా శాఖ అధికారులకు పూర్తి సమాచారంతో సహకరించాలని, చెల్లుబాటు అయ్యే అధికారిక పత్రాలు లేకుండా నకిలీ లేదా చెల్లని వెటర్నరీ సర్టిఫికెట్లను ఉపయోగిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.
?అదేవిధంగా ప్రభుత్వ అనుమతి లేని ప్రదేశాల్లో జంతువుల వధ చేయడం, బహిరంగ ప్రదేశాల్లో మాంసం విక్రయాలు జరపడం, ప్రజలకు అసౌకర్యం కలిగించే విధంగా వ్యవహరించడం చట్టరీత్యా నేరమని డీసీపీ ఏ. భాస్కర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా పండుగ సీజన్‌లో సోషల్ మీడియా వేదికలపై మతపరమైన ఉద్రిక్తతలకు దారితీసే విధంగా ఎలాంటి వివాదాస్పద పోస్టులు, వీడియోలు, ఫోటోలు షేర్ చేయవద్దని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమన్వయ సమావేశంలో బెల్లంపల్లి రూరల్ ఇన్స్పెక్టర్ హనూక్, మంచిర్యాల పట్టణ ఇన్స్పెక్టర్ ప్రమోద్ రావు, శ్రీరాంపూర్ సీఐ అశోక్ కుమార్, జైపూర్ సీఐ నవీన్, బెల్లంపల్లి టౌన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, మందమర్రి సీఐ పర్స రమేష్, తాండూర్ సీఐ దేవయ్యలతో పాటు పలువురు ఎస్ఐలు, స్లాటర్ హౌస్ నిర్వాహకులు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సరస్వతి నది అంత్య పుష్కరాల నేపథ్యంలో ట్రాఫిక్ ఏర్పాట్లపై మంచిర్యాల డీసీపీ క్షేత్రస్థాయి పరిశీలన



మంచిర్యాల జిల్లా /చెన్నూరు,జైపూర్ /మే 19 /అక్షరం న్యూస్–
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న కాళేశ్వరం సరస్వతి నది అంత్య పుష్కరాల నేపథ్యంలో భక్తుల రాకపోకలకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్ మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించి, ట్రాఫిక్ సమస్యలు ఏర్పడే అవకాశం ఉన్న ప్రధాన రహదారులు, జంక్షన్లు, వంతెనలను జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు మరియు ఇతర పోలీస్ అధికారులతో కలిసి సందర్శించి పరిశీలించారు. మే 21వ తేదీ ఉదయం నుండి 12 రోజుల పాటు కాళేశ్వరం సరస్వతి నది తీరంలో ఈ అంత్య పుష్కరాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. పుష్కరాల నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుండి కూడా జైపూర్, భీమారం, చెన్నూర్ మార్గాల మీదుగా భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని, అందుకే ఈ మార్గాల్లో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారుదభారీగా తరలివచ్చే భక్తుల వాహనాల రద్దీని తట్టుకునేలా, రాకపోకలు సజావుగా సాగేందుకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, భద్రతా చర్యలు మరియు అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించే విధివిధానాలపై డీసీపీ ఏ.భాస్కర్ అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. పుష్కరాల ముగింపు వరకు ప్రజలకు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ నిర్వహణను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని, ఎక్కడికక్కడ అప్రమత్తంగా ఉంటూ శాంతిభద్రతలను కాపాడాలని సంబంధిత పోలీస్ అధికారులకు డీసీపీ కఠిన ఆదేశాలు జారీ చేశారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలన పర్యటనలో డీసీపీ వెంట జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, కోటపల్లి ఎస్సై రాజశేఖర్, భీమారం ఎస్సై రాజేందర్ మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రాజాపేట మండల సి.ఎం.రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**• 31 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత.**



యాదాద్రి భువనగిరి జిల్లా/యాదగిరిగుట్ట/మే 19 : అక్షరం న్యూస్ – :
: యాదగిరిగుట్టలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య రాజాపేట మండలానికి చెందిన 31 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ "పేద ప్రజలకు వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరం. అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా సి ఎం ఆర్ ఎఫ్ అందేలా చూస్తున్నాం. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి అండగా ప్రభుత్వం ఉంటుంది" అని అన్నారు.లబ్ధిదారులు ఎమ్మెల్యే , రాష్ట్ర ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. లబ్ధిదారులు ఉన్న గ్రామాలు:పరుపల్లి, నెమిల, సింగారం, జాల సింగారం, పుట్టగూడెం, బేగంపేట, కుర్రారం, చల్లూరు, టౌన్, బొందుగుల, కొండ్రెడ్డి చెరువు, కాసగూడెం, పాముకుంట, కల్వపల్లి, రేణికుంట, దూది వెంకటాపురం తదితర గ్రామాలకు చెందిన వారికి చెక్కులు అందజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పర్యావరణపై ప్రజల్లో చైతన్యం రావాలి




పెద్దపల్లి జిల్లా/ పెద్దపల్లి రూరల్/ మే 19/ అక్షరం న్యూస్ –:పర్యావరణం పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం రావాలనిజాతీయ హరిత దళం జిల్లా కో ఆర్డినేటర్ గూళ్ళ అంజన్ కుమార్ తెలిపారు. 99 రోజుల పర్యావరణ అవగాహన కార్యక్రమంలో భాగంగా లక్ష్యంతో కూడిన వేసవి శిబిరం పెద్దపెల్లి మండలం అప్పన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో తెలంగాణ జాతీయ హరిత దళం సహకారంతో 99 రోజుల పర్యావరణ అవగాహన కార్యక్రమంలో భాగంగా లక్ష్యంతో కూడిన వేసవి శిబిరం ఘనంగా నిర్వహించారు. రక్షించడం– సంరక్షించడం– ప్రోత్సహించడం అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో స్థానిక పర్యావరణ సమస్యలపై చర్చలు నిర్వహించారు. ఉపరితల, భూగర్భ జలాల కొరత, జల వనరుల కాలుష్యం, గాలి కాలుష్యం, వ్యర్థాల నిర్వహణ సమస్యలు, ప్లాస్టిక్ కాలుష్యం, పరిశుభ్రత లోపం, పచ్చదనం తగ్గిపోవడం వంటి అంశాలపై అంజన్ కుమార్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో పర్యావరణ చైతన్యం పెంపొందించేందుకు స్కిట్స్, డ్యాన్స్ కార్యక్రమాలు నిర్వహించగా యోగా, డ్రాయింగ్ పోటీలు ఏర్పాటు చేశారు. పోటీలలో విజేతలైన విద్యార్థులకు పెద్దపల్లి జిల్లా విద్యాధికారి జి. శారద గారు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ పిఎం. షేక్, వేసవి శిబిరం పీఎం, ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం, జీవశాస్త్ర ఉపాధ్యాయులు శ్రీనివాస్, సురేందర్, వంగ అశోక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో తాము భాగస్వాములు అవుతామని ప్రతిజ్ఞ చేశారు.

# వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





మంచిర్యాల జిల్లా /మంచిర్యాల /మే 19 /అక్షరం న్యూస్–
జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను, రైస్ మిల్లర్లను ఆదేశించారు. మంగళవారం జిల్లాలోని పలు మండలాల్లో కలెక్టర్ విస్తృతంగా పర్యటించి ధాన్యం కొనుగోలు, నిల్వ, తరలింపు ప్రక్రియలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హాజీపూర్ మండలం సబ్బపల్లిలోని గోదాము, నస్పూర్ మండల కేంద్రంలోని గోదాముతో పాటు లక్సెట్టిపేట మండలం గుల్లకోటలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రం, వెంకట్రావుపేటలోని గోదాము, లక్ష్మీపూర్ పరిధిలోని రైస్ మిల్లులను కలెక్టర్ సందర్శించారు. ఈ తనిఖీల్లో లక్సెట్టిపేట తహసిల్దార్ దిలీప్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం దండేపల్లి మండలం కన్నేపల్లిలోని రైస్ మిల్లును తహసిల్దార్ రోహిత్ దేశ్ పాండే, ఎంపీడీఓ ప్రసాద్‌లతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం మద్దతు ధర చెల్లించి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తోందని గుర్తుచేశారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించడంతో పాటు గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు, తేమ కొలిచే యంత్రాలు, ప్యాడి క్లీనర్లను అందుబాటులో ఉంచాలని నిర్వాహకులను ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా, సేకరించిన ధాన్యాన్ని కేటాయించిన నిబంధనల ప్రకారం వెంటనే రైస్ మిల్లులకు, గోదాములకు తరలించాలని స్పష్టం చేశారు.

?అదేవిధంగా అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా లారీల ద్వారా తరలిస్తున్న తరుణంలో, రైస్ మిల్లుల నిర్వాహకులు ధాన్యం దిగుమతిని అత్యంత వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. జైపూర్ మండలం ఇందారంలోని సుముఖ గోదాము, జయలక్ష్మి రైస్ మిల్లులను స్థానిక తహసిల్దార్ వనజా రెడ్డితో కలిసి ఆయన సందర్శించారు. మిల్లుల వద్ద ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియ ఆలస్యం కాకుండా అవసరమైన మేరకు హమాలీల సంఖ్యను పెంచుకోవాలని, రోజుకు కనీసం 10 నుండి 15 లారీల ధాన్యాన్ని దిగుమతి చేసుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రైస్ మిల్లర్లు సీఎంఆర్ (కస్టం మిల్లింగ్ రైస్) ప్రక్రియను వెంటనే ప్రారంభించి, తమకు కేటాయించిన నిర్దేశిత లక్ష్యాలను అధికారుల సమన్వయంతో సకాలంలో పూర్తి చేయాలన్నారు. లారీల యజమానులు ధాన్యం రవాణాలో ఖచ్చితమైన నిబంధనలు పాటించాలని, గోదాములకు చేరిన ధాన్యాన్ని పద్ధతి ప్రకారం నిల్వ చేసి, తదుపరి ఆదేశాల మేరకు రవాణాకు సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ పర్యటనల్లో ఆయా మండలాల తహసిల్దార్లు, రెవెన్యూ, పౌరసరఫరాల శాఖల అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# హజ్ యాత్రికులకు శుభాకాంక్షలు తెలిపిన వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహ్మద్ అయూబ్






హైదరాబాద్ / మే 19 / అక్షరం న్యూస్ –:
పవిత్ర హజ్ యాత్రను పురస్కరించుకొని నేడు హైదరాబాదు నుండి ముస్లింలు ఆధ్యాత్మిక యాత్ర కు బయలుదేరుతున్న హజ్ యాత్రికులకు శుభాకాంక్షలు తెలుపుతూ వారు తెలంగాణ హజ్ హౌస్ నుండి బయలుదేరి శంషాబాద్ ఎయిర్పోర్టుకు చేరుకోవడం జరుగుతుంది అని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహ్మద్ అయూబ్ అన్నారు. అక్కడ నుండి ప్రత్యేక విమానంలో మక్కా మదీనాకు చేరుకుంటారు అని ఈనెల 27న పవిత్ర హజ్ యాత్రను పురస్కరించుకొని మంగళవారం హైదరాబాదు నుండి ఆధ్యాత్మిక యాత్ర కు బయలుదేరుతున్న హజ్ యాత్రికులకు శుభాకాంక్షలు తెలుపుతూ వారు తెలంగాణ హజ్ హౌస్ నుండి బయలుదేరి శంషాబాద్ ఎయిర్పోర్టుకు చేరుకోవడం జరుగుతుంది అని ఆయన అన్నారు. అక్కడ నుండి ప్రత్యేక విమానంలో మక్కా, మదీనాకు చేరుకుంటారు. ఈనెల 27న హజ్ యాత్ర జరిగే సందర్భంగా వారందరికీ తెలంగాణ గవర్నమెంట్ తరఫున శుభాకాంక్షలు చెబుతూ రాష్ట్రం మరియు దేశం సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేయవలసిందిగా కోరడం జరిగినది అని ఆయన అన్నారు. హజ్ యాత్రికులకు అవకాశం కల్పించిన అల్లాను భారతదేశం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ మరి ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హజ్ యాత్రికులకు ఎన్నో సదుపాయాలు ఏర్పాటు చేసినందుకు వారికోసం ప్రత్యేకమైన ప్రార్థనలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కై అ అల్లాను ప్రార్థించ వలసిందిగా హజ్ యాత్రికులకు వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొహమ్మద్ అయూబ్ కోరడం జరిగినది. యాత్ర జరిగిన సందర్భంగా వారందరికీ తెలంగాణ గవర్నమెంట్ తరఫున శుభాకాంక్షలు చెబుతూ రాష్ట్రం మరియు దేశం సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేయవలసిందిగా ఆయన కోరడం జరిగినది అని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొహమ్మద్ అయూబ్ కోరడం జరిగినది.

# రూ.21.49 లక్షల విలువైన నకిలీ వరి విత్తనాల పట్టివేత

# అంతర్రాష్ట్ర ముఠా గుట్టురట్టు చేసిన కోటపల్లి పోలీసులు





మంచిర్యాల జిల్లా /కోటపల్లి /మే 19 /అక్షరం న్యూస్-
?నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి అనుమతులు లేకుండా లారీలో తరలిస్తున్న సుమారు రూ.21,49,000 విలువైన నకిలీ వరి విత్తనాలను కోటపల్లి పోలీసులు పట్టుకున్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రాపన్‌పల్లి అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద నిర్వహించిన వాహనాల తనిఖీల్లో సుమారు 30,700 కిలోల (30.7 టన్నులు) అక్రమ విత్తన లోడుతో వెళ్తున్న లారీ పట్టుబడగా, ఈ అంతర్రాష్ట్ర ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను జైపూర్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ) ఏ.వెంకటేశ్వర్లు మంగళవారం ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో మీడియాకు వెల్లడించారు. కోటపల్లి మండల వ్యవసాయ అధికారి (ఏఓ) సాయి కృష్ణ రెడ్డి ఇచ్చిన ముందస్తు సమాచారం, ఫిర్యాదు మేరకు కోటపల్లి ఎస్సై ఆధ్వర్యంలో రాపన్‌పల్లి చెక్‌పోస్ట్ వద్ద విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో మహారాష్ట్రలోని సిరోంచా ప్రాంతం నుంచి తెలంగాణలోని మనకొండూర్ వైపు వెళ్తున్న యూ-29 ఎదీ-6555 నంబర్ గల లారీని ఆపి తనిఖీ చేయగా ఈ భారీ అక్రమ రవాణా వెలుగుచూసింది. లారీలో లోడ్ చేసి ఉన్న వరి విత్తనాల బస్తాలకు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు, అధికారిక లేబుల్స్, ధృవీకరణ పత్రాలు (సర్టిఫికెట్లు), బిల్లులు లేవని అధికారులు గుర్తించారు. విత్తనాల ప్యాకింగ్ కూడా చట్టబద్ధంగా లేకపోవడంతో, వాటిని సీడ్స్ యాక్ట్-1966, సీడ్ కంట్రోల్ ఆర్డర్-1983 నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్నట్లు నిర్ధారించి సీజ్ చేశారు. ఈ విత్తనాల నాణ్యతను పరిశీలించేందుకు నమూనాలను (శాంపిల్స్) హైదరాబాద్‌లోని ప్రభుత్వ అనుమతి పొందిన డీఎన్ఏ ఎఫ్‌పీ డ టీసీఎం ల్యాబ్‌కు పంపినట్లు ఏసీపీ తెలిపారు.

?ఈ అక్రమ ఒరవాణా ఘటనలో ఒనిబంధనలు ఉల్లంఘించిన లారీ డ్రైవర్ కట్ల భద్రయ్య, సీడ్ ఆర్గనైజర్ నిమ్మటి సతీష్, సోనం సీడ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ జీఎన్‌వీ రామకృష్ణ, లారీ యజమాని పోలవేని రాజేష్ అనే నలుగురు వ్యక్తులపై కోటపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ పేర్కొన్నారు. కేవలం లాభార్జనే ధ్యేయంగా నకిలీ, అనుమతులు లేని విత్తనాలను రైతులకు విక్రయించి మోసం చేయాలని చూస్తే ఎంతటి వారిపైనైనా కఠిన చర్యలు తప్పవని ఏసీపీ ఏ. వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఇలాంటి నకిలీ విత్తనాల వల్ల పంటలు పండక రైతులు తీవ్ర ఆర్థిక నష్టాల్లో కూరుకుపోయి, చివరకు ఆత్మహత్యలకు పాల్పడే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని, కేవలం ప్రభుత్వ గుర్తింపు పొందిన డీలర్ల వద్ద ధృవీకరించబడిన (సర్టిఫైడ్) విత్తనాలను మాత్రమే కొనుగోలు చేసి, తప్పనిసరిగా రసీదులు (బిల్లులు) తీసుకోవాలని సూచించారు. ఈ పత్రికా సమావేశంలో ఏసీపీతో పాటు చెన్నూర్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆర్. కృష్ణ, కోటపల్లి సబ్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, మండల వ్యవసాయ అధికారి (ఏఓ) సాయి కృష్ణ రెడ్డి మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కార్మిక సమస్యల పరిష్కారంలో

# గుర్తింపు సంఘం విఫలం



- కార్మికుల హక్కులను కాలరాస్తున్న ఏఐటీయూసీ.
- ఐ.ఎన్.టి.యు.సి నేత రజాక్.

భద్రాద్రి కొత్తగూడెం/ కొత్తగూడెం/ మే 19/ అక్షరం న్యూస్
ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు కొత్తగూడెం ఏరియా రుద్రంపూర్ లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఏరియా ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రజాక్ మాట్లాడుతూ సింగరేణి కార్మికులకు అనేక హామీలు ఇచ్చి ఇప్పటివరకు ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా కార్మికులను మభ్యపెడుతున్నటువంటి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు అని మాట్లాడారు. సింగరేణిలో ఏఐటీయూసీ గెలిచిన తర్వాత సింగరేణి యాజమాన్యం కార్మిక వర్గానికి నష్టం జరిగే ఎటువంటి ఏ సర్కులర్ వచ్చినప్పటికీ గుర్తింపు సంఘం యాజమాన్యంతో మాట్లాడకపోవడంపై గుర్తింపు సంఘం పూర్తిగా విఫలమైందని గుర్తింపు సంఘం నాయకులు కేవలం వాళ్ల అస్తిత్వం కోసం మాత్రమే కార్మికులను మభ్యపెడుతున్నారని ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్ మండిపడ్డారు. సింగరేణి సంస్థలో గతంలో ఎన్నడు లేని విధంగా సుదీర్ఘకాలంగా అండర్ గ్రౌండ్ మైన్ లో పనిచేసినటువంటి ఉద్యోగులను వాళ్ల సీనియార్టీ ప్రకారం సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్ గా అదే ఏరియాలో సర్దుబాటు చేసే ప్రక్రియ ఉండేదని , ఇప్పుడు యాజమాన్యం కార్మిక వర్గానికి నష్టం చేకూరే విధంగా వివిధ ఏరియాలను కలిపి సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్స్ నియామకం చేపట్టడం వల్ల ఏరియాలో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపించారు. అదేవిధంగా గతంలో సరిగ్గా విధులకు హాజరుకాని ఉద్యోగులను , వారి కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సిలింగ్ ఇప్పించి విధులకు హాజరయ్యే విధంగా చూసేవారని , కానీ ఇప్పుడు ఎలాంటి కౌన్సిలింగ్ లేకుండా విధులకు హాజరుకాని ఉద్యోగులకు 150 మాస్టర్లు ఉండాలని నిబంధనల సర్కులర్ రావడం , మాస్టర్లు పూర్తికాని ఉద్యోగుల ఇంక్రిమెంట్ కోత విధానం లాంటి కార్మికులకు నష్టం జరిగే విధానాలను యాజమాన్యం ప్రవేశపెట్టినప్పటికీ చోద్యం చూస్తున్న ఏఐటీయూసీ గుర్తింపు సంఘం నాయకులు అని మాట్లాడారు. కార్మిక వర్గం గుర్తింపు సంఘం చేసే ప్రతి పనిని గమనిస్తుందని భవిష్యత్తులో జరిగే గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటియుసి యూనియన్ నాయకులకు కార్మిక వర్గం తగిన బుద్ధి చెబుతుందని తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డ్ చైర్మన్ , ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సహాయ సహకారాలతో సింగరేణి యాజమాన్యంపై ఒత్తిడి తీసుకొచ్చి మెడికల్ బోర్డు నిర్వహణ , సింగరేణిలో నూతన బొగ్గు గనులు , సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్నటువంటి మారు పేర్లు సమస్య పరిష్కరిస్తామని ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టియుసి సెంట్రల్ కమిటీ నాయకులు, బ్రాంచ్ కమిటీ నాయకులు, ఫిట్ కమిటీ నాయకులు, వివిధ కమిటీల నాయకులు కార్యకర్తలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్స్ చెక్స్

# పంపిణీ చేసిన ఎమ్మెల్యే బీర్ల



యాదాద్రి భువనగిరి జిల్లా / యాదగిరిగుట్ట /మే 19 : అక్షరం న్యూస్ : తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలనకు కొత్త అర్థం తీసుకొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, నాయకత్వంలో ప్రతి సంక్షేమ పథకాన్ని పారదర్శకంగా ప్రజలకు అందిస్తోంది. మధ్యవర్తులు, పైరవీలు, కమిషన్లకు తావులేకుండా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సహాయం నేరుగా అందేలా చర్యలు కొనసాగుతున్నాయి. పెన్షన్, రేషన్ కార్డు, సీఎం రిలీఫ్ ఫండ్, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాల కోసం ఎవరైనా డబ్బులు అడిగినా, కిరాయిల పేరుతో ఇబ్బంది పెట్టినా వెంటనే అధికారులకు లేదా ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. "ఇది ప్రజల ప్రభుత్వం...మీ హక్కు మీ చేతికే చేరే ప్రభుత్వం. లక్షల రూపాయల సహాయం అందిస్తున్న ప్రభుత్వం, మధ్యలో ఎవరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరం లేదు. ప్రజల కష్టాలు తెలుసుకుని సేవ చేయడమే మా లక్ష్యం" అని పేర్కొన్నారు. ప్రతి పేద కుటుంబానికి అండగా నిలుస్తూ, పారదర్శక పాలనతో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు...

## ఇంచార్జ్ సర్పంచ్ మాట్ల హరికుమార్‌కు ఘన సన్మానం



హన్మకొండ జిల్లా / భీమదేవరపల్లి / మే19 / అక్షరం న్యూస్ -:
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముత్తారం గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ముత్తారం ఇంచార్జ్ సర్పంచ్ మాట్ల హరికుమార్‌ను మండల విలేకరులు ఘనంగా సన్మానించారు. పాత్రికేయ రంగంలో విశేష సేవలందించిన హరికుమార్ ప్రస్తుతం ఇంచార్జ్ సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారని పలువురు కొనియాడారు. గ్రామ సర్పంచ్ పర్యటనలో ఉన్న సమయంలో బాధ్యతలు చేపట్టిన ఆయన గ్రామాభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల విలేకరులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ప్రజా సమస్యలపై అవగాహనతో పాటు సేవాభావం కలిగిన వ్యక్తి నాయకత్వంలో గ్రామాభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల విలేకరులు, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు..ఆధునిక సాగుపై అవగాహన



హన్మకొండ జిల్లా / భీమదేవరపల్లి / మే 19 / అక్షరం న్యూస్ -:
ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వ్యవసాయ కళాశాల, వరంగల్ వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం మంగళవారం గట్ల నర్సింగపూర్ గ్రామంలో నిర్వహించారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పంటల యాజమాన్యంపై శాస్త్రీయ అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడింది.

ఈ సందర్భంగా డా. కోట శివకృష్ణ (అసిస్టెంట్ ప్రొఫెసర్) మాట్లాడుతూ తక్కువ యూరియా వినియోగం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. పంట మార్పిడి విధానం పాటించడం వల్ల దిగుబడులు పెరగడంతో పాటు భూసారం మెరుగుపడుతుందని వివరించారు. సమర్థవంతమైన నీటి యాజమాన్య పద్ధతులు సేంద్రియ వ్యవసాయం ప్రయోజనాలు భూసారం పెంపు కోసం చేపట్టాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఇఆర్.జి.ప్రజ్ఞ (అసిస్టెంట్ ప్రొఫెసర్, వ్యవసాయ ఇంజనీరింగ్ విభాగం) మాట్లాడుతూ వ్యవసాయంలో ఉపయోగిస్తున్న ఆధునిక యంత్రాల వినియోగం వాటి ప్రయోజనాలపై వివరించారు.

మండల వ్యవసాయ అధికారి పద్మ మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఆమోదించిన సన్న రకం వరి వంగడాలను రాబోయే ఖరీఫ్ సీజన్‌లో సాగు చేయాలని రైతులకు సూచించారు. గ్రామ సర్పంచ్ అజయ్ కుమార్ మాట్లాడుతూ శాస్త్రవేత్తలు సూచించిన సాంకేతిక పద్ధతులను రైతులు ఆచరణలో పెట్టి అధిక దిగుబడులు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శైలజ, ఉపసర్పంచ్ శ్రీనివాస్, కుమార్,వార్డు సభ్యులు అమర్, ఐలయ్య,వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఎల్.వైష్ణవి,పి. తిరుమలేష్,రైతులు స్వామీరావు, హరికృష్ణ,లింగరావు, సంపత్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తండ రవి గౌడ్ గుండెపోటుతో మృతిచెందడం తీవ్ర విషాదకరం.

యాదాద్రి భువనగిరి జిల్లా / యాదగిరిగుట్ట / మే 19 : అక్షరం న్యూస్ -: ఆత్మకూరు మండలం రేగులకుంట గ్రామానికి చెందిన తండ రవి గౌడ్ గుండెపోటుతో మృతిచెందడం తీవ్ర విషాదకరం. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య రేగులకుంట గ్రామానికి చేరుకొని తండ రవి గౌడ్ పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. తండ రవి గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు



## ఎబోలాపై అప్రమత్తమైన భారత్

### ప్రజలకు హెచ్చరిక చేసిన అధికారులు

న్యూఢిల్లీ,మే19 ఆఫ్రికాలోని కాంగో, ఉగాండా సహా పలు దేశాల్లో ఎబోలా వైరస్ వేగంగా విజృంభిస్తోంది. ఈ ప్రాణాంతక వ్యాధి కారణంగా ఇప్పటికే 100 మంది మృతి చెందారు. 390 అనుమానిత కేసులు నమోదైనట్లు అధికారులు తెలిపారు. కాంగోలోని ఆరుగురు అమెరికన్లకు ఈ వ్యాధి సోకినట్లు పేర్కొన్నారు. వీరిని క్వారంటైన్ కోసం సురక్షిత ప్రదేశానికి తరలించేందుకు అమెరికా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ఎబోలా వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో భారత్ అప్రమత్తమైంది. ఎబోలా వ్యాప్తిని జాతీయ వ్యాధి నియంత్రణ కేంద్రం (ఎన్‌సీడీసీ) నిశితంగా గమనిస్తోందని, దేశంలోకి ఈ వ్యాధి ప్రవేశించ కుండా నిఘా పెట్టిందని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ప్రస్తుతం దేశంలో ఎబోలా వ్యాప్తి లేనప్పటికీ అంతర్జాతీయ ప్రయాణాలు, ప్రపంచ అనుసంధానం కారణంగా భారత్ అంటువ్యాధుల ముప్పు పట్ల అప్రమత్తంగా ఉండాలని దిల్లీలోని ఎయిమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ సంజయ్ రాయ్ హెచ్చరించారు. ప్రస్తుతం దేశానికి ఎబోలా ముప్పు తక్కువగానే ఉందని, ఈ వ్యాధి వ్యాప్తిపై ఆందోళన చెందాల్సి అవసరం లేదని ఆయన సూచించారు.

## ఆదానీపై అమెరికాలో కేసులు కొట్టివేత

### ఆధారాలు లేవని తేల్చిన న్యాయశాఖ

న్యూయార్క్,మే19 అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ, ఆయన మేనల్లుడు సాగర్ అదానీలపై ఉన్న కేసులను అమెరికా న్యాయ శాఖ పూర్తిగా కొట్టివేసింది. యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఈసీ) సహా పలు ఏజెన్సీలు ఈ కేసులను కొట్టివేశాయి. ఈ కేసులో ఎలాంటి ఆధారాలు లేవని, లంచాలు ఇచ్చినట్లుగా కూడా రుజువులు లేవని తేల్చింది. భారతదేశంలో ఒక సోలార్ పవర్ అమ్మకాల కాంట్రాక్టును గెలుచుకోవడానికి రూ. 2,000 కోట్లకు పైగా లంచాలు ఇచ్చారని, అలాగే పలు దశల్లో అమెరికన్ పెట్టుబడిదారుల నుంచి డబ్బు వసూలు చేశారని అదానీపై అమెరికాలో కేసులు నమోదయ్యాయి. అమెరికాలో ఇటువంటి ఆరోపణలను పూర్తిగా కొట్టివేయడం ఒక అసాధారణ చర్య అని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఎస్ఈసీ దాఖలు చేసిన కేసును పరిష్కరించుకోవడానికి అదానీ 6 మిలియన్ డాలర్లు చెల్లించడానికి అంగీకరించినట్లు కోర్టు పత్రాలు చూపిస్తున్నాయి. సాగర్ అదానీ కూడా 12 మిలియన్ డాలర్లు చెల్లించడానికి అంగీకరించారు. తఎల్‌పీజీ దిగుమతులకు సంబంధించి ఇరాన్‌పై అమెరికా విధించిన ఆంక్షలను అదానీ గ్రూప్ ఉల్లంఘించిందని ఆరోపిస్తూ యూఎస్ ట్రెజరీ డిపార్ట్‌మెంట్ యొక్క ఆఫీస్ ఆఫ్ ఫారిన్ అసెట్స్ కంట్రోల్ (ఓఎఫ్ఏసి) దాఖలు చేసిన కేసు కూడా పరిష్కరించబడింది. ఈ ఒప్పందం 275 మిలియన్ డాలర్లకు కుదిరింది. అదానీ గ్రీన్ ఎనర్జీ మరియు అమెరికాకు చెందిన అజూర్ కంపెనీ, తమ సౌర విద్యుత్‌ను కొనుగోలు చేయడానికి కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈసీఐ) తో ఒక ఒప్పందం కుదుర్చుకున్నాయి. రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు ఎస్ఈసీఐ నుంచే విద్యుత్‌ను కొనుగోలు చేసేలా ప్రభావితం చేయడానికి గౌతమ్ అదానీ నేరుగా జోక్యం చేసుకున్నారు. అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితో అదానీ జరిపిన సమావేశంపై కూడా ఆరోపణలు ఉన్నాయి. నరేంద్ర మోడీకి అత్యంత సన్నిహితుడైన అదానీకి, ఎస్ఈసీ పంపిన సమన్లను జారీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం నిరాకరించింది.

## శాండియాగో ఇస్లామిక్ సెంటర్‌లో కాల్పులు

### ముగ్గురు మృతి..పోలీసుల దర్యాప్తు

శాన్ డియాగో,మే19 అమెరికాలో మరోసారి కాల్పుల ఘటన కలకలం రేపింది. శాన్ డియాగోలోని ఒక ఇస్లామిక్ సెంటర్‌లో జరిగిన కాల్పుల్లో ముగ్గురు మరణించారు. మసీదు, ఇస్లామిక్ పాఠశాల ఉన్న సముదాయంలో ఈ దాడి చోటుచేసుకుంది. జాతి విద్వేషం, మతపరమైన ద్వేషమే ఈ ఘటన వెనుక కారణమై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. దక్షిణ కాలిఫోర్నియాలో సోమవారం జరిగిన ఈ ఘటనలో దాడికి పాల్పడిన ఇద్దరు యువకులు కూడా తుపాకీ గాయాలతో మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వారు తమను తామే కాల్చుకున్నట్లు భావిస్తున్నామని శాన్ డియాగో పోలీస్ చీఫ్ స్కాట్ వాల్ వెల్లడించారు. ఇది ఇస్లామిక్ సెంటర్‌లో జరిగిన దాడి కావడంతో, జాతి విద్వేషపూరిత నేరంగా దర్యాప్తు చేస్తున్నాం అని ఆయన మీడియాకు తెలిపారు. దుండగుల వయస్సు 17, 19 సంవత్సరాల మధ్య ఉండొచ్చని అధికారులు పేర్కొన్నారు. మృతులలో ఒకరు ఇస్లామిక్ సెంటర్‌లో భద్రతా సిబ్బందిగా పనిచేస్తున్నారని, ఆయన సమయానికి స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పిందని పోలీసులు తెలిపారు. మరణించిన ముగ్గురూ పెద్దవారేనని, పాఠశాలలో ఉన్న పిల్లలకు ఎలాంటి గాయాలు కాలేదని వెల్లడించారు. ఇస్లామిక్ సెంటర్ ఇమామ్ తాహా హసన్ మాట్లాడుతూ, తమ కేంద్రం ముస్లింలతో పాటు ముస్లిమేతరులు కూడా ప్రార్థనలు, విద్య కోసం వచ్చే ప్రదేశమని చెప్పారు. ప్రార్థనా స్థలాలపై ఇలాంటి దాడులు జరగడం అత్యంత దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. టాడ్ గ్లోరియా మాట్లాడుతూ, శాన్ డియాగోలో జాతి విద్వేషానికి స్థానం లేదని, ముస్లిం సమాజానికి పూర్తి రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఘటనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ, ఇది అత్యంత భయంకరమైన ఘటన అని పేర్కొన్నారు. యూఎస్ కాంగ్రెస్ సభ్యురాలు సారా జాకబ్స్, కాలిఫోర్నియా గవర్నర్ గావిన్ న్యూసమ్ కూడా ఈ దాడిని తీవ్రంగా ఖండించాయి. స్థానిక పోలీసులతో పాటు ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బిఐ) కూడా దర్యాప్తులో పాల్గొంటుందని ఎఫ్‌బిఐ డైరెక్టర్ కాష్ పటేల్ తెలిపారు. ఈ ఘటన నేపథ్యంలో న్యూయార్క్ లోని ప్రధాన మసీదుల వద్ద భద్రతను కట్టుదిట్టం చేసినట్లు అధికారులు వెల్లడించారు.

## రెస్టారెంట్‌లో కాల్పులు

### నలుగురు మృతి..8మందికి తీవ్ర గాయాలు

న్యూఢిల్లీ,మే19 తుర్కియేలో దారుణం చోటుచేసుకుంది. 17 ఏళ్ల ఓ యువకుడు రెస్టారెంట్‌లో తుపాకితో కాల్పులకు తెగబడ్డాడు. ఈ కాల్పుల్లో నలుగురు చనిపోగా.. 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. దక్షిణ తుర్కియేలోని మెర్సిన్ సిటీలో సోమవారం ఈ ఘోరం చోటుచేసుకుంది. స్థానిక మీడియా కథనాల ప్రకారం.. 17 ఏళ్ల ఓ యువకుడు సోమవారం రాత్రి టార్సస్‌లోని ఓ రెస్టారెంట్‌లోకి ప్రవేశించాడు. వెంట తెచ్చుకున్న షాట్ గన్‌తో రెస్టారెంట్‌లోని వారిపై కాల్పులకు తెగబడ్డాడు. అనంతరం అక్కడినుంచి పరారయ్యాడు. ఈ కాల్పుల్లో నలుగరు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడ్డ వారిని దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. చనిపోయిన వారిని రెస్టారెంట్ యజమాని, రెస్టారెంట్ సిబ్బంది, పశువుల కాపరి, ట్రక్ డ్రైవర్‌గా గుర్తించారు.

వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పోలీసు బృందాలు పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నాయి.


# దేశంలో రొయ్యల మార్కెటింగ్ పెంచాలి !



న్యూఢిల్లీ,మే19 మనదేశంలో సరైన విధానాలు లేక పంటలు పండించిన రైతులు నానా యాతన పడుతున్నారు. సరైన మార్కెటింగ్ ఉండదు. సరైన రవాణా సౌకర్యం ఉండదు. సరైన వేదికలు ఉండవు. మదనపల్లి టమోటాలు పండించినా అవి ప్రజలకు చేరవు. నిజామాబాద్ పసుపు ప్రజలకు భారంగా మారింది. గుంటూరు, వరంగల్, ఖమ్మం మిర్చికి పేరొందినా ధర మా÷–తరం ప్రజలకు ఘాటెక్కిస్తుంది. వడ్లు, మక్కలు, శనగలు పండించినా వాటిని ప్రజలకు చేరువ చేసే యంత్రాంగం ఉండదు. దేశంలో ఏ మూల ఏం పండినా అది మారుమూల ప్రజలకు చేరవేసే సమర్థ వంతమైన మెకానిజం దేశంలో ఇంకా బలపడలేదు. అందుకే రైతులు తమ పండించిన పంటలను దేశంలో ఎక్కడైనా అమ్ముకునే వీలు కలగడం లేదు. వ్యాపారులు కూడా వాటిని కొనుగోలు చేసి, ప్రజలకు చేరవేయడం లేదు. మనదగ్గర మక్కలు పండితే ధరలు రావు. కానీ విదేశీ కంపెనీ కెల్లాగ్ వారు కార్న్ ఫ్లేక్స్ మాత్రం వందల్లో డబ్బులు పోసి పావుకిలో కొంటాం. అదే మన మక్కను వాల్యూ యాడెడ్ చేసి అమ్ముకో లేక పోతున్నాం. తాజాగా ఆక్వా రైతుల పరిస్థితి అదేవిధంగా ఉంది. విజినరీ చంద్రబాబు కేంద్రానికి లేఖ రాసి ఆక్వా రైతులను ఆదుకోవాలన్నారే తప్ప, అందుకు మార్గాలను మాత్రం అన్వేషించడం లేదు. సైనికులకు సరిహద్దుల్లో సరైన ఆహారం దొరకడం లేదని ఆరోపణలు ఉన్నాయి. సైన్యం మెనూలో ఆక్వాను చేర్చాలని చంద్రబాబు కోరారు. ఇది మంచి ఆలోచనగానే గుర్తించాలి. అలాగే ప్రజలకు కూడా ఆక్వాను నేరుగా సరఫరా చేయగలగాలి. ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధిలో గణనీయ స్థాయిలో భాగస్వామ్యమవుతున్న చేపల, రొయ్యల రైతులకు ఆపన్నహస్తం అందించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖలు రాసి సరిపెడితే ఎలా అన్నది ఆలోచించాలి. తన పరిధిలోని సమస్యల పరిష్కారానికి కూడా చిత్తశుద్ధి చూపించట్లేదు. డబుల్ ఇంజిన్ సర్కార్ ఈ నిర్వాకం ఆక్వా రైతులను అధోగతి పట్టిస్తోంది. ట్రంప్ సుంకాలు, ధరల పతనం, వ్యాధులు, మేత రేట్ల మోత, పెట్రో ఛార్జీల పెంపు.. ఆక్వా రైతును ఒకదాని వెంట మరొక సమస్య చుట్టుముట్టి గుక్కతిప్పుకోనీయడంలేదు. మరోవైపు రూ.వేల కోట్ల విదేశీ మారకద్రవ్యం, పన్ను ఆదాయాలను తమ బొక్కసంలో వేసుకుంటున్న కేంద్ర ప్రభుత్వానికి, ఇబ్బందులతో సతమతమవుతున్న ఆక్వా రైతులకు ఆదుకోడానికి అస్సలు చేతులు రావట్లేదు. ట్రంప్ అమెరికా అధ్యక్షుడు కాగానే బాదిన సుంకాలతో మొట్టమొదట నష్టపోయింది రొయ్య రైతులు. మన రొయ్యలపై అమెరికా 60 శాతం వరకు దిగుమతి సుకం బాదింది. ఇక్కడ ధరలు 20–30 శాతం పడిపోయాయి. అమెరికా సుంకాల ప్రభావం మన రాష్ట్రం నుంచి ఏటా జరుగుతున్న రూ.25 వేల కోట్ల విలువైన ఆక్వా ఎగుమతులపై పడింది. సుంకాలు తగ్గించేలా మోడీ ప్రభుత్వం ట్రంప్‌తో చర్చలు జరిపి చర్యలు తీసుకోవాలని రైతులు ఆందోళనలు చేపట్టినా ఫలితం కానరాలేదు. ఆక్వా రైతులను ఆదుకోవడానికి ఎపిలో కూటమి ప్రభుత్వం కూడా పెద్దగా పట్టుపట్టడం లేదు. ఒకటికి రెండు సార్లు లేఖలు రాయడం తప్ప టిడిపి ప్రభుత్వం చేసిందేమీ లేదు. అంతలోనే ఫీడ్ కంపెనీలు ఇష్టానుసారం ఏకపక్షంగా ధరలు పెంచేందుకు తెగబడగా రైతాంగం నుంచి తీవ్ర నిరసనలు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దిగి తాత్కాలికంగా ఆపించింది. ఫిబ్రవరిలో ఒకసారి ఫీడ్ ధరలను కిలోపై రూ.4 పెంచాయి. కేంద్రం కొన్ని రకాల పన్నులు తగ్గించిన సందర్భంలో కంపెనీలు నామమాత్రంగా ధరలు తగ్గించి, కొన్ని రోజులకే పెంచాయి. తిరిగి కిలోపై రూ.10 వరకు పెంచుతున్నట్లు ప్రకటించి వెనక్కి తగ్గాయి. ఎపి ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం ప్రకారం ఫీడ్ ధరలను కంపెనీలు తమకు తాము పెంచడానికి వీల్లేదు. ప్రభుత్వం సమక్షంలో రైతులు, కంపెనీల మధ్య సంప్రదింపులతో జరగాలి. వరి, ఆహార ధాన్యాల కంటే చేపలు, రొయ్యల సాగుతో అధిక ఆదాయం వస్తుందని ఊదరగొట్టాయి. దాంతో రొయ్యల సాగు 4.7 లక్షల ఎకరాలకు విస్తరించింది. అనధికారిక సాగు ఇంకా ఎక్కువే ఉంటుంది. ఆక్వా సాగు రోజు రోజుకూ కాస్ట్లీ అయింది. రైతులు ఆ వైపు మళ్లడంతో గాలివాటుగానూ తయారైంది. వ్యాధులు, ప్రకృతి విపత్తులు తరచు నష్టాలు కలిగిస్తున్నాయి. తరచు ధరల పతనం, అదనంగా ట్రంప్ సుంకాల ప్రభావం, తాజాగా యుద్ధం కారణంగా పెట్రోలు, డీజిల్‌కు కొరత. అంతలోనే వాటి ధరల పెంపు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. కూటమి సర్కార్ తాము ఫీడ్ ధరలు తగ్గించామని, యూనిట్ విద్యుత్‌ను రూ.1.50కే ఇస్తున్నామంటోంది. పెరిగిన ఫీడ్ ధరలతో పోల్చితే ప్రభుత్వం తగ్గించింది చాలా తక్కువ. విద్యుత్ సబ్సిడీకి సైతం పలు ఆంక్షలు అమలవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలోని ఫీడ్ ఛార్జీలు సహా ఇతర సమస్యలను పరిష్కరించి ఆక్వారైతులను, ఆ రంగంపై ఆధారపడ్డ లక్షలాది మందిని ఆదుకోవాల్సి ఉంది. అమెరికా ఆంక్షల నేపథ్యంలో ఇప్పుడు దేశీయంగా వీటిని ప్రజలకు చేరువ చేయాలి. 140 కోట్లకు పైగా ఉన్న మన దేశ ప్రజలకు సమతుల్య ఆహారం అవసరం. ఇందులో చేపలు, రొయ్యలు కూడా చేర్చాలి. అందుకు ప్రభుత్వాలు కార్యాచరణ చేయాలి. ప్రజల ఆహారం లో మన పంటలు చేరేలా ప్రణాళికలు సిద్ధం చేస్తే, ఏ పంటయినా అమ్ముడు పోతుంది. మనదేశంలోని అన్ని పట్టణాలకు రొయ్యలు చేరేలా చేయాలి. అలా చేయకుండా ఎన్ని ప్రకటనలు గుప్పించినా లాభం లేదు. ఇప్పటికీ హైదరాబాద్ లాంటి ప్రాంతాలకు సక్రమంగా రొయ్యలు చేరడం లేదు. రైతులు పండించే పంటలకు సరైన మార్కెటింగ్ వ్యవస్థ లేనంత కాలం ఇలాంటి సంక్షోభాలు ఎదుర్కోవాల్సిందే. అందుకు ప్రభుత్వాలదే బాధ్యత.

# ఎబోలా అరికట్టే చర్యలు బలోపేతం

- ఆఫ్రికా దేశాల నుంచి వచ్చే వారిపై ఆంక్షలు
- వీసాలను తాత్కాలికంగా నిలిపివేసిన అమెరికా



వాషింగ్టన్,మే19 ఎబోలా వ్యాప్తిని నివారించడానికి ముందుజాగ్రత్త చర్యలను బలోపేతం చేస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. దీనిలో భాగంగా వ్యాధి వ్యాప్తి చెందిన ఆఫ్రికా ప్రాంతాల నుండి వచ్చే విమాన ప్రయాణికులను పరీక్షించడంతో పాటు, వీసాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అమెరికా రాయబార కార్యాలయం వెల్లడించింది. డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (డి ఆర్ సి) లో ప్రాణాంతకమైన ఎబోలా వ్యాప్తిని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు హెచ్ ఒ) అత్యవసర పరిస్థితిగా ప్రకటించిన నేపథ్యంలో, యుఎస్ సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సిడిసి) ఈ నివారణ చర్యలను చేపట్టింది. విమానాశ్రయాలలో స్క్రీనింగ్‌తో పాటు, గత 21 రోజులలోపు ఉగాండా, డి ఆర్ సి, దక్షిణ సూడాన్‌లకు ప్రయాణించిన అమెరికా యేతర పాస్‌పోర్ట్ హోల్డర్లపై ప్రవేశ ఆంక్షలను అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఉగాండాలోని కంపాలాలో ఉన్న అమెరికా రాయబార కార్యాలయం అన్ని వీసా సేవలను తాత్కాలికంగా నిలిపివేసి, ప్రభావితమైన దరఖాస్తుదారులకు సమాచారం అందించింది. డి ఆర్ సి లో ఉన్న ఒక అమెరికన్ సిబ్బందికి ఎబోలా వైరస్ సోకినట్లు డబ్ల్యుహెచ్ ఒ ప్రతినిధి సతీష్ పిళ్ళై ధృవీకరించారు. ఆ వ్యక్తికి పరీక్షల్లో పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో, చికిత్స నిమిత్తం జర్మనీకి తరలించేందుకు యత్నిస్తున్నామని అన్నారు. అలాగే అతనితో పరిచయం ఉన్న మరో ఆరుగురిని క్వారంటైన్‌కు తరలించినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రజలకు తక్షణ ప్రమాదం తక్కువగానే ఉందని అంచనా వేస్తున్నామని, అయితే మారుతున్న పరిస్థితులను నిరంతరం సమీక్షిస్తున్నట్లు సిడిసి తెలిపింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఈ వ్యాధి వ్యాప్తిపై ఆందోళన వ్యక్తం చేస్తూనే, ప్రస్తుతానికి ఇది ఆఫ్రికాకే పరిమితమైందని తాను భావిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే, ఈ ఎబోలా సంక్షోభంపై ట్రంప్ ప్రభుత్వం స్పందిస్తున్న తీరుపై అంతర్జాతీయంగా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా ఈ ఏడాది ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ ఒ) నుండి అధికారికంగా వైదొలగడం, గతంలో ఎబోలా నివారణలో కీలక పాత్ర పోషించిన 'యుఎస్ ఎఐడి' (యుఎస్ ఎఐడి) నిధులలో కోత విధించడం ప్రస్తుత నియంత్రణ ప్రయత్నాలపై ప్రతికూల ప్రభావం చూపిందనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుతం తీసుకుంటున్న ప్రయాణ నిషేధాలు కేవలం నాటకమేనని, ట్రంప్ ప్రభుత్వం ఈ విషయంలో చాలా వెనుకబడి వ్యవహరిస్తోందని జార్జ్‌టౌన్ యూనివర్సిటీ నిపుణులు మాథ్యూ కావనాగ్ విమర్శించారు. గతంలో ప్రభుత్వ ఏజెన్సీల సమన్వయం వల్ల వ్యాధిని వేగంగా అరికట్టగలిగారని, కానీ ఇప్పుడు వందలాది కేసులు నమోదై, తీవ్రంగా వ్యాపించిన తర్వాతే చర్యలు చేపట్టడం అమెరికా వ్యూహాత్మక వైఫల్యమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. తాము స్థానిక ఆరోగ్య సంస్థలతో కలిసి పనిచేస్తున్నామని, తక్షణ ప్రతిస్పందన చర్యల కోసం 13 మిలియన్ డాలర్ల సహాయాన్ని సమీకరించినట్లు సిడిసి ప్రకటించింది.

## భూసార ఆరోగ్య పరిరక్షణలో శ్రద్ధ అవసరం

### పచ్చిరొట్ట విత్తనాలు, జిప్సం వాడకంపై జాగ్రత్తలు

### రైతునేస్తం 92వ ఎపిసోడ్ కార్యక్రమంలో రైతులకు దిశానిర్దేశం

హైదరాబాద్,మే19 రాష్ట్రవ్యాప్తంగా రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడంతో పాటు పంట దిగుబడుల్లో కీలకపాత్ర పోషించే భూసార ఆరోగ్య పరిరక్షణ, రసాయన ఎరువుల వినియోగం తగ్గింపు లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు, 90 శాతం సబ్సిడీపై జిప్సం ఎరువులను అందిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలో నిర్వహించిన రైతు నేస్తం 92వ ఎపిసోడ్ కార్యక్రమంలో రాష్ట్రంలోని సుమారు 1,600 వేదికల ద్వారా వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యంతో రైతులు, వ్యవసాయ అధికారులు ప్రత్యక్షంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి కే. సురేంద్రమోహన్, వ్యవసాయ శాఖ సంచాలకులు బి. గోపి, ఉద్యానవన శాఖ సంచాలకులు యాస్మిన్ భాష, తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు, జిప్సం ఎరువులు పంపిణీ చేసారు. అనంతరం పచ్చిరొట్ట పంటల సాగు, జిప్సం వాడకం ద్వారా భూసార ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీదేవి రైతులకు సాంకేతిక వివరాలు తెలియజేశారు. ÷ార్యక్రమంలో భాగంగా వృత్తిరీత్యా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయినప్పటికీ వ్యవసాయంపై ఆసక్తితో ఆయిల్‌పామ్ సాగు చేస్తూ మంచి లాభాలు పొందుతున్న ఖమ్మం జిల్లా రఘునాథపల్లి రైతు మహేష్ తన అనుభవాలను వివరించారు. జిప్సం వాడకం ద్వారా క్షార ప్రభావిత భూముల్లో సాధించిన ఫలితాలను, ఉద్యాన పంటల్లో వచ్చిన లాభాలను సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం రంజోల్ గ్రామానికి చెందిన నాగేశ్వర్ రెడ్డి వివరించారు. అలాగే పచ్చిరొట్ట పంటలైన జీలుగ, జనుము సాగు ద్వారా రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించిన అనుభవాలను సిద్దిపేట జిల్లా కోహెడ మండలం శనిగరం గ్రామానికి చెందిన మహేందర్, నిజామాబాద్ జిల్లా ఆలూరు గ్రామానికి చెందిన సూర్యరెడ్డి రైతులతో పంచుకున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ భూసార ఆరోగ్య పరిరక్షణ ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. పంట దిగుబడుల్లో నేల ఆరోగ్యం కీలకపాత్ర పోషిస్తుందని, రైతులు భూసార పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. భూమిలో సేంద్రియ కర్బనాన్ని పెంపొందించడంతో పాటు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించడంలో పచ్చిరొట్ట పంటలు ముఖ్యపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఈ క్రమంలో జీలుగ, జనుము, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు 50 శాతం సబ్సిడీపై అందిస్తున్నట్లు చెప్పారు. సాయిల్ హెల్త్ అండ్ ఫెర్టిలిటీ పథకం ద్వారా 90 శాతం సబ్సిడీపై జిప్సం ఎరువులు అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 22 జిల్లాల్లో 11,456 మెట్రిక్ టన్నుల జిప్సం పంపిణీకి ప్రణాళిక సిద్ధం చేసినట్లు, ఇప్పటికే 10 జిల్లాల్లో 3,523 మెట్రిక్ టన్నుల జిప్సం అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. బ్సిడీపై అందిస్తున్న పచ్చిరొట్ట విత్తనాలు, జిప్సం ఎరువులపై క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు. కార్యక్రమం చివరలో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన రైతులు అడిగిన సాగు సంబంధిత సందేహాలకు వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు సమాధానాలు ఇచ్చారు.

# కాక్‌టెయిల్-2 విభిన్నమైన మూవీ

**హీరోయిన్ రష్మిక మందన్నా**

వైవిధ్యమైన పాత్రలో ప్రేక్షకుల్ని అలరిస్తూ మెప్పిస్తుంటుంది కథానాయిక రష్మిక. ప్రస్తుతం ఆమె 'కాక్‌టెయిల్ 2' సినిమాతో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. హిందీ హీరో షాహిద్ కపూర్, కృతి సనన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రమిది. హోమి అడజానియా దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను ఈ నెల 29న విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఇటీవలే ఈ చిత్రానికి సంబంధించిన మ్యూజికల్ ఈవెంట్‌ను నిర్వహించింది చిత్రబృందం. రష్మిక మాట్లాడుతూ.. 'కాక్‌టెయిల్ 2' చాలా భిన్నమైన చిత్రం. మీ ఊహకు కూడా అందదు. ముఖ్యంగా ఈ సినిమాలో కృతి అద్భుతంగా నటించింది. మాకు, షాహిద్‌కు మధ్య కెమిస్ట్రీ మరో స్థాయిలో ఉంటుంది. ఈ భిన్నమైన ప్రేమకథను అందరూ ఎంజాయ్ చేస్తారు. ఇప్పటి వరకూ మీరు చూసింది చాలా తక్కువ. ముందు ముందు మంచి సర్‌ప్రైజ్‌లు



ఉన్నాయి. వాటిని చూడడం కోసం నేను కూడా ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా' అని చెప్పుకొచ్చింది. మడాక్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం జూన్ 19న థియేటర్లలోకి రాబోతుంది.

# 23న భోపాల్‌లో పెద్ది సందడి


రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న చిత్రం 'పెద్ది'. జూన్ 4న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ప్రముఖ నగరాల్లో దీని స్పెషల్ ఈవెంట్‌ను నిర్వహించాలని టీమ్ భావిస్తోంది. తాజాగా ముంబయిలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ జరిగిన విషయం తెలిసిందే. దీని తర్వాత మే 23న మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఏఆర్ రెహమాన్‌తో లైవ్ కాన్సర్ట్‌ను నిర్వహించనున్నారు. భారీ స్థాయిలో జరగనున్న ఈ ఈవెంట్ కోసం టీమ్ పనులు ప్రారంభించింది. తాజాగా భోపాల్‌లోని బీహెచ్‌ఈఎల్ గ్రౌండ్స్‌లో పూజా కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇప్పటికే 'పెద్ది'నుంచి వచ్చిన రెండు పాటలు సూపర్ హిట్‌గా నిలిచి కోట్లలో వ్యూస్‌ను సొంతం చేసుకున్నాయి. ఇప్పుడు స్పెషల్ సాంగ్ రానుండడంతో అందరిలో ఆసక్తి నెలకొంది. 'పెద్ది'లో స్పెషల్ సాంగ్ హైలైట్‌గా నిలుస్తుందని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో బుచ్చిబాబు తెలిపారు. ఆ పాట ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ బ్లాస్ట్ అని పేర్కొన్నారు. ఇక




తాజాగా విడుదలైన 'పెద్ది' ట్రైలర్ అన్ని భాషల్లో కలిపి 63 మిలియన్ల వ్యూస్ వచ్చినట్లు టీమ్ తెలిపింది. అన్ని సోషల్ మీడియా వేదికల్లోనూ అది ట్రెండింగ్‌లో ఉందని పేర్కొంది. రామ్‌చరణ్‌కు జోడీగా జాన్వీకపూర్ నటిస్తోన్న ఈ సినిమాలో శివరాజ్ కుమార్, జగపతి బాబు కీలకపాత్రల్లో కనిపించనున్నారు.

# పంత్ కెరీర్ ముగిసినట్లేనా..?

ఐపీఎల్ 2026 ముగియక ముందే భారత క్రికెట్‌లో మరో భారీ ట్విస్ట్ చోటుచేసుకుంది. ఆఫ్ఘనిస్తాన్‌తో జూన్ 6 నుంచి ప్రారంభమయ్యే ఏకైక టెస్టు కోసం బీసీసీఐ ప్రకటించిన జట్టులో అత్యంత హాట్ టాపిక్‌గా మారింది రిషబ్ పంత్ డిమోషన్. టీమ్ఇండియా భవిష్యత్ నాయకుల్లో ఒకడిగా భావించిన పంత్‌ను టెస్టు వైస్ కెప్టెన్సీ నుంచి తప్పిస్తూ.. అనుభవజ్ఞుడు కేఎల్ రాహుల్‌కు ఆ బాధ్యతలు అప్పగించారు. ఈ నిర్ణయం ఇప్పుడు భారత క్రికెట్ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీసింది. రోహిత్ శర్మ టెస్టులకు వీడ్కోలు పలికిన తర్వాత భారత జట్టులో నాయకత్వ మార్పులు వేగంగా జరిగాయి. యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్‌ను టెస్టు కెప్టెన్‌గా ఎంపిక చేసిన సెలెక్టర్లు.. అప్పట్లో రిషబ్ పంత్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించారు. కానీ ఇప్పుడు కేవలం కొద్ది కాలంలోనే పంత్ నుంచి ఆ బాధ్యతలను తీసేసి, కేఎల్ రాహుల్‌కు అప్పగించడం గమనార్హం. జూన్ 6 నుంచి ముల్లన్‌పూర్ వేదికగా ప్రారంభమయ్యే ఈ టెస్టులో శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా జట్టును నడిపించనున్నాడు. అతనికి డిప్యూటీగా కేఎల్ రాహుల్ వ్యవహరించనున్నాడు. ఈ మార్పుతో టీమ్ఇండియా మేనేజ్‌మెంట్ భవిష్యత్ నాయకత్వంపై స్పష్టమైన సంకేతాలు ఇచ్చిందని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. రిషబ్ పంత్‌ను వైస్ కెప్టెన్సీ నుంచి తొలగించడం ఒక్కసారిగా తీసుకున్న నిర్ణయం కాదని తెలుస్తోంది. దీనికి పలు కారణాలు ఉన్నాయని బీసీసీఐ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా కెప్టెన్సీ ఒత్తిడి అతని సహజమైన దూకుడు బ్యాటింగ్‌ను ప్రభావితం చేస్తోందనే అభిప్రాయం సెలెక్టర్లలో బలపడిందని సమాచారం. ఐపీఎల్ 2026లో లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్‌గా పంత్ ప్రదర్శన తీవ్ర విమర్శలకు గురైంది. బ్యాటింగ్‌లోనూ అతను ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. కీలక మ్యాచ్‌ల్లో తీసుకున్న నిర్ణయాలు



కూడా ప్రశ్నార్థకంగా మారాయి. దీంతో నాయకత్వ బాధ్యతల కంటే అతను పూర్తిగా బ్యాటింగ్‌పైనే దృష్టి పెట్టాలని బోర్డు భావించినట్లు తెలుస్తోంది. అంతేకాదు.. గతంలో దక్షిణాఫ్రికా టెస్టు సిరీస్‌లో శుభ్‌మన్ గిల్ మైదానం వెలుపల ఉన్న సమయంలో పంత్ తాత్కాలిక కెప్టెన్‌గా వ్యవహరించాడు. అయితే ఆ సమయంలో అతని ఫీల్డ్ సెట్టింగ్స్, బౌలింగ్ మార్పులు టీమ్ మేనేజ్‌మెంట్‌ను పెద్దగా ఆకట్టుకోలేదని సమాచారం. రిషబ్ పంత్ అంటే భారత అభిమానులకు వెంటనే గుర్తొచ్చేది గబ్బా హీరోయిక్స్. ఒంటరిగా మ్యాచ్‌ను తిప్పేసే దూకుడు. ఎలాంటి ఒత్తిడి లేకుండా ఆడినప్పుడు పంత్ అత్యంత ప్రమాదకరమైన మ్యాచ్ విన్నర్‌గా మారతాడని బీసీసీఐ నమ్ముతోంది. అందుకే ఇప్పుడు అతనిపై ఉన్న నాయకత్వ భారం తగ్గించి, పూర్తిగా వికెట్ కీపర్-బ్యాటర్ పాత్రకే పరిమితం చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి సీనియర్ దిగ్గజాలు క్రమంగా టెస్టు జట్టుకు దూరమవుతున్న నేపథ్యంలో ఇప్పుడు అనుభవజ్ఞుల కొరత స్పష్టంగా కనిపిస్తోంది. ఇలాంటి సమయంలో కేఎల్ రాహుల్ జట్టులో అత్యంత అనుభవం ఉన్న ఆటగాళ్లలో ఒకడిగా నిలిచాడు. రాహుల్ ఇప్పటికే భారత జట్టుకు మూడు టెస్టుల్లో కెప్టెన్‌గా వ్యవహరించాడు. 2022లో జోహన్నెస్‌బర్గ్‌లో దక్షిణాఫ్రికాపై భారత్‌ను నడిపించడంతో పాటు.. బంగ్లాదేశ్ పర్యటనలో కూడా నాయకత్వ బాధ్యతలు చేపట్టాడు. ప్రశాంత స్వభావం, క్లిష్ట పరిస్థితుల్లో స్థిరంగా ఆలోచించే తీరు అతనికి ప్లస్ పాయింట్‌గా మారాయి. అందుకే యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు సరైన సపోర్ట్‌గా రాహుల్‌ను సెలెక్టర్లు ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. రిషబ్ పంత్‌కు ఎదురైన ఎదురుదెబ్బ కేవలం టెస్టులకే పరిమితం కాలేదు. అతను ఇప్పటికే టీ20 సెటప్‌కు దూరమయ్యాడు. ఇప్పుడు ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న మూడు వన్డేల సిరీస్‌కు కూడా అతనికి చోటు దక్కలేదు. దీంతో మూడు ఫార్మాట్లలోనూ తన స్థానాన్ని నిలబెట్టుకోవడానికి పంత్ ఇప్పుడు భారీగా పరుగులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దేశీయ క్రికెట్, రాబోయే సిరీస్‌లలో తన బ్యాట్‌తోనే సమాధానం చెప్పాల్సిన ఒత్తిడి ఇప్పుడు పంత్‌పై స్పష్టంగా కనిపిస్తోంది.



## గుజరాత్ టైటాన్స్ నుంచి అత్యధికంగా నలుగురు..

బీసీసీఐ మంగళవారం అఫ్గానిస్తాన్‌తో జరగబోయే వన్డే సిరీస్ కోసం 15 మందితో కూడిన టీమిండియాను ప్రకటించింది. శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని ఈ జట్టు ఎంపికలో ప్రస్తుత ఐపీఎల్ 2026 ప్రదర్శనలు స్పష్టమైన ప్రభావాన్ని చూపించాయి. అయితే ఈ జట్టులో ఐపీఎల్ ఫ్రాంచైజీల వారీగా ఆటగాళ్ల ప్రాతినిధ్యం ఎలా ఉందో చూస్తే పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ వన్డే సిరీస్ జట్టులో గుజరాత్ టైటాన్స్ ఫ్రాంచైజీ నుంచి అత్యధికంగా నలుగురు ఆటగాళ్లు చోటు దక్కించుకున్నారు. భారత జట్టును ముందుండి నడిపించబోయే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఈ జాబితాలో మొదటి స్థానంలో ఉన్నాడు. గాయం కారణంగా గత వన్డే సిరీస్‌కు దూరమైన ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ తిరిగి జట్టులోకి వచ్చాడు. ఫాస్ట్ బౌలర్ ప్రసిద్ధ్ కృష్ణ కూడా తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. అయితే అందరినీ ఆశ్చర్యపరుస్తూ, గుజరాత్ తరపున ఇంకా ఐపీఎల్ అరంగేట్రం కూడా చేయని యువ బౌలర్ గుర్నూర్ బ్రార్‌కు తొలిసారి జాతీయ జట్టు నుంచి పిలుపు రావడం గమనార్హం.ఈ సీజన్‌లో అద్భుత ఫామ్‌లో ఉన్న సన్‌రైజర్స్ హైదరాబాద్ నుంచి ముగ్గురు ఆటగాళ్లను సెలెక్టర్లు ఎంపిక చేశారు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ, 2026 టీ20 ప్రపంచకప్, ఆపై ఐపీఎల్‌లో పరుగుల వరద పారించిన ఇషాన్ కిషన్ భారీ పునరాగమనం చేశాడు. తెలుగు తేజం నితీష్ కుమార్ రెడ్డి కూడా వన్డే జట్టులో తన స్థానాన్ని కాపాడుకున్నాడు. ఇక హైదరాబాద్ స్పిన్నర్ హర్ష్ దూబే ఈ ఐపీఎల్‌లో 8 వికెట్లతో రాణించడంతో, అతడికి తొలిసారి భారత జట్టులో అవకాశం కల్పించారు.ముంబై ఇండియన్స్ నుంచి సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యా ఎంపికైనప్పటికీ, వీరిద్దరి లభ్యత వారి ఫిట్‌నెస్‌పైనే ఆధారపడి ఉంటుంది. రోహిత్ పిక్క కండరాల గాయంతో, పాండ్యా నడుము నొప్పితో బాధపడుతున్నారు. ఢిల్లీ క్యాపిటల్స్ నుంచి వికెట్ కీపర్ బ్యాటర్ కేఎల్ రాహుల్, స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ ఎంపికయ్యారు. పంజాబ్ కింగ్స్ నుంచి ఎడమచేతి వాటం బౌలర్ అర్ష్‌దీప్ సింగ్‌తో పాటు, ఆ జట్టు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌ను ఈ సిరీస్‌కు వైస్ కెప్టెన్‌గా నియమించారు.రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు నుంచి రన్ మెషీన్ విరాట్ కోహ్లీ ఒక్కడే జట్టులో ఉన్నాడు. లక్నో సూపర్ జయంట్స్ తరపున ఐపీఎల్‌లో విరాట్ కోహ్లీ వికెట్ తీసి సంచలనం సృష్టించిన యువ ఫాస్ట్ బౌలర్ ప్రిన్స్ యాదవ్‌కు తొలిసారి భారత జట్టులో చోటు దక్కింది. కాగా, ఐదుసార్లు ఛాంపియన్ అయిన చెన్నై సూపర్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్, రాజస్థాన్ రాయల్స్ జట్ల నుంచి ఒక్క ఆటగాడికి కూడా ఈ 15 మంది జట్టులో చోటు దక్కకపోవడం అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది.

# ఆఫ్ఘనిస్తాన్ వన్డే సిరీస్‌కు భారత జట్టు ప్రకటన

**జట్టులోకి హర్ష్ దూబె, గుర్నూర్ బ్రార్, ప్రిన్స్ యాదవ్**

ఐపీఎల్ 2026 ఫీవర్ ముగిసేలోపే టీమ్ఇండియా మళ్లీ ఇంటర్నేషనల్ క్రికెట్ మోడ్‌లోకి ఎంటర్ కానుంది. మే 31న ఐపీఎల్ ఫైనల్‌తో మెగా టోర్నీ ముగియనుండగా.. వెంటనే జూన్‌లో అఫ్గానిస్థాన్‌తో కీలక సిరీస్‌కు భారత్ సిద్ధమవుతోంది. స్వదేశంలో జరగనున్న ఈ సిరీస్‌లో ఒక టెస్టు, మూడు వన్డేలు ఉండనున్నాయి. ఈ టూర్ కోసం భారత సీనియర్ సెలక్షన్ కమిటీ తాజాగా జట్లను ప్రకటించింది. ఈసారి జట్టులో యువ ఆటగాళ్లకు పెద్దపీట వేయడం విశేషం. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ కారణంగా విశ్రాంతి ఇచ్చారు. మరోవైపు వన్డే జట్టులో రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యలకు చోటు దక్కినా.. వారి ఎంపిక ఫిట్‌నెస్ క్లియరెన్స్‌పై ఆధారపడి ఉంటుందని సెలెక్టర్లు స్పష్టం చేశారు. చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ మాట్లాడుతూ.. మహ్మద్ షమి విషయంపై సెలక్షన్ కమిటీ చర్చించలేదని తెలిపారు. ఈ సిరీస్‌లో యువ క్రికెటర్లకు భారీ అవకాశం దక్కింది. హర్ష్ దూబె, గుర్నూర్ బ్రార్, ప్రిన్స్ యాదవ్ తొలిసారిగా భారత జట్టులో స్థానం సంపాదించారు. ముఖ్యంగా ప్రిన్స్ యాదవ్ వన్డే జట్టులోనే చోటు దక్కించుకోవడం ఆసక్తికరంగా మారింది. టెస్టు జట్టుకు యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేశారు. వైస్ కెప్టెన్‌గా కేఎల్ రాహుల్ వ్యవహరించనున్నాడు. యశస్వి జైస్వాల్, సాయి సుదర్శన్, రిషభ్ పంత్, దేవ్‌దత్ పడిక్కల్ వంటి యువ ఆటగాళ్లతో జట్టు బలంగా కనిపిస్తోంది. బౌలింగ్ విభాగంలో మహ్మద్ సిరాజ్, కుల్‌దీప్ యాదవ్ కీలక బాధ్యతలు తీసుకోనున్నారు. వన్డే జట్టులో మాత్రం అనుభవం-యువత కలయిక కనిపిస్తోంది. కెప్టెన్‌గా మళ్లీ శుభ్‌మన్ గిల్‌కే బాధ్యతలు అప్పగించగా.. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, శ్రేయస్ అయ్యర్ వంటి సీనియర్ బ్యాటర్లు జట్టుకు బలం కానున్నారు. ఇషాన్ కిషన్ తిరిగి వన్డే సెటప్‌లో చోటు సంపాదించగా.. అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ వంటి పేసర్లు అఫ్గాన్ బ్యాటర్లకు సవాల్ విసరనున్నారు.

అఫ్గాన్‌తో ఏకైక టెస్టుకు భారత జట్టు..

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), సాయి సుదర్శన్, రిషభ్ పంత్, దేవ్‌దత్ పడిక్కల్, వాషింగ్టన్ సుందర్, మహ్మద్ సిరాజ్, కుల్‌దీప్ యాదవ్, నితీష్ కుమార్ రెడ్డి, మానవ్ సుతార్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, ధ్రువ్ జురెల్, హర్ష్ దూబె.

## ఒకే బెర్త్.. ఐదు జట్లు పోటీ..




ఐపీఎల్ 2026 ప్లేఆఫ్స్ రేసులో మూడు బెర్త్‌లు కన్ఫార్మ్ అయ్యాయి. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఇప్పటికే ప్లేస్ ఫిక్స్ చేసుకోగా.. చెన్నై సూపర్ కింగ్స్‌ను ఓడించిన తర్వాత సన్‌రైజర్స్ హైదరాబాద్‌తోపాటు గుజరాత్ టైటాన్స్ కూడా ప్లే ఆఫ్స్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. మూడు జట్లు తమ స్థానాలను ఖరారు చేసుకోగా.. మిగిలిన ఒక స్థానం కోసం ఐదు జట్ల మధ్య పోటీ నెలకొంది. ముంబై ఇండియన్స్, లక్నో సూపర్ జెయింట్స్ అధికారికంగా ప్లే ఆఫ్స్ నుంచి తప్పుకోగా.. పంజాబ్ కింగ్స్, చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్లు ఒక స్థానం కోసం పోటీ పడుతున్నాయి. ఈ సీజన్‌లో ఫస్టాఫ్‌లో అదరగొట్టిన పంజాబ్ కింగ్స్.. సెకండాఫ్‌లో పూర్తిగా తేలిపోయింది. వరుసగా ఆరు మ్యాచ్‌ల్లో ఓటమితో ప్లే ఆఫ్స్ ఆశలు సంక్లిష్టం చేసుకుంది. లక్నో సూపర్ జెయింట్స్‌తో ఆఖరి మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ తలపడాల్సి ఉంది. ఈ మ్యాచ్‌లో పంజాబ్ గెలిస్తే.. 15 పాయింట్లకు చేరుకుంటుంది. అదే సమయంలో రాజస్థాన్ రాయల్స్ తమ రెండు మ్యాచ్‌లలో కచ్చితంగా ఒక మ్యాచ్‌లో ఓడిపోవాలి. కేకేఆర్ కూడా ఒక మ్యాచ్‌లో ఓడిపోవాలి. ఒకవేళ కేకేఆర్ రెండు మ్యాచ్‌లు గెలిచినా.. నెట్ రన్ రేట్‌లో పంజాబ్ కంటే వెనుకబడాలి. లక్నో చేతిలో పంజాబ్ ఓడిపోతే.. 13 పాయింట్ల వద్దే ఆగిపోయి.. కేకేఆర్, రాజస్థాన్, ఢిల్లీ, చెన్నై జట్ల ఓటమి కోసం ప్రార్థించాల్సి ఉంటుంది.రాజస్థాన్ రాయల్స్‌కు ఇంకా రెండు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఇవాళ లక్నో సూపర్ జెయింట్స్‌తో.. మరొకటి ఆదివారం ముంబై ఇండియన్స్‌తో ఆడనుంది. రెండు మ్యాచ్‌ల్లో గెలిస్తే.. 16 పాయింట్లతో ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా నేరుగా ప్లే ఆఫ్స్‌కు చేరుకుంటుంది. ఒకవేళ రాజస్థాన్ ఒక్క మ్యాచ్‌లో గెలిచి.. ఒకటి ఓడిపోతే.. అప్పుడు 14 పాయింట్లతో ఉంటారు. పంజాబ్ కింగ్స్, కేకేఆర్ జట్లతోపాటు చెన్నై, ఢిల్లీ జట్ల ఓటమి కోసం ఎదురుచూడాల్సి ఉంటుంది. రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోతే.. టోర్నీ నుంచి ఔట్ అవుతుంది.సన్‌రైజర్స్ హైదరాబాద్ చేతిలో ఓటమి కావడంతో ప్లేఆఫ్స్‌కు చేరేందుకు చెన్నై సూపర్ కింగ్స్ అవకాశాలు సంక్లిష్టంగా మారాయి. చివరి మ్యాచ్‌లో గెలిస్తే.. 14 పాయింట్లకు చేరుకుంటుంది. అదేసమయంలో పంజాబ్ తమ చివరి మ్యాచ్‌లో ఓడిపోవాలి. రాజస్థాన్ తప్పనిసరిగా రెండు మ్యాచ్‌లలోనూ ఓడిపోవాలి. కేకేఆర్, ఢిల్లీ కూడా గెలవకూడదు. చెన్నై అవకాశాలు రాజస్థాన్ రాయల్స్, పంజాబ్ కింగ్స్ జట్ల ఫలితాలపై ఎక్కువగా ఆధారపడి ఉంది. 12 మ్యాచ్‌లు ఆడిన కోల్‌కతా నైట్‌రైడర్స్ 11 పాయింట్లతో 8వ స్థానంలో ఉంది. మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో గెలిస్తే.. 15 పాయింట్లకు చేరుకుంటుంది. అదే సమయంలో పంజాబ్ తమ చివరి మ్యాచ్‌లో ఓడిపోవాలి. రాజస్థాన్ రాయల్స్ కూడా కనీసం ఒక మ్యాచ్‌లో ఓడిపోవాలి. అప్పుడు కేకేఆర్ ప్లే ఆఫ్స్‌లోకి చేరుకుంటుంది. వరుసగా రెండు విజయాలతో టోర్నీని ఆరంభించిన ఢిల్లీ క్యాపిటల్స్.. ఆ తరువాత పడుతూ లేస్తూ వచ్చింది. గత రెండు మ్యాచ్‌ల్లో విజయంతో ప్లే ఆఫ్స్ ఆశలు సజీవంగా ఉంచుకుంది. ప్రస్తుతం 12 పాయింట్లతో ఉన్న ఢిల్లీ.. మరో మ్యాచ్ కేకేఆర్‌తో ఆడాల్సి ఉంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే 14 పాయింట్లకు చేరుకుంటుంది. అదే సమయంలో రాజస్థాన్ తన రెండు మ్యాచ్‌లలోనూ ఓడిపోవడంతోపాటు పంజాబ్, చెన్నై కూడా జట్లు కూడా గెలవకూడదు.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers, RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609